thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 319 కరీంనగర్ ఆదివారం, 25 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## వాయుసేనలో ప్రైవేటు భాగస్వామ్యం తప్పనిసరి

న్యూఢిల్లీ : భారత వాయుసేన సామర్థ్యం పెంపునకు ప్రైవేటు భాగస్వామ్యాన్ని తీసుకోక తప్పదని ఉన్నత స్థాయి కమిటీ అభిప్రాయపడింది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యల్లో భాగంగా ప్రైవేటు సంస్థల సహకారం తీసుకొని లోటుపాట్లను సరిదిద్దుకో వాల్సి ఉందని తెలిపింది. సకాలంలో యుద్ధ విమానాలు అందక ఇబ్బం దులు ఎదురవుతున్నట్టు సాక్షాత్తూ వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ బహిరంగంగా చెప్పిన నేపథ్యంలో కమిటీ చేసిన ఈ సూచనకు ప్రాధాన్యం ఏర్పడింది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలోని సాధికారిక కమిటీ రక్షణ మంత్రికి అందజేసిన నివేదికలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రస్తావించింది. యుద్ధ విమానాల తయారీ, ఇతర అంశాల్లో ప్రైవేటు భాగస్వామ్యం తీసుకోవాలని ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసింది.

# ఎన్నికల బరిలోకి కేసీఆర్ కూతురు..

## సింహం గుర్తుతోరంగంలోకి...






ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి సింహం గుర్తు ఎప్పటినుంచో ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలన్న, ఏదైనా పార్టీ రెబల్గా పోటీ చేయాలన్న ఈ సింహం గుర్తుపై చాలామంది ఆధారపడతారు. గతంలో మంత్రి జూపల్లి బిఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తిరుగుబాటు జెండా ఎగరవేసి కొల్లాపూర్ మున్సిపాలిటీలో మెజార్టీ సీట్లు సాధించారు. సింహం గుర్తు ప్రజల్లో ఆకట్టుకునే లాగా ఉండడంతో పాటు... రెబల్ లుక్ ఇవ్వడం, ఈజీ సింబల్ కావడంతో ప్రజలు త్వరగా ఆకర్షితులవుతారు.

గత రెండు దశాబ్దాలుగా ప్రతి ఎన్నికల్లో ఈ సింహం గుర్తు ప్రధాన పార్టీలతో పాటు కనిపిస్తూ వస్తుంది. అందుకే కవిత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేతలతో చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ మున్సిపల్ ఎన్నికల వరకు ఫార్వర్డ్ బ్లాక్ బీ ఫార్మ్?లతో జాగృతి అభ్యర్థులు పోటీ చేయనున్నట్టు తెలుస్తోంది. ఎన్నికల జరుగుతున్న అన్ని మున్సిపాలిటీలోనూ జాగృతి పోటీ చేయనున్నట్లు సమాచారం. జాగృతి పార్టీ రిజిస్ట్రేషన్ కంప్లీట్ కావడానికి ఇంకొక నాలుగు ఐదు నెలల సమయం పడుతుంది. ఈనెల 27న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. దీంతో అంత సమయం లేనందున సింహం గుర్తుతో పోటీకి దిగాలని కవిత నిర్ణయించుకున్నారు. అయితే సింహం గుర్తుతో పోటీ చేయనున్న కవిత అభ్యర్థులు ఎవరి ఓట్లను మింగేయనున్నారు అనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది. ఇది ప్రభుత్వ వ్యతిరేకత ఓట్లను చీలుస్తుందా.. లేక అధికార పార్టీ ఓట్లను కొళ్లగొడుతుంతా అనేది సస్పెన్స్‌గా మారింది. మున్సిపల్ ఎన్నికల బరిలో అటు జాగృతి అభ్యర్థులు కూడా పోటీ చేయడంతో దీనిపై ఇటు గులాబీ పార్టీలో కూడా తీవ్ర చర్చ జరుగుతుంది.




హైదరాబాద్, జనవరి 24: నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల వివాదంపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ( ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యుల సాంకేతిక కమిటీ సింగరేణి భవనానికి చేరుకుని విచారణను ప్రారంభించింది. సీఎస్ఆర్ నిధుల వినియోగం, టెండర్ నిబంధనలు వంటి అంశాలపై కేంద్ర బృందం ఆరా తీస్తోంది. సింగరేణి సీఎండీ కృష్ణ భాస్కర్ వద్ద ఈ బృందం వివరాలు సేకరిస్తోంది. నిన్న (శుక్రవారం) రాత్రి 7 గంటలపాటు విచారణ జరిపింది. నేడు మరోసారి విచారణ చేపట్టిన బృందం వచ్చే సోమవారం తన నివేదికను కేంద్రానికి సమర్పించనుంది. కాగా.. నైనీ బొగ్గు గని టెండర్ నోటిఫికేషన్‌లో సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధన సరికాదని, అక్రమాలకు దారి తీస్తుందని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో టెండర్లను రద్దు చేయాలని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించిన విషయం తెలిసిందే. అలాగే నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లలో అవినీతి ఆరోపణలపై స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. సమగ్ర విచారణకు సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందంతో కమిటీ ఏర్పాటైంది. బొగ్గు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, బొగ్గు శాఖ టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఈ బృందం సింగరేణిలో పర్యటించి.. నైనీ కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై విచారణ జరిపి, ఆ నివేదికను మూడు రోజుల్లో అందజేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

# మున్సిపల్ ఎన్నికలు...

# మూడు పార్టీలకు సవాలే..!

## క్లీన్ స్వీప్ చేయాలని సీఎం పట్టు!




హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికలు ముగియడంతో ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల మీదనే తెలంగాణలోని అన్ని ప్రధాన పార్టీల దృష్టి పడింది. గడువు ముగిసిన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ లకు ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నెలాఖరు వరకు నోటిఫికేషన్ ఇవ్వబోతోంది. దీంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీలు పట్టణాలపై దృష్టి పెడుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో కూడా క్లీన్ స్వీప్ చేయాలని ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తుంది. ఈ ఎన్నికలు ప్రధానంగా రేవంత్ రెడ్డి వర్సెస్ కేటీఆర్ ఉన్నట్లే కనిపిస్తున్నాయి. ఎందుకంటే గతంలో మున్సిపల్ మంత్రిగా ఉన్న కేటీఆర్ దాదాపు అన్ని మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి రెండేళ్లుగా సీఎంగా, మున్సిపల్ మంత్రిగా కొనసాగుతున్నారు. కాబట్టి ఇప్పుడు తాను కూడా అన్ని మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేయాలని భావిస్తున్నారంట. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ గుర్తులతో జరుగుతున్న అతిపెద్ద ఎన్నికలు ఇవే. ఉప ఎన్నికల్లో పార్టీ గుర్తుపై గెలిచిన కాంగ్రెస్.. ఈ ఎన్నికల్లో కూడా బలమైన సీట్లు సాధించాలని దృష్టిపెడుతోంది. పంచాయతీ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన చేశారు. అది మంచి ఫలితాలను ఇచ్చింది. ఇప్పుడు మరోసారి జిల్లాల పర్యటన చేసేందుకు రేవంత్ రెడ్డి సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. అటు కేటీఆర్ కూడా జిల్లాల పర్యటన మొదలుపెట్టారు. తాను మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు చేసిన పనులతో పాటు ఇప్పుడు ఉన్న పరిస్థితులను వివరిస్తూ ఈ ఎన్నికల్లో అత్యధిక మునిసిపాలిటీలు గెలవాలని వ్యూహంగా పెట్టుకున్నారు. పంచాయతీ ఎన్నికల్లో అనుకున్న

### బలం పుంజుకుంటామని కేటీఆర్ ధీమా!! - ఉనికి కోసం బిజెపి ప్రాకులాట!

స్థాయిలో సీట్లు రాలేవు కాబట్టి మున్సిపల్ ఎన్నికల్లో ఆ స్థాయి రిజల్ట్ సాధించి తమ పార్టీకి బలమైన పట్టు పెంచుకోవాలని కేటీఆర్ భావిస్తున్నారు అంట. పైగా ఈ మున్సిపల్ ఎన్నికల బాధ్యత మొత్తం కేటీఆర్ మీదే ఉందని సమాచారం. కాబట్టి ఈ ఎన్నికలు కేటీఆర్ నాయకత్వానికి సవాల్ విసురుతున్నాయి. అటు బిజెపి కూడా పట్టణాల్లో తమకు తిరుగులేదని కచ్చితంగా అత్యధిక మునిసిపాలిటీలు గెలుస్తామని చెబుతోంది. జనగామలో రోడ్ షో ద్వారా బలమైన సంకేతాలు ఇస్తోంది. ఈ ఎన్నికల్లో ఏ పార్టీకి అత్యధిక సీట్లు వస్తే ఆ పార్టీకి పట్టణాల్లో బలమైన పట్టు ఉన్నట్టు తేలిపోతుంది. మరి రేవంత్ రెడ్డి మార్క్ ఈ ఎన్నికల్లో కూడా వర్కౌట్ అవుతుందా.. కేటీఆర్ ఈసారి ఆదిపత్యం చెలాయిస్తారా.. బిజెపి సత్తా చాటుతున్న అనేది తెలియాల్సి ఉంది. పంచాయతీ ఎన్నికలు ముగియడంతో ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల మీదనే తెలంగాణలోని అన్ని ప్రధాన పార్టీల దృష్టి పడింది. గడువు ముగిసిన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ లకు ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నెలాఖరు వరకు నోటిఫికేషన్ ఇవ్వబోతోంది. దీంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీలు పట్టణాలపై దృష్టి పెడుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో కూడా క్లీన్ స్వీప్ చేయాలని ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తుంది. ఈ ఎన్నికలు ప్రధానంగా రేవంత్ రెడ్డి వర్సెస్ కేటీఆర్ ఉన్నట్లే కనిపిస్తున్నాయి. ఎందుకంటే గతంలో మున్సిపల్ మంత్రిగా ఉన్న కేటీఆర్ దాదాపు అన్ని మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి రెండేళ్లుగా సీఎంగా, మున్సిపల్ మంత్రిగా కొనసాగుతున్నారు. కాబట్టి ఇప్పుడు తాను కూడా అన్ని మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేయాలని భావిస్తున్నారంట.

# రూ.18 లక్షల కోట్ల డీల్..!

## చైనా, పాకిస్థాన్‌కు దడ పుట్టిస్తున్న ప్రధాని మోదీ!!



ఇండియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) మధ్య 12 ఒప్పందాలు కుదిరాయి. వాటిలో 2032 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 200 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేయాలనే ప్రణాళిక, పెద్ద అణు రియాక్టర్లు, చిన్న మాడ్యులర్ రియాక్టర్ల అభివృద్ధి, విస్తరణలో సహకారం వంటివి ఉన్నాయి. అలాగే 2026లో ప్రారంభించబోయే రెండవ మౌలిక సదుపాయాల నిధిలో పాల్గొనడాన్ని పరిశీలించమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఖాజు సావరిన్ వెల్త్ ఫండ్‌ను ఆహ్వానించారు. యుఎఇ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ పర్యటన ముగింపు సందర్భంగా ఈ ఒప్పందాలను ప్రకటించారు. భారత పక్షం దీనిని చాలా ముఖ్యమైన పర్యటనగా అభివర్ణించింది. గత దశాబ్దంలో ఇది అల్ నహ్యాన్ ఇండియాలో ఐదవ పర్యటన, యుఎఇ అధ్యక్షుడిగా మూడవ అధికారిక పర్యటన. ఆయనకు ప్రధాన మంత్రి మోదీ స్వయంగా స్వాగతం పలికారు. ఈ స్వాగతాన్ని ఇద్దరు నాయకుల మధ్య ఉన్న అత్యంత స్నేహపూర్వక, సన్నిహిత సంబంధాలకు చిహ్నం అని భారత పక్షం అభివర్ణించింది. ఆ తర్వాత ఇద్దరు నాయకులు విమానాశ్రయం నుండి ప్రధాన మంత్రి నివాసానికి కలిసి ప్రయాణించారు. అక్కడ పరిమిత, విస్తృత ఫార్మాట్లలో చర్చలు జరిగాయి. చర్చల సందర్భంగా మోదీ, అల్ నహ్యాన్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతి బోర్డు గురించి చర్చించారు. భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 2022లో సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై సంతకం చేశాయి. ద్వైపాక్షిక వాణిజ్యంలో వేగవంతమైన వృద్ధిని రెండు వైపులా గుర్తించాయి. ఇది 2024-25లో 100 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. రెండు వైపులా ఉన్న వ్యాపార వర్గాల ఉత్సాహంతో ప్రేరణ పొంది, 2032 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 200 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఉమ్మడి ప్రకటన పేర్కొంది. అయితే యూఏఈతో భారత్ కుదుర్చుకున్న ఒప్పందాలు చైనా, పాకిస్థాన్‌కు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నట్లు సమాచారం. అభివృద్ధిలో దూసుకెళ్తున్న భారత్, చైనాకు భవిష్యత్తులో గట్టి పోటీ ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తుండటంతో చైనా ఈ ఒప్పందాలపై ఓ కన్నేసి ఉన్నట్లు సమాచారం. ఇక ఇప్పటికే మనతో ఏ మాత్రం పోటీ పడలేని పాక్ కూడా ఈ ఒప్పందాల తర్వాత మరింత కన్నీరు పెడుతోంది.



# అగ్ని కీలల్లో తల్లి, ఇద్దరు పిల్లలతో సహా ఆరుగురు!

హైదరాబాద్: నాంపల్లిలోని ఓ ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బచాస్ ఫర్నిచర్ క్యాసిల్‌లో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. నాలుగు అంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో అగ్నిప్రమాదం జరిగింది. 10 ఫైరింజన్ల సాయంతో మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఘటనాస్థలానికి భారీ క్రేన్లు చేరుకున్నాయి. అగ్ని ప్రమాదంలో మొత్తం ఆరుగురు చిక్కుకున్నట్టు భావిస్తున్నారు. ఈ భవనంలో మూడు కుటుంబాలు పనిచేస్తాయి. సెల్లార్‌లో వాచ్‌మెన్ కుటుంబంలోని ఇద్దరు పిల్లలు, మరో కుటుంబంలోని నలుగురు చిక్కుకున్నట్టు సమాచారం. పిల్లల తల్లిదండ్రులు యాదమ, లక్ష్మి బయటకు వెళ్లిన సమయంలో ప్రమాదం జరిగింది. అఖిల్ (11), ప్రణీత్(7) ఆచూకీ తెలియాల్సి ఉంది. భవనంలో చిక్కుకున్న వారి కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. భవనం పరిసర ప్రాంతవాసులను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడుతుండడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అగ్ని ప్రమాదం జరిగిన భవనంలోకి రోబోను పంపి ఫైర్? సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్ అగ్నిమాపక శాఖ డీజీ ఘటనా స్థలిని పరిశీలించి సహాయక చర్యలు పర్యవేక్షించారు. నాంపల్లి అగ్ని ప్రమాద ప్రాంతం వద్ద పోలీసులు, హైడ్రా, విపత్తు నిర్వహణ బృందం సహాయక చర్యలు చేపట్టింది. ఘటనాస్థలిలో అంబులెన్స్?లలను అధికారులు సిద్ధంగా ఉంచారు. భవనం చుట్టుపక్కల దట్టంగా పొగ అలుముకుంది. ప్రమాద తీవ్రతను పెంచే వస్తువులను స్థానికులతో కలిసి అధికారులు తొలగిస్తున్నారు.



# ఎయిరిండియాకు రూ.1,100కోట్ల బీమా సొమ్ము..!

అహ్మదాబాద్‌లో గతేడాది చోటుచేసుకున్న దిగ్భ్రాంతికర విమాన ప్రమాద ఘటనలో విమానయాన సంస్థ ఎయిరిండియాకు పలు బీమా కంపెనీలు, రీఇన్సూరర్ల నుంచి పరిహారం అందింది. ఎయిర్‌లైన్‌కు రూ.1,100 కోట్లకు పైగా చెల్లించినట్లు ఇన్సూరెన్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు ఆంగ్ల మీడియా కథనం పేర్కొంది. గతేడాది జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం.. టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలింది. అది ఒక మెడికల్ కాలేజీ హాస్టల్‌పై పడింది.


ఈ ఘటనలో విమానం తునాతునకలైంది. అది పూర్తిగా ధ్వంసం కావడంతో బీమా కంపెనీలు, రీఇన్సూరర్లు 125 మిలియన్ డాలర్లు (రూ.1,100 కోట్లకుపైగా) బీమా మొత్తాన్ని చెల్లించాయి. అలాగే ప్రమాదంలో మరణించిన మృతుల బంధువులకు 25 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించే ప్రక్రియ మొదలైనట్లు ఆ సంస్థలు పేర్కొన్నాయి. అయితే ఆ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదని, ఆ మొత్తం పెరిగే అవకాశం ఉందని వెల్లడించాయి. కాగా.. ఘటన సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒకే ఒక్క వ్యక్తి మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. విమానం హాస్టల్‌పై పడటంతో మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. వీరి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేలా టాటా గ్రూప్ ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

క్షతగాత్రుల వైద్య ఖర్చులు, మెడికల్ కాలేజీ పునరుద్ధరణ, సమీపంలో విమాన శకలాల కారణంగా దెబ్బతిన్న వాటిని పునరుద్ధరించడం కోసం ఆ ట్రస్ట్ నిధులను వినియోగిస్తున్నారు.



# టీహబ్‌ను స్టార్టప్‌ల కేంద్రంగానే కొనసాగించాలి

హైదరాబాద్ : టీహబ్‌ను స్టార్టప్‌ల కేంద్రంగానే కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ అంశంపై సీఎస్ రామకృష్ణారావుకు అమెరికా నుంచి ఫోన్ చేసి సీఎం మాట్లాడారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను టీహబ్‌కు మారుస్తున్నారనే వార్తలను ఖండించారు. టీహబ్‌లో ఇతర ఆఫీసులు ఉండకూడదని ఆదేశించారు. అలాంటి ఆలోచనలు అధికారులు విరమించుకోవాలన్నారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ ఆఫీసులను ఇతర ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని సీఎం సూచించారు.



# అమెరికాలో మంచు తుపాను.. 8 వేల విమానాలు రద్దు

అమెరికాను భారీ మంచు తుపాను తాకింది. దీంతో పలు రాష్ట్రాల్లో భారీస్థాయిలో మంచు, వర్షంతోపాటు అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం టెక్సాస్, ఓక్లహోమాపై మంచు తుపాను పంజా విసురుతోంది. ఈ భీకర తుపాను కారణంగా పలు రాష్ట్రాల్లో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలిగినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. శనివారం నాటి 3,200 విమాన సర్వీసులు, ఆదివారం నాటి 4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌అవేర్ వెల్లడించింది. ముమ్ముందు ఈ పరిస్థితి మరింత తీవ్రతరమయ్యే అవకాశం ఉండడంతో పెద్దసంఖ్యలో రవాణా సర్వీసులకు అంతరాయం కలగొచ్చని అంచనా వేసింది. మంచు తుపాను కారణంగా అమెరికాలోని 20 కోట్ల మందికి పైగా ప్రజలు ప్రభావితం కానున్నట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. వాతావరణ హెచ్చరికలతో అమెరికాలోని రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. కెంటకీ, వర్జీనియా, కాన్సస్, ఆర్కాన్సాస్, జార్జియా, మిసిసిపి సహా పలు రాష్ట్రాలు ఎమర్జెన్సీ విధించాయి. మిసిసిపి, ఫ్లోరిడా వంటి దక్షిణాది రాష్ట్రాల్లోనూ ప్రమాదకర చలి వాతావరణం ఉంటుందని.. మిస్సోరి, ఇల్లినోయీలలోనూ భారీ మంచు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రతికూల వాతావరణం కారణంగా అనేక ప్రాంతాల్లో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడనుందని, వాహనదారులు మంచులోనే చిక్కుకుపోయే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ఇది ఈ దశాబ్దిలోనే అతి తీవ్రమైనదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.



# కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్‌కు సిద్ధమా?

హైదరాబాద్: కేటీఆర్, హరీశ్‌రావు సహా అందరినీ సాక్షులుగా పిలిస్తే... అసలు ఫోన్ ట్యాపింగ్ దోషులెవరని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ దొంగలను సాక్షులుగా పిలవడమేంటన్నారు. సిట్ విచారణను ప్రత్యక్షంగా, పరోక్షంగా మంత్రులు ప్రభావితం చేసినట్లేనని.. ఇప్పటికైనా సిట్‌కు స్వేచ్ఛ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి లొంగితే సిట్ అధికారులకు ఉన్న క్రెడిబిలిటీ పోతుందన్నారు. కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదని, ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్‌కు సిద్ధమా? అని సవాల్ విసిరారు. దేవుడి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేసే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. మావోయిస్టుల జాబితాలో హీరోయిన్లు, వ్యాపారులతోపాటు బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్ నెంబర్లను చేర్చింది నిజం కాదా? అన్నారు. ఆఖరికి కేసీఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ఆ జాబితాలో చేర్చి ఫోన్ ట్యాపింగ్ చేయించలేదా?అని నిలదీశారు. హైదరాబాద్ నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో బండి సంజయ్? ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయి...** సింగరేణి సంస్థను కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. గతంలో కేసీఆర్ కుటుంబమే దోచుకుంటే...కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారన్నారని విమర్శించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే... బీఆర్ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా అని ఉప ముఖ్యమంత్రి భట్టి చెబుతున్నారని... సింగరేణిలో రెండు పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 2014 నుంచి ఇప్పటి వరకు సింగరేణిలో గనుల కేటాయింపు, జరిగిన దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని తెలిపారు. తెలంగాణలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే... గుజరాత్?ను ఎందుకు లాగుతున్నారని బండి సంజయ్ ప్రశ్నించారు. సింగరేణి కార్మికులు పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే.. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగుతోందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమేనని.. ఆ సంస్థలో దోచుకున్న సొమ్ముతోనే బీఆర్ఎస్ పార్టీని ఇన్నాళ్లు నడిపించారని పేర్కొన్నారు. రూ.42వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుని సింగరేణిని అప్పుల పాల్జేసిందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తెస్తామంటారు.. అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మంతా దారి మళ్లించడం పరిపాటైందన్నారు. సింగరేణి ప్రజలు, కార్మికులు రెండు పార్టీల తీరును చూసి అసహ్యించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలేనని...మా భాగోతం మీరు బయటపెడితే... మీ భాగోతం మేం బయటపెడతామంటూ మాట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు.



# సజ్జనార్ నోటీసుకు సమాధానం ఇస్తా

హైదరాబాద్: నగర పోలీస్ కమిషన్ సజ్జనార్ ఇచ్చిన నోటీసులకు సమాధానంగా తన వద్ద ఉన్న సమాచారంతో జవాబు ఇస్తానని, ఆ తరువాత ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చని భారత రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సజ్జనార్? నోటీసుల నేపథ్యంలో ఎక్స్ వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాను వ్యక్తిగత దూషణలు చేయనని, చిల్లర భాష వాడనని, వాస్తవాలు దాచనని, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం ఆపబోనని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్, హరీశ్ రావుకు సంబంధం లేకున్నా నోటీసులు ఇచ్చి సిట్ గంటల తరబడి దర్యాప్తు పేరిట వేధిస్తున్న ప్రహసనాన్ని ఖండించిన 12 గంటల్లోనే పోలీసులు ఇంటికి వచ్చిన తనకు నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రెండు రోజుల్లో ఆధారాలతో సహా సమాధానం ఇవ్వకపోతే సివిల్, క్రిమినల్ చర్యలకు సిద్ధం కావాలని హెచ్చరించారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రజా సమస్యలు, దౌర్జన్యాలపై గొంతెత్తడం తన హక్కని.. వార్నింగ్?లకు భయపడబోనని పేర్కొన్నారు. సిట్ ఛీఫ్? సజ్జనార్ మీద ఏపీలో నమోదైన కేసులపై మరో సిట్ వేయాలని తాను డిమాండ్ చేసినట్లు నోటీసులో ఉందని, అది వాస్తవ విరుద్ధమని తోసిపుచ్చారు. పోలీస్ అధికారులు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ రాజకీయ క్రీడలో పావులుగా మారవద్దని సలహా ఇచ్చినట్లు తెలిపారు. నాటి డీజీపీ, హోంసెక్రెటరీ, సీఎస్ లాంటి అధికారులందరినీ విడిచిపెట్టి సిట్ అధికారులు కేవలం విశ్రాంత ఐపీఎస్ ప్రభాకర్ రావు, ఆయన కుటుంబాన్ని, ఆయనతో పనిచేసిన కానిస్టేబుళ్లు, బంధువులను వేధించడం అన్యాయమని చెప్పినట్లు వివరించారు. తాను సజ్జనార్ సహా ఏ అధికారి, ఏ రాజకీయ నాయకుడి వ్యక్తిత్వ హననానికి పాల్పడలేదని... ఆ సంస్కృతి తనకు లేదని తెలిపారు.

# సింగరేణి ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే యత్నం: భట్టి



హైదరాబాద్ : తెలంగాణకు ఆత్మగా ఉన్న సింగరేణిపై కొన్ని కట్టుకథలు వస్తున్నాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. సింగరేణి ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. 'సైట్ విజిట్' అనే నిబంధనను కోల్ ఇండియా 2018లో పెట్టిందని చెప్పారు. దీని ప్రకారమే సింగరేణి 2021లో సైట్ విజిట్‌ను తప్పనిసరి చేసిందన్నారు.


2018, 2021లో తాము అధికారంలో ఉన్నామా అని ప్రశ్నించారు. సింగరేణి అనేది స్వయంప్రతిపత్తి సంస్థ అని, సంస్థలో ప్రతి నిర్ణయం మంత్రిమండలి వద్దకు రాదని చెప్పారు. ప్రజాభవన్‌లో భట్టి మీడియాతో మాట్లాడారు. "సైట్ విజిట్ అనే నిబంధన దేశంలో ఎక్కడా లేదన్నట్లు దుష్ప్రచారం చేశారు. టెండర్లు రద్దు చేయకపోతే ప్రజల్లో అపోహలు పెరుగుతాయని వెంటనే రద్దుకు ఆదేశించాను. నైనీ కోల్‌బ్లాక్‌లకు బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పిలిచారు. సింగరేణిలో మొత్తం 25 కాంట్రాక్టులు జరిగితే.. 20 టెండర్లు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయి" అని మంత్రి వివరించారు.

# కాళేశ్వరం-మేడారానికి ప్రత్యేక బస్సులు

మహదేవపూర్(కరీంనగర్): మేడారం మహా జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం భూపాలపల్లి డిపో పరిధిలో మొత్తం నాలుగు క్యాంపులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ హిందు తెలిపారు. భూపాలపల్లి పట్టణంలో భూపాలపల్లి బస్‌స్టేషన్, కాటారంలో కాళేశ్వరం వెళ్లే మార్గంలో ఉన్న బస్‌స్టేషన్, కాళేశ్వరం లో కాళేశ్వరం బస్టాండ్, మహారాష్ట్రలోని సిరొంచ బస్‌స్టేషన్ పక్కన ఉన్న పార్కింగ్ ప్రదేశం నుంచి మేడారం అమ్మవారి గద్దెల వరకు మొత్తం 80 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆమె తెలిపారు. భూపాలపల్లి క్యాంపు ఈనెల 25 నుంచి 31వ తేదీ వరకు కొనసాగుతుందని, మిగిలిన కాటారం, కాళేశ్వరం, సిరొంచ క్యాంపులు ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయని ఆమె వివరించారు.

**చార్జీల వివరాలిలా..** భూపాలపల్లి నుంచి మేడారం వరకు పెద్దలకు రూ.230, పిల్లలకు రూ.140, కాళేశ్వరం నుంచి మేడారం వరకు పెద్దలకు రూ.360, పిల్లలకు రూ.210, సిరొంచ నుంచి మేడారం వరకు పెద్దలకు రూ. 400, పిల్లలకు రూ.230 ఉంటుందని తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లో మహిళలకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని భూపాలపల్లి, పరిసర ప్రాంతాల భక్తులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని డీఎం సూచించారు.



# మంచు గుప్పిట్లో కశ్మీర్

# కశ్మీర్‌ను కప్పేసిన మంచుదుప్పటి

జమ్మూకశ్మీర్‌లో భారీగా మంచు కురుస్తోంది. రెండ్రోజుల నుంచి విపరీతంగా కురుస్తుండటంతో పలు ప్రాంతాలు శ్వేతవర్ణంలోకి మారిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో మంచు అడుగుల మేర పేరుకుపోవడంతో యంత్రాల సాయంతో తొలగిస్తున్నారు. ప్రతికూల వాతావరణం కారణంగా పలు రోడ్లను మూసేశారు. కీలక ప్రాంతాల్లో రైల్వే సేవలను రద్దు చేశారు.

# సూర్య భగవానుని జయంతి రథ సప్తమి - ఆరోగ్య ప్రదాయిని ఆదిత్యుని పూజ



సూర్య గమనమే కాల వేగానికి ప్రమాణం. సూర్యుడు వేసే ప్రతి అడుగు కాల వేగానికి, కాల గమనానికి కొలబద్ద. ఈనాడు మనం లెక్కించే సెకన్లు, నిమిషాలు, గంటలు, రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలకు ఆధారం సూర్యుడే. కాలమే వేద స్వరూపం అంటుంది వేదం. కాలము,. దైవమూ కంటికి కనబడనివి. కాలానికి ప్రమాణమైన సూర్యుడు మన చర్మ చక్షువులకు కనిపిస్తాడు. అందుకే ఆయనకు ప్రత్యక్ష దైవంగా కొలువడం, ఆది నారాయణుడిగా ఆరా ఆరాధించడం సంప్రదాయ ఆచారంగా వస్తోంది.

**జపాకుసుమ సంకాశం కాశ్యపేయం మహాద్యుతిమ్;**
**తమోఘ్నం సర్వపాపఘ్నం ప్రణతోస్మి దివాకరమ్...**

ఎఱ్ఱని దాసాని పువ్వు రంగువంటి శరీర కాంతితో, ప్రకాశించే వాడూ, కశ్యపుని కుమారుడు, మహా కాంతివంతుడు, చీకటిని తొలగించే వాడు అయిన సూర్యునకు నమస్కారము, అని పురాణాలు ప్రవచిస్తాయి. నిత్యం కనిపించే సూర్యుడు ఒక్కడే అయినా, ఈ బ్రహ్మాండంలో యింకా 11 మంది సూర్యులు వున్నట్లు ఇటీవల శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. అయితే మన ప్రాచీన ఋషులు ఎప్పుడో ఈ ద్వాదశాదిత్యులను గుర్తించి పురాణాలలో పేర్కొన్నారు. వారు మిత్ర, రవి, సూర్య, భగ, పూష, హిరణ్యగర్భ, మరీచి, ఆదిత్య, సవిత, అర్క, భాస్కరులు. "మతం అని ఒకదానిని ఎంచుకోవలసి వస్తే, లోకానికి అంతటికీ వెలుగును ప్రసాదించే సూర్యుడిని దేవునిగా ఎంచుకుంటాను" అన్నాడు నిఖిల లోక విఖ్యాతుడైన నెపోలియన్ చక్రవర్తి. భారతావనిలో సూర్యారాధన ప్రాచీనమైనది. రుగ్వేదంలో సూర్యుని స్తుతితో పది రుక్కులు ఉన్నాయి. వేద మంత్రం గాయత్రి సూర్యపరమైనదే. వేదంలోని సూర్యస్తుతిలో సూర్యరథ, సూర్య గుర్రాల ప్రస్తావన ఉంది. సూర్యుడు ప్రత్యక్ష దైవం. అయినా ఆదిలో విగ్రహ పూజ, ఆలయాలు లేకుండేవి. నవగ్రహాలలో సూర్యపూజు ఉత్కృష్టమైనది. వేదా లలో సౌరసూక్తాలు, రామాయణంలో ఆదిత్య హృదయం భారత దేశంలో సూర్యపూజ పౌరాతనాన్ని స్పష్ట పరుస్తాయి. యాలెన్ అనే చరిత్రకారుని ప్రకారం ఆదిలో సూర్యుని రూపానికి ప్రతినిధిగా కిరణాలతో కూడిన బింబం పుట్టి, పూజార్హమైంది. ఆదిలో నాణాల మీద క్రీ.పూ.రెండు, ఒక వంద ఏళ్ళ మధ్య తొలుత కిరణాల బింబం కానవచ్చేది. పాంచాలంలోని రాజులైన సూర్యమిత్ర, భానుమిత్ర నామముల నాణేలపైన ఉండేవి. విగ్రహ రూపమిత్ర (సూర్య) పూజ పారశీకమున (ఇరేనియన్) ప్రారంభమైనట్లు కనిపిస్తుంది. సూర్యాలయాలు భారతావనికి శక నృపులతో వచ్చిన మగి పూజారుల భిక్ష. కృష్ణుని కుమారుడు సాంబుడు చంద్రబాగా (చీనాబ్) నదీ తీరాన సూర్య దేవాలయం నిర్మించాడని భవిష్యత్ పురాణ కథనం. నంబాపురం లేదా మూలాస్థానం (ముల్తాన్)లో ఒక సూర్యాలయం ఉందని హూయన్ త్సాంగ్ పేర్కొన్నాడు. ఒరిస్సా.లోని కోణార్కాలయం మగి బ్రాహ్మణ పూజారుల ప్రాబల్యానికి ప్రతీకగా ఉంది. గుప్తుల పాలనానంతరం, హర్షవర్ధనుని కాలాన సూర్యారాధన పెరిగి ఆదిత్య భక్తులైన ఆయన తండ్రి తాతలకు ప్రభాకర ఆదిత్య వర్ధన నామాలున్నాయి. హర్షుడు ఆదిత్య విగ్రహ పూజ చేశాడని చరిత్ర చెపుతున్నది. ఆ కాలపు నాటి మయూర కవి సంస్కృతంలో సూర్య శతకం వ్రాశాడు. సూర్య విగ్రహపూజ ఆరంభ తొలినాళ్ళలో ఆంధ్రదేశాన ఎక్కువగా సూర్యరథ పూజ జరుగు తుండేది. క్రీ.శ.మూడు, నాలుగు శతాబ్దులలో కృష్ణా, గోదావరీ మధ్య తీరాన్ని ఏలిన శాలంకాయనులు చిత్రరథ స్వామి భక్తులు ఆరాధిత మూల విగ్రహం సూర్యునిదే అయినా చిత్ర రథ స్వామి అనే పేరు వ్యావహారిక మైంది. కవి మారన విరచిత మార్కండేయ పురాణంలో సూర్య స్తుతి రథవరంగా సాగింది. ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కొక్కడై తోచు" అంటాడు పోతనామాత్యుడు. మిత్ర, రవి, సూర్య భాను, ఖగ, పూష, హిరణ్యగర్భ, మరీచి, ఆదిత్య, సవిత అర్క, భాస్కర నామాలతో ద్వాదశాత్మకుడైన సూర్యోపాస కులు వర్ణిస్తారు. వివిధ నామాలన్నింటికీ మూలం రథరూప మే. రథ సప్తమి అందులోనుండే పుట్టింది. అదే సూర్య జయంతి, సకల చరాచర జీవరాసుల ప్రాణ ప్రదాతమైన సూర్య భగవానుని జయంతిని "సూర్య జయంతిగా, రథ సప్తమి"గా పేరెన్నికగన్న మాఘ శుక్ల పక్ష సప్తమి నాడు సూర్య రథాలు మళ్ళుతాయని, అవి ఉత్తర గతిని సూచిస్తాయని, ఈదినం సూర్య గ్రహణ తుల్యమైన పుణ్యకాలమని భక్తుల భావన. నవ గ్రహాలలో సూర్య పూజు ప్రధానమైనందున అట్టి సూర్యుని కొలుచుట ఏడాదికోసారి మాత్రమే రథ సప్తమినాడే కావడం విశేషం. ఈశ్వరుడు మాఘ శుద్ధ సప్తమి నాడు సూర్యుడిని సృష్టించాడని పేర్కొం టారు. పంచాంగ కర్తలు ఈదినాన్నే 'సూర్య, జయంతి'గా, 'రథ సప్తమి'గా, 'మన్వాది'గా పేర్కొంటారు. రథ సప్తమిని రాజపుటానాలో సౌర సప్తమియని, వంగ దేశంలో భాస్కర సప్తమియని, కొన్ని చోట్ల జయంతి సప్తమి యని, మరికొన్ని చోట్ల మహా సప్తమియని అంటారు. సూర్యునికి వివస్వంతుడని పేరు. వివస్వంతుని కుమారుడు ఏడవ మనువైన వైవస్వతుడు. మన్వంతరానికి రథ సప్తమి మొదటి తిథి, వైవస్వత మన్వాది దినమై నందున పితృ దేవతలకు ప్రియకరమైనది. ఒకప్పుడు భారత దేశంలో వైవస్వత మన్వాది తిథి సంవత్సరాదిగా చెప్పబడి, ఉగాది పండగగా ఉండేదని భావించ బడుతున్నది. తెలుగుదేశం లోనూ రథసప్తమి నాడు అనేక స్త్రీల వ్రతాలు పట్టే ఆచారం ఉంది. సూర్య ఆరాధన ప్రధానంగా ఆచరించే ఈనాడు సూర్య రథాలు మళ్ళుతాయని, అవి ఉత్తర గతిని సూచిస్తాయని పురాణ కథనం. రథ సప్తమి నాడు సూర్య గ్రహణ తుల్యమైన పుణ్యకాలమని భావించే భక్తులు సూర్యోదయానికి పూర్వమే స్నానాదులు ఆచరించి, దానాదులు సూర్యోదయానంతరం చేయాలని ధర్మ సింధువు స్పష్ట పరుస్తున్నది. అతి పుణ్యప్రదమైన గ్రహణ కాలాలు వేయింటి ఫలితం ఒక్క రథ సప్తమికే ఉండగలదని మత గ్రంథాలు వివరిస్తున్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# చిర స్మరణీయాలు...కాకర్ల అమూల్య సేవలు

## - జనవరి 25... కాకర్ల సుబ్బారావు జయంతి



కాకర్ల సుబ్బారావు పేరొందిన రేడియాలజిస్ట్. నిమ్స్ ఆసుపత్రి ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. వైద్యశాస్త్రంలో ఆయన చేసిన సేవలకు గాను 2000 సంవత్సరం లో భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారాన్ని ఇచ్చింది. సుబ్బారావు 1925 జనవరి 25 న, కృష్ణా జిల్లా పెదముత్తేవి గ్రామంలో ఒక మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. తమ గ్రామంలో పాఠశాల లేనీ కారణాన సుబ్బారావు ఏడవ వరకు ఇంటి వద్దే చదువుకున్నారు. అనం తరం గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలోనున్న చల్లపల్లిలో పాఠశా ల చదువు పూర్తి చేశారు. 1937 - 1944 మధ్యలో బందరు లోని హిందు కళాశాలలో పట్టభద్రుడయ్యారు. ఆయన మొదట ఇంజనీరు కావాలనుకున్నా, విశాఖ పట్నం లో ఎంబిబిఎస్ కి సీటు రాగా, తమ వారికి ఎవరికీ తెలియ కుండా విశాఖపట్నం వెళ్ళి ఆంధ్ర వైద్య కళాశాలలో వైద్య విద్యలో చేరారు. 1950 లో ఉత్తీర్ణు డయ్యారు. తర్వాత భారత సైన్యంలో పనిచేయాలనుకున్నా, కొన్ని అనారోగ్య సమస్యల వలన అధికారులు అంగీకరించలేదు. 1951 సంవత్సరంలో హౌస్? సర్జన్సీ చేసిన తరువాత వైద్యంలో ఉన్నత విద్య కోసం ప్రత్యేక పారితోషికంతో అమెరికా వెళ్ళి, న్యూయార్క్ విశ్వ విద్యాలయంలో ఎం.ఎస్ పూర్తి చేశారు. అమెరికన్ కాలేజ్ ఆఫ్ రేడియాలజీలో ఫెలోషిప్ కూడా పూర్తి చేసి, స్వ దేశానికి తిరిగి వచ్చారు. అమెరికాలో వైద్య పరీక్షలైన అమెరికా రేడియాలజి బోర్డు పరీక్షలలో 1955 సంవత్సరంలో ఉత్తీర్ణులై న్యూయార్క్, బాల్టిమోర్ నగరాలలోని ఆసుపత్రులలో 1954-1956 సంవత్సరం వరకు పనిచేశారు. సుబ్బారావు 1956 సంవత్సరంలో ఇండియా తిరిగి వచ్చి హైదరాబాదు నగరంలో ఉన్న ఉస్మానియా వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా చేరి, అక్కడే ప్రధాన రేడియాలజిస్టుగా పదోన్నతి పొందారు. 1970లో సుబ్బారావు మళ్ళీ అమెరికా వెళ్ళి, యునైటెడ్ కింగ్?డమ్ వారి ఫెల్లో ఆఫ్ రాయల్ కాలేజి ఆఫ్ రేడియాలజిస్టు అనే పట్టా సంపాదించు కొన్నారు. అమెరికా లోని అనేక ఆసుపత్రు లలో పనిచేశారు.1986 సంవత్స రంలో నందమూరి తారక రామా రావు ప్రవాస ఆంధ్రులకు చేసిన విజ్ఞప్తి మేరపు సుబ్బారావు దేశానికి తిరిగి వచ్చి హైదరాబాదులోని నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడి కల్ సైన్సెస్ (నిమ్స్) లో చేరారు. నిమ్స్ ఆసుపత్రి సుబ్బారావు చేరక మునుపు వరకు ఎముకల ఆసు పత్రిగా ప్రసిద్ధి చెందింది. సుబ్బా రావు అక్కడ చేరాక అన్ని విభాగా లనూ అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఉన్న ప్రైవేటు కార్పోరేటు ఆసు పత్రులకు దీటైన స్థాయికి తీసుకొని వచ్చారు. నిమ్స్ సంస్థ రాష్ట్ర, దేశ వ్యాప్తంగా రోగుల చికిత్సా పరంగా, వైద్య వృత్తి శిక్షణా పరంగా, వైద్య పరిశోధన పరంగా, పేరెన్నిక కలిగిన వైద్య సంస్థగా కృషి చేశారు. సుబ్బారావు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా మెట్టమెదటి అద్యక్షులు, వ్యవస్థాపకులు. సుబ్బారావు రేడియాలజిలో అనేక పుస్తకాలు, జర్నల్స్ లో పరిశోధనా వ్యాసాలు వ్రాశారు. దేశ విదేశాలలో వైద్య ఉపన్యాసాలు ఇచ్చారు. యాభై ఏళ్ల అనుభవంలో అనేక బహుమతులు, సన్మానాలు పొందారు. సుబ్బారావు వైద్యశాఖకు, మాన వాళికి చేసిన సేవకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 2000 సంవత్సరంలో పద్మశ్రీ అవార్డు ప్రదానం చేసి సత్కరించింది. ఇండియా రేడియాలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ వారి అనుబంధ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చార్టరు సుబ్బారావుకు 2001 మార్చి 17న జీవితకాలపు కృషి అవార్డు ప్రదానం చేశారు. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2021 ఏప్రిల్ 16 న మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# నిర్లక్ష్యపు నీడలలో శాతవాహనుల తొలి రాజధాని

## జనవరి 25...జాతీయ పర్యాటక దినం



అవిభక్త కరీంనగర్ జిల్లాకు 50 వేల సంవత్సరాలకు పూర్వపు చరిత్ర ఉంది. చరిత్రలో ఆంధ్రులకు లభించి నంత వరకు , శాత వాహనుల మొట్ట మొదటి రాజవంశం, ఆదీ మహా రాష్ట్ర లోని పైఠానో లేక నాసిక ప్రాంతమో అనుకుంటే కాదని, అంతకు ముందే వీరు ఆంధ్రులని, కరీంనగర్ జిల్లానే వారి మూల పురుషులకు ఆవాస స్థానమని, చారిత్రక పరిశోధనలు స్పష్టం చేశాయి. శాతవాహన వంశానికి మూలపురుషుడు అని భావింపబడే శ్రీముఖుడు కోటి లింగాలను రాజధానిగా చేసుకుని పాలించాడని స్పష్టం అయినాక, ఆయన నాణేలు కోటిలింగాలలో లభ్యమైనాక చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. నాటి జిల్లా కేంద్రమైన కరీంనగర్ కు 65 కి.మీ .ల, నేటి జిల్లా కేంద్రమైన జగిత్యాలకు 27కి.మీల, ధర్మపురి క్షేత్రానికి 19 కి.మీ.ల దూరాన వెల్గ టూరు మండలం లోని గోదావరి, పెద్దవాగు సంగమ స్థాన మందుగల కోటిలింగాలలోని పుట్ట కోట గోడలు (పూర్వపు కోటలు) ఆంధ్రదేశ పాల కులైన శాతవాహనుల తొలి రాజులకు ఆటపట్టయినవి. ఆంధ్రుల తొలిరాజుగా పురాణా లలో వర్ణించ బడిన శ్రీముఖ చక్రవర్తి నాణాలను , కప్పారావు పేట సమీపాన, ధర్మపురి వాస్తవ్యులు ప్రముఖ చారిత్రక పరిశోధకులు , పురావస్తు శాఖలో ఎపి గ్రాఫిక్ అని సెంటు (శాసన వ్యాఖ్యాత)గా పనిచేస్తూ మరణించిన సంగనభట్ల నరహరిశర్మ సేకరించి, పురావస్తు శాఖకు అప్పగించడంతో , ఈ ప్రాంత ప్రాశస్త్యం వెలుగు చూడ గలిగింది. శాతవాహన కాలానంతర మైనట్టి వారికి ఉద్యోగ చెందిన "మహా తలవర, మహా సేనాధిపతి పతిస" ఆను నాణెములు ఇచ్చట లభించినవి. విదిశా నగరమును కేంద్రముగా ఏలిన చివరి శుంగ రాజుల నాణెములు లభింపగా, వాటిపై బ్రాహ్మీ లిపిలో "రజోగో బదస, రజో సమగోపస" అని వ్రాసి ఉన్నవి. శుంగుల అనంతరం మగధను ఏలారని పురాణాలలో పేర్కొనిన కాణ్వరాజుల నాణెము లు కూడా లభించాయి. వీటి ఆధారంగా పురాణములందు పేర్కొన్నట్లు, మగధ రాజ్యమును మౌర్యుల అనంతరం శృంగులు, కాణ్వులు పిదప ఆంధ్రులు వరుస గా పాలించినట్లు తార్కాణం ఇచ్చుచున్నదని పురావస్తు శాఖ మాజీ డైరక్టర్ పుచ్చా వాసుదేవ పరబ్రహ్మ శా స్త్రీ సోదాహరణంగా నిరూపిం చారు. వీటిలో కొన్ని కోటిలింగాల పొలములలో బ్రాహ్మీ లిపి లోని శిలా ఫలకాలు వెలుగు చూశాయి. ఇచట లభించినట్లు అపు రూప నాణెములు వేరెచ్చటా లభించని కారణంగా , కోటిలింగాల శాతవాహ నుల తొలి రాజధాని అని, పరిసర ప్రాంత కేంద్ర స్థానమని స్పష్టమైంది. కోటిలింగాలలో నే నరహరిశర్మ పంచమార్క్ నాణేలు , ఇతర అపు రూప నాణేలు సేకరించి పురావస్తు శాఖకు హస్తగతం చేశారు. వానిలో "రజో శాతవాహ , రజో సాతకం నిస" ఆని బ్రాహ్మీ లిపిలో వ్రాయ బడింది. లిపి ప్రకారం శ్రీముఖుని కన్నా ఇవి ప్రాచీనమైనవి. సహజం గా ఉండవలసిన ఉజ్జయిని చిహ్నం వీటిలో లేదని నరహరి పరిశోధనలో పేర్కొన్నాడు. శాతవాహన కాలపు పొరల్లో అనేక శాతవాహన నాణేలు లభించాయి. లభ్యమైన నాణెము లను బట్టి శాతవాహన వంశ మూల పురుషుడైన శాతవాహనుడు ఆంధ్రగోపులను , శబరులను, మహా తలవరులను, తదితర ఆంధ్ర రాజులను ఓడించి శాతవాహన సామ్రాజ్యాన్ని స్థాపించాడు. శాత వాహనులు తొలుత ఆంధ్రుల పాలనలో భాగమై, ఆంధ్ర భృత్యు లుగా ఉండి, బలవంతులై సామ్రాజ్య స్థాపనకు పూనుకున్నారని, శ్రీముఖుడు చివరి కాణ్వరాజును అంతమొందించి, స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పరచి, విస్తరించారని జగిత్యాలకు చెందిన ప్రముఖ చారిత్రక పరిశోధకులు , రిటైర్ రీడర్ డాక్టర్ జైశెట్టి రమణ య్య కరీంనగర్ చారిత్రక సంస్కృతి గ్రంథంలోని వర్ణించారు. హాల చక్రవర్తి గాథా సప్తశతి లోని గోదా వరి వర్ణన ఆధారంగా , లభ్యమై నట్లు ముఖ నాణాలను బట్టి కోటిలింగాల, శాతవాహనుల బలిష్ట దుర్గమని తెలియు చున్నది. కోటి లింగాల సమీపమున గల గుట్ట జైన మునులకావాస స్థానముగ నుండే దని తెలుస్తున్నది. సమీపాన క్రీ.పూ.రెండవ శతాబ్దపు బౌద్ధ స్తూపం పాపాయిగాం గుట్టపైన ఉండేది. ప్రస్తుతం మధ్య యుగానికి చెందిన దేవాలయం గ్రామంలో ఉంది. రెండు గర్భగృహాలకు ఉమ్మడి మంటపముంది. ప్రతి గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధానాలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడుగా ప్రతిష్ఠితుడు కాగా, దక్షిణ దిశలో ఉత్తర ముఖ గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధాన ఆలయంలో కోటీశ్వరుడు లింగరూపుడై ఉన్నాడు. ఆలయం చాళుక్య రీతులలో నుండి, గోదావరి ఒడ్డున అనేక శిల్ప ప్రతిమ లున్నాయి. పురావస్తు శాఖచే త్రవ్వకాలు జరపబడి, పర్యాటక శాఖ గుర్తింపు పొందింది ఈ ప్రదేశం. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాక్చరిత్ర కు నిలువెత్తు నిలువుటద్దంగా నిలిచి, శాతవాహనుల తొలి రాజ ధానిగా చరిత్ర పుటలకెక్కి, జిల్లా సంతరించుకున్న జిల్లా చరిత్ర గతినే మార్చి, విశేష ప్రాధాన్యత కోటి లింగాల ఒడ్డు, గోదావరి నీటి వల్ల నానాటికీ కోతకు గురవు తున్నది. తవ్వకాలు జరిపితే చారిత్రక సత్యాలెన్నో వెలికి తీయగల చరిత్రకు పూర్వపు గ్రామం, ప్రమాదపు టంచున పయని సున్నది. స్థానికుల, దాతల చేయూత, ధర్మకర్తల మండళ్ళ కృషితో, ప్రత్యేక నిధులను ప్రోగు చేసుకుని దేవస్థానాన్ని అభివృద్ధి పరుచుకుంది. పర్యాటక శాఖ ఈ గ్రామంపై చాలా కాలం చిన్నచూపే చూసింది. గతంలో చాలా సందర్భా లలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రముఖ పర్యాటక స్థలంగా తీర్చిదిద్ద గలమని ఇచ్చిన హామీలు, చేసిన ప్రకటన - నీటి మూటలు గానే మిగిలి పోయాయి. జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర సాయి నాయకులు, ఉన్నతాధికారులు , చారిత్రక విషయాసక్తులైన వ్యక్తులు, రాష్ట్ర చరిత్రలో ప్రధాన ప్రదేశమైన కోటిలింగాలలో ప్రత్యేక అభివృద్ధి పనులు, ప్రాచీన చారిత్రక అవశేషాల సంరక్షణా చర్యలను చేపట్టడంపై, నిర్ణయాత్మక కార్యక్ర మాలను చేపట్టడంలో ఆలసత్వాన్నే ప్రదర్శించారు. ఈ కారణంగానే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాచీన చరిత్రకు సాక్షీ భూతంగా నిలిచిన కోటిలింగాల నేడు కాలగర్భంలో కలిసి పోయే ప్రమాదంలో ఉంది. శ్రీపాద పాజెక్టు నిర్మాణ చర్యలలో భాగంగా చారిత్రక గ్రామానికి వరద ముప్పు భయభ్రాంతులకు గురి చేస్తున్నది. దీనితో ఈ గ్రామ చరిత్ర పుటల నుంచి కనుమరుగు అయ్యే ప్రమాదమూ లేకపోలేదు. ఈ విషయాన్ని ఆలస్యంగా నైనా గ్రహించిన జిల్లా మేధావి వర్గం, కోటి లింగాలను పరిరక్షించే చర్యలు గైకొనాలవి గత ప్రభుత్వానికి విన్నవించింది. రాష్ట్ర రాజధాని నుండి సైతం ఈ అంశంపై అవగాహన కలిగిన దివంగత ప్రభుత్వ సలహాదారు విద్యాసాగర్ రావు, మల్లేపల్లి లక్ష్మయ్య, ఆచార్య జయధీర్ తిరుమల రావు, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజిరెడ్డి, ఐకాస కన్వీనర్ కోదండరాం, తెలంగాణ జాగృతి వ్యవస్థాపకులు కవిత, కుర్రా జితేంద్ర బాబు, జైకిషన్, కవి గాయకులు దేశపతి శ్రీనివాస్ లాంటి మేధావులను రప్పించి, కోటిలింగాల పరిస్థితిని ప్రత్యక్షంగా చూపించి, తద్వారా గత ప్రభుత్వం దృష్టి ఆకర్షించి, పరిరక్షిం చే ప్రయత్నం చేసింది. అపురూప నాణేలు లభ్యమైన కోటిలింగాల గ్రామం ఖాళీ అయితే, త్రవ్వకాలకు మరింత సానుకూలత ఉండగలదనే ప్రతిపాదన అందుకున్న రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ చెన్నారెడ్డి అందుకు సానుకూలంగా స్పందించి, కోర్ కమిటీ నిర్ణయాన్ని అనుసరించి తవ్వకాలు జరిపేలా కృషి సల్పగల మని ప్రకటించి నామ మాత్రపు తవ్వకాలు చేపట్టి చేతులెత్తేయడం జరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు ముంపుకు గురికాకుండా ఆలంపూర్ లో నిర్మించినట్లు, కోటిలింగాల పరిర క్షణ గోడలు నిర్మించాలనే ప్రతిపా దన చాలా కాలంగా కాగితాలకే పరిమిత మైంది. గతంలో నాటి సంబంధిత మంత్రి పొన్నాల లక్ష్మయ్య వద్ద ప్రతిపాదనలు ఉన్నా, పట్టించు కోలేదు. తెరాస ప్రభుత్వ సంబంధిత కార్యదర్శి వెంకటేశం దర్శించి, తగు చర్యలు తీసుకునేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. ఇలా ఉంటే తెరాస ప్రభుత్వంలో నాటి మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ చొరవ కృషి, కృత నిశ్చయం ఫలితంగా, పర్యాటక శోభను సంతరింప చేయాలనే తపన కారణంగా, 2018 జనవరి 6వ తేదీన నాటి ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ ల చేతుల మీదుగా రెండు బోట్లను ప్రారంభించారు. 50 సీట్ల కెపాసిటీతో "శాతకర్ణి", 25 సీట్లు కెపాసిటీ గల "పులోమావి" తో పాటు 4 సీటర్ల స్పీడ్ బోట్ ను ప్రారంభించారు. పర్యాటక సంబంధంగా ఎంతో చేయాల్సి ఉంది. రాష్ట్ర చరిత్రతో విడదీయ రాని సహస్రా బ్దుల సంబంధాన్ని కలిగిన అపు రూప చారిత్రక బంధాన్ని తత్సం బంధ ఆధారాలను పరిరక్షిం చి, గోదావరి వద్ద రక్షణ గోడ నిర్మిం చి, కోటిలింగాల ఉనికిని కరు మరుగు కాకుండా ఉండగలం దులకు ప్రత్యేక చర్యలు చేపట్టా ల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉన్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**




అమెరికాలో భారత సంతతికి చెందిన నలుగురు వ్యక్తులు హత్యకు గురయ్యారు. కుటుంబ తగాదాల వల్ల ఓ వ్యక్తి తన భార్యతో పాటు బంధువులను కాల్చి చంపాడు. జార్జియాలోని లారెన్స్ విల్లే నగరంలో శుక్రవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) జరిగిన ఈ ఘటనకు సంబంధించి విజయ్ కుమార్ (51)ను పోలీసులు అరెస్టు చేశారు. మీడియా కథనాల ప్రకారం.. కాల్పుల విషయం పోలీసులకు ఫోన్‌కాల్ ద్వారా సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా.. అక్కడ నలుగురు భారత సంతతి వ్యక్తులు విగత జీవులుగా పడి ఉండటాన్ని గుర్తించారు. కుటుంబ తగాదాల వల్లే విజయ్‌కుమార్ వారిని కాల్చి చంపాడని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. మృతులను కుమార్ భార్య మీను డోగ్రా (43), బంధువులు గౌరవ్ కుమార్ (33), నిధి చందర్ (37), హరీష్ చందర్(38)గా గుర్తించారు. కాల్పుల సమయంలో ఇంట్లో ముగ్గురు పిల్లలు ఉన్నారని, ఆత్మరక్షణ కోసం వారు ఒక గదిలో దాక్కున్నారని పోలీసులు తెలిపారు.

వారిలో ఒకరు తమకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతోనే.. విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. పిల్లలను సురక్షితంగా వారి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు వివరించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామన్నారు.

ఇక, ఈ ఘటనపై అట్లాంటాలోని భారత కాన్సులేట్ జనరల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. నిందితుడు అరెస్టయ్యాడని.. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని పేర్కొంది.

చురకలు

# సంపాదకీయం

## పాక్ కు రష్యా సహకారంలో నిజం ఎంత?

పాకిస్థాన్ కు అగ్రరాజ్యం అమెరికా మద్దతుగా నిలుస్తుందనే చర్చ ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. పాక్ అధికారిక బ్యాచ్ మొత్తం నిత్యం అమెరికాతో సన్నిహిత సంబంధాలు నెరవేరుస్తూ.. ట్రంప్ తో రాసుకుపూసుకు తిరుగుతున్నారనే కామెంట్లు వినిపిస్తున్నాయి. అయితే... భారత్ తో అత్యంత సన్నిహితంగా ఉంటున్న రష్యా సైతం పాకిస్థాన్ కు సహకరిస్తుందనే కథనాలు ఇప్పుడు అత్యంత చర్చనీయాంశంగా మారాయి. అవును... భారత్ కు రష్యా అత్యంత సన్నిహిత వ్యాపార భాగస్వామిగా చెబుతారనే సంగతి తెలిసిందే. ఈ విషయాన్నే ప్రధాన కారణంగా చూపించి.. భారత్ పై అమెరికా పెద్ద ఎత్తున సుంకాలు విధించింది. రష్యాతో భారత్ వ్యాపారం ఉక్రెయిన్ తో యుద్ధానికి పరోక్ష మద్దతు అనే కామెంట్లూ చేసింది. ఈ సమయంలో పాకిస్థాన్ యుద్ధ విమానాలకు రష్యా ఇంజిన్లు సరఫరా చేస్తుందనే వార్తలు ఇప్పుడు అత్యంత హాట్ టాపిక్ గా మారాయి. వివరాల్లోకి వెళ్తే... పాకిస్థాన్ యుద్ధ విమానాల కోసం ఇంజిన్లను రష్యా సరఫరా చేస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వార్తలను మాస్కో కొట్టిపారేసింది. ఈ సందర్భంగా పాకిస్థాన్ తో తమకు అటువంటి ఒప్పందం ఏమీ జరగలేదని రష్యా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇదే సమయంలో... భారత్ తో పెద్ద ఎత్తున వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తున్న నేపథ్యంలో.. ఈ తరహా ప్రచారాలు చేయడం సరికాదన్నాయి. అదేవిధంగా... భారతదేశానికి ఇబ్బందికరంగా మారే ఎలాంటి చర్యలు తాము చేపట్టబోమని రష్యా ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. అయినప్పటికీ ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తూనే ఉన్నాయని అంటున్నారు. మరో వైపు ఈ విషయం భారత్ లో మోడీ సర్కార్ పై విపక్షాల విమర్శలకు కారణమైంది. ఈ విషయంపై తాజాగా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ స్పందించింది.. బీజేపీపై తీవ్ర విమర్శలు చేసింది. ఇందులో భాగంగా... రష్యాను అత్యంత సన్నిహితమైన వ్యాపర భాగస్వామిగా ఓ వైపు ప్రధాని మోడీ చెబుతారని.. కానీ, ఆ దేశం మాత్రం మన శత్రు దేశమైన పాకిస్థాన్ కు మద్దతునిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేష్ ఆరోపించారు. ఇది ప్రధాని మోడీ వైఫల్యాన్ని సూచిస్తుందని అన్నారు. ఇదే సమయంలో... ప్రధాని మోడీ జాతీయ ప్రయోజనాలకంటే తనకు పేరు వచ్చే విషయాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారని జైరాం రమేష్ దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో... అసలు పాకిస్థాన్ కు రష్యా ఎందుకు సహకారం అందిస్తుందో మోడీ ప్రభుత్వం వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలతో సంబంధాలను మెరుగుపరుచుకుంటున్నట్లు చెప్పే మోడీ.. దౌత్యం విషయంలో పాకిస్థాన్ ను ఇప్పటికీ ఒంటరిని చేయలేకపోతున్నారని విమర్శించారు. కాగా... పాకిస్థాన్ లో ఉన్న చైనా తయారీ జేఎఫ్-17 ఫైటర్ జెట్లలో వాడే ఆర్.డీ.-93ఎంఏ ఇంజిన్లను రష్యా సరఫరా చేస్తోందంటూ పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ విషయం అటు అంతర్జాతీయగానూ, ఇటు భారత్ లోనూ హాట్ టాపిక్ గా మారింది. అయితే ఈ విషయంపై పాక్ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు!

## నిజాం పాలనలో తొలి హిందూ పోలీస్ కమిషనర్ పింగళి - జనవరి 25...పాశంవారి వెంకట రామారెడ్డి వర్ధంతి



పింగళి వెంకట రామారెడ్డి. నేటి తరానికి చెందిన చాలా మందికి ఎక్కువగా అపరిచితమైన పేరు. భాగ్యనగరం చిత్రపటంపై చెరగని సంతకం ఆయనది. నిజాం ప్రభువుకు విశ్వాస పాత్రులై, హైదరాబాద్ నగరంపై తనదయిన ముద్ర వేసుకుని, ప్రజలకు అనేక రంగాలలో సహాయ సహకారాలు అందించి ప్రజా శ్రేయస్సే ఏకైక లక్ష్యంగా, అంకిత భావంతో సేవచేసి అపారమైన ప్రేమాభి మానలను చూరగొన్న ప్రజాబంధువు ఆయన. నిజాం రాజుల ఏడు తరాల రాజ్య పాలనలో హైదరాబాదు నగర పోలీసు కమీషనర్ (కొత్వాల్) పదవికి నియమితులైన ప్రప్రథమ హిందువుగా చరిత్రలో మిగిలి పోయారాయన. వెంకట రామారెడ్డి (ఆగష్టు 22, 1869 - జనవరి 25, 1953) నిజాం పరిపాలనలో పోలీసు ఉన్నతాధికారి. నిజాం ప్రభువు వద్ద తమకు గల పలుకుబడి వల్ల ఎన్నో సంస్థలను స్థాపించారు. ఎన్నింటికో సాయం అందించారు. విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. హైదరాబాద్ లో రెడ్డి హాస్టల్ నెలకొల్పారు. ఆయన1869, ఆగష్టు 22 న వనపర్తి జిల్లా కొత్త కొండ మండలం ఒక చిన్న గ్రామంలో జన్మించాడు. తల్లిదండ్రులు కేశవరావు, జారమ్మ. ఆయన పుట్టగానే కొద్ది సమయం లోనే తల్లి మరణించగా, తొమ్మిది సంవత్సరాల పాటు రాయణి పేటలో అమ్మమ్మ కిష్టమ్మ చెంత పోషణలో పెరిగారు. చిన్నప్పుడు ఖాస్గీ (ప్రైవేటు) బడిలో భారత, భాగవతాలు చదివారు. తరువాత నాలుగు సంవత్సరాలు వనపర్తి పాఠశాలలో ఉర్దూ, ఫార్సీభాషను చదువు కున్నారు. తరువాత విలియం వాహబ్ దగ్గర కన్నడ, మరాఠీ భాషలు నేర్చుకున్నారు. నజర్? మహమ్మద్? సహాయంతో 1886లో ముదిగ్లు ఠాణాకు అమీను (సబ్ ఇన్స్?పెక్టర్?) గా నియమితులైనారు. తరువాత నిజాం సొంత ఎస్టేటు వ్యవహారాలలో ప్రత్యేక అధికారిగా కొంత కాలం వ్యవహరించారు. నిజాయితీ, సమర్థత, విధుల నిర్వహణలో చాకచక్యం కారణంగా అనతికాలంలో పదోన్నతి లభించింది. మహబూబ్?నగర్?, నిజామాబాద్?, కరీంనగర్?, గుల్బర్గా, అత్రాఫ్? బల్దా (రంగారెడ్డి) జిల్లాలో పోలీసు అధికారిగా విధులు నిర్వహించారు. ఆ తరువాత ఆయన రాజధాని నగరం హైదరాబాద్?లో నాయెబ్? కొత్వాల్?గా నియమితులైనారు. అనంతరం కొత్వాల్? (సిటీ పోలీస్? కమిషనర్?) అయ్యారు. వేల్సు యువరాజు హైదరాబాదు వచ్చినప్పుడు గట్టి భద్రతా ఏర్పాట్లుచేసి గుర్తింపు పొందారు. 1933 ఏప్రిల్?లో పదవీ విరమణ చేశారు. వెంకట రామారెడ్డి ఎన్నో సంస్థలను పోషించారు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం వేమనాంధ్ర భాషా నిలయం, బాల సరస్వతి గ్రంథాలయం పురోభివృద్ధికి సహాయం అందించారు. 1946లో జరిగిన 26వ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించారు. హైదరాబాదులో రెడ్డి విద్యార్థి వసతిగృహం నెలకొల్పారు. తెలంగాణలో విద్యావ్యాప్తిలోనూ, రాజకీయ చైతన్యం నింపడం లోనూ రెడ్డి హాస్టల్ కీలక పాత్ర పోషించింది. హాస్టల్?ను ప్రారంభించేందుకు గద్వాల మహారాణి, వనపర్తి రాజా, పింగళి కోదండరాం రెడ్డి, గోపాలు పేట, దోమకొండ రాజా, జటప్రోలు రాజా తదతరుల నుంచి దాదాపు లక్ష రూపాయల వరకు చందాలు పోగు చేశారు. తొలుత నగరంలో అద్దె ఇంట్లో రెడ్డి హాస్టల్?ను ప్రారంభించారు. తర్వాత 1918లో ప్రస్తుతం అబిడ్స్?లో ఉన్న రెడ్డి హాస్టల్ సొంత భవనంలోకి మారింది. మాతృభాషపట్ల జరుగుతున్న నిరాదరణను చూడలేక, 26 మే 1943 బుధవారం రెడ్డి హాస్టల్? గ్రంథాలయంలో నాటి ప్రముఖ పండితులు, భాషాభిమానులు, కవులు, రచయితలు సమావేశం నిర్వహించిన ఫలితంగా తెలుగు భాషా సంస్కృతుల ప్రచారం ప్రధాన లక్ష్యంగా ఒక సంస్థను స్థాపించాలని చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. సంస్థకు 'నిజాం రాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు' అని పేరు పెట్టారు. పరిషత్తు ద్వితీయ మహాసభ ఓరుగల్లులో 1944 డిసెంబర్? 28, 29, 30 తేదీల్లో వైభవంగా జరగగా, ఉదయ రాజు రాజేశ్వరరావు ఆహ్వాన సంఘానికి అధ్యక్షులు కాగా, కాళోజీ నారాయణరావు కార్యదర్శిగా, మహాసభను రాజాబహద్దూర్? వెంకట రామారెడ్డి ప్రారంభించారు. సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించారు. 1946 మార్చి 15, 16, 17 తేదీల్లో తృతీయ మహాసభలు జరిగాయి. లోకనంది శంకరనారాయణ రావు సభలకు అధ్యక్షత వహించారు. రాజా బహదూర్? వెంకట రామారెడ్డి సభలను ప్రారంభించారు. నారాయణ గూడ ఆంధ్ర బాలికోన్నత పాఠశాలకు చాలా కాలం అధ్యక్షులుగా పనిచేశారు. ఆంధ్ర విద్యాలయ కార్యవర్గానికి మరణించే వరకు అధ్యక్షులుగా ఉన్నారు. 1926లో "గోలకొండ పత్రిక" స్థాపనకు ముఖ్య కారకులయ్యారు. ఆ కాలంలో ఆయన వలన సహాయం పొందని తెలుగు సంస్థ లేదంటే అతిశయోక్తి కాదు. హరిజనోద్ధరణకు ఏర్పడిన సంఘాలకు, అనాథ బాలల ఆశ్రమాలు, కుష్టు నివారణ సంఘం జంతు హింసా నివారణ సమితి వంటి సంస్థలతో పనిచేసి, వాటికి ఉదారంగా ధన సహాయం చేశారు. ఈ క్రమంలోనే 1933లో రెడ్డి బాలికల హాస్టల్ (నారాయణ గూడ), 1954లో రెడ్డి మహిళా కళాశాల (నారాయణగూడ) లను ప్రారంభించారు. పింగళి సేవలకు గుర్తింపుగా నిజాం రాజు జన్మదినోత్సవం సందర్భంగా 1921లో "రాజా బహద్దూర్" అనే గౌరవం ఇచ్చారు. బ్రిటిష్ ప్రభుత్వం 1931లో ఆయనకు "ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్" గౌరవం ప్రదానం చేశారు. వెంకట రామారెడ్డి కాంస్య విగ్రహం హైదరాబాదులో నారాయణగూడ చౌరస్తాలో ప్రతిష్ఠించారు. వెంకట రామారెడ్డి పేరుతో హైదరాబాద్?లో ఒక మహిళా కళాశాల స్థాపితమైంది. ఆయన పేరు మీద ట్రస్టును ఏర్పాటుచేసి, ఆ ట్రస్ట్ ద్వారా హైదరాబాద్?, సైబరాబాద్? మూడు కమిషనరేట్ల పరిధిలో పనిచేస్తున్న పోలీస్? అధికారులు విధుల్లో ప్రతిభ కనబర్చిన వారికి రాజాబహద్దూర్ వెంకట రామారెడ్డి అవార్డును అందజేస్తున్నారు. పధ్నాలుగు సంవత్సరాలు హైదరాబాద్? సిటీ పోలీస్? కమిషనర్?గా పనిచేసి, గ్రామీణ విద్యార్థుల చదువు కోసం రెడ్డి హాస్టల్? స్థాపించి, ఎందరో తెలుగువారు వెలుగులోకి రావడానికి కారకుడైన మహానుభావుడు కొత్వాల్? వెంకటరామారెడ్డి జనవరి 25 తేదీన 1953 సంవత్సరంలో పరమ పదించారు. లోయర్ ట్యాంక్ బండ్ లోని దోమలగుడ ప్రాంతంలో ఆయన సమాధి ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## అసమాన సంగీత దర్శకులు ఆది నారాయణ రావు - జనవరి 25...పి.ఆదినారాయణ రావు వర్ధంతి



భారతీయ సంప్రదాయ సంగీతాన్ని సినిమా శైలికి మార్చిన గొప్ప సంగీ త విద్వాంసులు ఆదినారా యణ రావు. తన సంగీతంతో అనేక పాటలకు ప్రాణం పోశారు. దశాబ్దా ల కాల గమనంలో తెలుగు వారి నోళ్ళలో ఆయన స్వర పరిచిన పాటలు వేల నోళ్ళలో నానుతోనే ఉన్నాయి. పెనుపాత్రుని ఆది నారాయణ రావు (ఆగష్టు 21, 1914 - జనవరి 25, 1991) తెలుగు సినిమా సంగీత దర్శకులు, నిర్మాత. సినీ సంగీత సామ్రాణిగా ఒకనాడు తెలుగు చిత్రసీమను ఏలిన... ఆయన సతీమణి, నటి అంజలీదేవి పేరుతో స్థాపించిన అంజలీ పిక్చర్స్ అధినేత ఆది నారాయణ రావు. ఆయన ఆగష్టు 21, 1914 సంవత్సరంలో విజయ వాడలో కృష్ణాష్టమి రోజున జన్మిం చారు. బాల్యం లోనే శ్రీ రాజరాజే శ్వరి నాట్యమండలి వారి 'సావిత్రి' నాటకంలో నారదుని పాత్ర పోషించారు. విజయ నగరం జిల్లా సాలూరుకు చెందిన పట్రాయని నర సింహశాస్త్రి వద్ద గాత్రం, హార్మోని యం వాయిద్యాలలో శిక్షణ పొందా రు. కాకినాడ మెక్లారిన్ ఉన్న త పాఠశాలలో మెట్రిక్ చదివారు. అప్పుడు అమెచ్యూర్ అసోసి యేషన్, బర్మాషెల్ అసోసియేషన్ సంస్థలకు రచన, సంగీత బాధ్యత లు వహించే వారు. సి.పుల్లయ్య దర్శకత్వం వహించిన గొల్లభామ చిత్రానికి గీత రచయితగా చలన చిత్ర రంగ ప్రవేశం చేశారు. 1950లో బి.ఎ.సుబ్బారావు నిర్మించిన పల్లెటూరి పిల్ల చిత్రానికి తొలి సారిగా సంగీత దర్శకత్వం వహించారు. అర్ధాంగి అంజలీదేవి పేరుతో 1953 లో అంజలీ పిక్చర్స్ స్థాపించారు. తెలుగు, తమిళం, హిందీ భాషలలో దాదాపు 28 సినిమాలను నిర్మించా రు. 1955లో అనార్కలి చిత్రం లోని. 'రాజశేఖరా నీపై మోజు తీరలేదురా' అనే మధుర గీతం ఆయన సంగీత స్వర విన్యాసానికి ఒక మచ్చుతునక. 1957లో రూపొందించిన సువర్ణ సుందరి తెలుగు, తమిళ, హిందీ భాషలలో స్వర్ణోత్సవాలు జరుపుకున్న సంగీత సంగీత నిధి. చండీప్రియ, కన్నవారిల్లు , మహా కవి క్షేత్రయ్య- నిర్మాత కూడా, అల్లూరి సీతా రామరాజు, భక్త తుకారాం, పెద్ద కొడుకు, మోసగాళ్ళ కు మోసగాడు, అగ్ని పరీక్ష, అమ్మ కోసం - నిర్మాత కూడా, సతీ సక్కుబాయి, స్వర్ణ మంజరి - నిర్మాత కూడా, ఋణాను బంధం , సువర్ణ సుందరి - నిర్మాత, రచయిత కూడా, అనార్కలి, అన్నదాత , పరదేశి ) - నిర్మాత కూడా, మాయల మారి , పల్లెటూరి పిల్ల, గొల్లభామ తదితర తెలుగు, తమిళ సినిమాలకు సంగీతం కూర్చారు. ఆయన 1991 సంవత్సరంలో జనవరి 25 న పరమ పదించారు. తెలుగు సంగీత ప్రియుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## బుద్ధం శరణం గచ్ఛామి ప్రాచీన చారిత్రక సాక్ష్యాల ఆత్మఘోష - జనవరి 25... జాతీయ పర్యాటక దినోత్సవం



అవి భక్త కరీంనగర్ జిల్లా గత కీర్తికి ప్రాచీన చరిత్రకు నిలువుటద్దంగా నిలిచి ఉంది. రాష్ట్ర పురావస్తు శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి. వి. కృష్ణ శాస్త్రి అపురూప పరిశోధనల ఫలితంగా, జిల్లా పాక్చరిత్ర 50వేల సంవత్సరాలకు పూర్వం ఉన్నదని రుజువైతే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. గౌతమి నదీ దక్షిణ తీరమున పరి వ్యాప్తమై ఉన్న, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో, ఉత్తర దక్షిణ భారతీయులకు, సేతువై నిలిచిన ఈ ప్రాంత నాగరికత, కాల ప్రవాహంలో కొట్టుకుని పోయినా, ఉత్సాహ వంతులైన చారిత్రక పరిశోధకుల అవిరళ కృషి ఫలితంగా కథలుగా, గాథలుగా, నోళ్లలో, రాళ్లలో, ఆకులలో, రేకులలో అక్కడక్కడ నిక్షిప్తమై యున్న చరిత్ర కొంతవరకు వెలుగు లోనికి రాగలిగింది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనులు మొట్టమొదటి రాజ వంశం అనీ, అదీ మహారాష్ట్రలోని పైఠానో లేక నాసిక ప్రాంతము అనుకుంటే కాదని, అంతకుముందే పురాణాలలో పేర్కొనబడిన ఆంధ్ర భృత్యులని, తొలి ఆంధ్ర ప్రభువుల సేవకులనే విషయం, కోటిలింగాల తవ్వకాలలో బయల్పడడం విశేషం. కరీంనగర్ జిల్లాలోనే శాతవాహనుల మూలపురుషులకు ఆవాస స్థానమని చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. క్రీస్తుపూర్వం శతాబ్దాల క్రితమే ఆంధ్ర రాజ్యం, శాతవాహనుల ఏలుబడిలో వర్ధిల్లిన, వారి అభిమాన పాత్రమైన బౌద్ధమతం, ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య మత మై విరాజిల్లింది. ప్రాచీనమైన ప్రతి గ్రామం పేరులో ప్రతి నిర్మాణ కౌశలంలో, ప్రతి కట్టడం లో వస్తువులు, మట్టి పాత్రలు, మతంతో పెన వేసుకున్న చరిత్ర పలుకుతుంది. శాతవాహన చక్రవర్తుల చత్రచ్ఛాయలలో, బౌద్ధమతం విస్తరించి, శాంతి అహింసలు, విశ్రమించిన ఈ ప్రాంతాల్లో, నాటి ప్రజల ఆరాధ్యాలైన స్థూపాలు, శిల్పాలు, కట్టడాలు, తవ్విన చోటల్లా దర్శనమిస్తూ, వెలకట్ట లేని వేల సంవత్సరాల చరిత్రకు, మౌన సాక్షీ భూతాలుగా నిరాదరణ నీడలో మగ్గుతూ, తమ దుస్థితికి చింతిస్తూ, అనాసక్తులైన, అధికారుల, ప్రజాప్రతినిధుల అశ్రద్ధ, నిర్లక్ష్యానికి క్రుంగి కృశిస్తు, ఆయువు తీరకముందే అస్తమిస్తున్నాయి. నిన్నటి వరకు ఆలనా పాలనా కరువై "బుద్ధం శరణం గచ్ఛామి" అంటూ దీనంగా విలపించిన ధర్మపురి నియోజకవర్గం లోని పాషాయిగాం బౌద్ధ స్తూపం, ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూలమట్టం అయింది. క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దంలో గంగా మైదానం ప్రాంతాలలో బౌద్ధమత వ్యాప్తి జరిగినా, అశోకుని కాలం కన్నా ముందే ప్రవేశించిన బౌద్ధమతం, శాత వాహనుల హయాంలో విశేష ఆదరణ పొందింది. అవిభక్త కరీంనగర్ జిల్లాలో మూడు ప్రాచీన బౌద్ధ కేంద్రాలు ఉండేవి. వాటిలోని ధర్మపురి సమీప క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల సంబంధిత పాశాయిగాం బౌద్ధ స్థూపానికి విశేష ప్రాధాన్యత ఉండేది. దీనికి 6 వృత్తాకారపు పలకలు ఉండేవి. వీటిపై ఒక పద్మం, ఏనుగు బొమ్మలు, స్థూపానికి ఇరువైపులా, స్తం భాకృతులు కలిగియున్న ఆ స్తూపం రెండవ శతాబ్దానికి చెందినదిగా "దూళికట్ట స్థూపం కన్నా ప్రాచీనమైనదిగా", "జిల్లాలోని మొట్టమొదటి రాతి కట్టడం"గా చరిత్రకారులు రుజువు పరిచారు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం "నాగ సింపీయకాయ, జమజో రాగ బ్రహ్మ లేఖలు", స్తూపం వద్ద లభ్యమైనాయి. శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాలకు మూడు కిలోమీటర్ల దూరంలో, ప్రస్తుత రాయపట్నం - కరీంనగర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని, పాశాయిగాం గుట్టపై చెన్న పూస అనే ఆచార్యుడు, బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు, సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు దిజ్ఞాగుడు, ఈ ప్రాంతం వాడేనని, చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ ఏడవ శతాబ్దంలో తన గ్రంథంలో పేర్కొన్నాడు. రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి శాతవాహన కళా ఉత్సవాల సందర్భంగా, 2002 జనవరి 21న కరీంనగర్లో ప్రధాన ప్రాసంగికునిగా ప్రకటించడాన్ని బట్టి, పాషాయిగాం బౌద్ధ స్తూప ప్రాధాన్యత స్పష్టమౌతుంది. ఇంతటి ప్రాచీన చారిత్రక ఆధారమైన బౌద్ధ స్తూపం, రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణంలో, కాంట్రాక్టర్ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్లక్ష్యానికి అనవసరంగా, అకారణంగా బలియై, 1999 డిసెంబర్ 25వ తేదీన నేల కూల్చ బడింది. ఆ తర్వాత ముక్కలైన ఆ స్తూప పలకలను చేర్చి, జిల్లా కేంద్ర పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచి, తిరిగి స్థాపించడం జరిగింది. తత్ఫలితంగా పాశాయిగాంకు చెందిన బౌద్ధ స్తూపం, కనుమరుగై ఈ ప్రాంతం, చరిత్ర పుటల్లో నుంచి తొలగించబడి, ప్రాచీనత్వాన్ని కోల్పోయింది. అలాగే జూలపల్లి మండలంలోని క్రీస్తు పూర్వపు రెండవ శతాబ్ధికి చెందిన హుస్సే నియా వాగు - చిన్న వాగుల సంగమ స్థానంలో 47 శిల్పాలంకృత పలకలచే శోభితమై, ఐదు పడగల "ముచిలింద నాగం" బోధివృక్షం మహాభినిష్క్రమణం చెక్కబడిన దూళికట్ట స్థూపం విశేష ప్రాధాన్యతను కలిగి ఉంది. "కాలచక్ర నిర్వహణ"కై దూళికట్ట నుండి అపురూప ఫలకాలను, అమరావతికి కొద్దికాలం క్రితం అవిభక్త రాష్ట్రంలో తరలించారు. కోటిలింగాల ధూళికట్ట మరియు మీర్జంపేట మానేరు తీరాన చారిత్రక శిల్పాలను, స్తూపాలను, కోటలను, పరి రక్షించేందుకు నాటి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 38 లక్షలకు పైగా నిధులు అర్ధాంతరంగా మళ్లించ బడినాయి. ప్రాచీన కట్టడాలు, బౌద్ధ స్థూపాలు, ఆరామాలు, శిల్పీకరించిన అపురూప కళాకృతులు, ఈనాటి వారికి ప్రధానంగా చరిత్ర అంటే గౌరవం లేని సరైన అవగాహన లేని, పాలక అధికార వర్గాలకు తెలియక పోవచ్చు కాని, వాటి ప్రాశస్త్యానికి, వేల సంవత్సరాల వెలకట్టలేని, చారిత్రక నేపథ్యం ఉందన్న యతార్థాన్ని విస్మరించ రాదు. ఒకవైపు ప్రాచీనమైన బౌద్ధ వ్యాప్తికి సంబంధించిన, ఈ ప్రాంత చరిత్ర మరుగున పడుతుండగా... మరోవైపు ప్రాచీనత్వానికి ఆనవాళ్లు అయిన, అపురూప చారిత్రక సాక్ష్యాలను కనుమరుగు చేస్తుంటే, వారి ఆత్మ ఘోష వినిపిస్తుంటే, భారతీయ పురాతత్వ విభాగం ప్రపంచ పౌరుల ముందు తలదించుకోవాల్సిన దుస్థితి. గొప్పలు చెప్పుకోవడం కాదు గొప్పలు నిలబెట్టుకోవడమే గొప్పతనం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

చురకలు



## దారిదోపిడీలకు.. హైవేలే అడ్డా!

మెదక్ : జాతీయ, అంతర్రాష్ట్ర రహదారులపై దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలకు సరిహద్దులుగా ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వస్తున్న దొంగలు దాడులకు పాల్పడుతున్నారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయిలో మంగళవారం రాత్రి దొంగలు డ్రైవరును హత్య చేసి, లారీతో పరారయ్యారు. ఈ నేపథ్యంలో నాలుగు జిల్లాలోని పరిస్థితిపై కథనం. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల మీదుగా 65వ (ముంబయి–హైదరాబాద్), 44వ (కశ్మీర్–కన్యాకుమారి), 161వ (అకోలా–నాందేడ్) జాతీయ రహదారులు వెళ్తున్నాయి. జహీరాబాద్–బీదర్ అంతర్రాష్ట్ర రహదారి వెళ్తోంది. ఆయా మార్గాల్లో దోపిడీలు, చోరీలు ఆందోళనకు గురిచేస్తున్నాయి.

**వివిధ ఘటనలు ఇలా..**

న్యాల్కల్ మండలం గంగ్వార్ చౌరస్తాలో పాన్ మసాలా లోడుతో వెళ్తున్న లారీని అడ్డగించి డ్రైవరుపై దాడి చేసి రూ.20 లక్షల విలువైన సరుకు, రూ.40 వేలు ఎత్తుకెళ్లారు.బుచినెల్లి శివారులో పెట్రోల్ బంకు వద్ద ఓ కుటుంబం కారులో నిద్రిస్తుండగా అద్దాలు ధ్వంసం చేసి మహిళ ఆభరణాలు లాక్కునేందుకు యత్నించారు. 44వ జాతీయ రహదారిలో తూప్రాన్ బైపాస్ రోడ్డులో లారీ నిలిపి నిద్రిస్తున్న డ్రైవర్, క్లీనర్‌పై దాడి చేసి దోచుకున్నారు.

**కొరవడిన నిఘా..**

ఉమ్మడి జిల్లాలోని జాతీయ, అంతర్రాష్ట్ర రహదారులపై భద్రత కొరవడిందని ఇటీవలి ఘటనలే చెబుతున్నాయి. ప్రధానంగా రాత్రివేళల్లో ప్రయాణం, సరుకు రవాణా అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో ఆయా మార్గాల్లో పక్కా నిఘా పెట్టాలి.



**దాబా, టోల్‌గేట్ల వద్ద మాటేసి..**

ముందుగా ముఠా సభ్యుల్లో కొందరు హైవేలపై దాబాలు, టోల్‌గేట్ల వద్ద మాటు వేస్తారు. ఆగి ఉన్న వాహనాలను గమనించి, డబ్బు, ఆభరణాలు ఉన్నాయా తదితర వివరాలు మిగతా వారికి చేరవేస్తారు. చోరీ చేయగానే ముందుగానే ఎంపిక చేసుకున్న వేరే దారుల్లో తప్పించుకుంటున్నారు.

లారీలకు అడ్డుగా వెళ్లి టార్చిలైట్లను డ్రైవర్ల కళ్లపై వేసి, వాహనం నిలపగానే దాడి చేస్తారు.

**వీటిని పాటించండి..**

వాహనాల డోర్లు లాక్ చేసుకొని పెట్టుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులకు లిఫ్ట్ ఇవ్వరాదు. విశ్రాంతికి నిలపాలనుకుంటే పెట్రోలు బంకులు, నిర్దేశిత ప్రాంతాల వద్దే నిలపాలి.

**అమెరికాలో ఇలా..**

యూఎస్‌లో ప్రతి వాహనం నంబరు ప్లేట్‌ను స్కాన్ చేసే వ్యవస్థ అందుబాటులో ఉంది. దొంగిలించిన వాహనాలు హైవేపైకి రాగానే పోలీసులకు సంకేతం అందుతుంది.

హైవేలపై నిర్మానుష్య ప్రాంతాల్లో ఏఐ ఆధారంగా పని చేసే కెమెరా టవర్లు ఉంటాయి. ఇవి అనుమానాస్పద వాహనాల కదలికలను గుర్తించి అప్రమత్తం చేస్తాయి.

నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో పకడ్బందీ గస్తీ ఉంటుంది.

## కల్వర్టులు శిథిలం.. భయంగా ప్రయాణం

జహీరాబాద్ : జహీరాబాద్: మెరుగైన రవాణా సదుపాయానికి రహదారులను మెరుగు పరుస్తామని, వాటికి అడ్డుగా వాగులున్న చోట కల్వర్టులు, వారధులు నిర్మిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు తరచూ చెబుతుంటారు. కానీ దశాబ్దాలు గడుస్తున్నా జహీరాబాద్ నియోజకవర్గంలోని చాలా చోట్ల కొత్త రోడ్లు, వారధులు, కల్వర్టులను నిర్మించడం లేదు. భారీ వర్షాలకు దెబ్బతిన్న వంతెనలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. ఇకనైనా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

**ఏళ్లుగా మరమ్మతులు కరవు**

జహీరాబాద్ పట్టణం మాణిక్‌ప్రభు మహేలా నుంచి అల్గోల్‌కు వెళ్లే బైపాస్ మార్గంలో, రహమత్‌నగర్ సమీపంలో, అల్గోల్–పొట్టిపల్లి గ్రామాల మధ్య నారింజ వాగుపైన, బైపాస్ కూడలి నుంచి బీదర్ వైపు వెళ్లే దారిపై కల్వర్టులు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. కాశీంపూర్, అసద్‌గంజ్, గోపన్‌పల్లి, గొడిగార్‌పల్లి,



ఇప్పెపల్లి, మాడ్గి, ధనసిరి వెళ్లే మార్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వీటికి ఏళ్లుగా మరమ్మతులు కరవయ్యాయి.

అధికారులూ.. దృష్టి సారించండి

కోహీర్ మండలంలోని కోహీర్–నాగిరెడ్డిపల్లి, వెంకటాపూర్–పోతిరెడ్డిపల్లి, మద్రి–గుర్జువాడ, కోహీర్–మాచిరెడ్డిపల్లి, రాజినెల్లి–కోహీర్, మనియార్‌పల్లి–బడంపేట–పర్శపల్లి, గొడిగార్‌పల్లి మార్గాల్లో నాలుగు చోట్ల కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి.

ఝరాసంగం మండలంలోని ఝరాసంగం–కుప్పానగర్, ఝరాసంగం–చిలేపల్లి, చిలేమామిడి, మాచునూర్, బర్దిపూర్ మధ్యలో కల్వర్టుల వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

న్యాల్‌కల్ మండలంలోని న్యాల్‌కల్–మిర్జాపూర్, హద్నూర్–గుంజోటి, రామ్‌తీర్థ్, గంగ్వార్–మెటల్‌కుంట రహదారులపైన కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. వీటిపై అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం–రాంచందర్, డీఈఈ, పీఆర్, జహీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ రహదారులపైన దెబ్బతిన్న కల్వర్టుల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు వచ్చిన వెంటనే పనులు చేపడుతాం.

# రక్తం లాగేసి.. అడ్డగోలుగా దోచేసి



పెద్దపల్లి : పెద్దపల్లి పట్టణానికి చెందిన ఒకరు వ్యాధి నిర్ధారణకు ఓ డయాగ్నొస్టిక్ కేంద్రానికి వెళ్లి పరీక్షించుకోగా రిపోర్టు వచ్చింది. అనుమానం వచ్చిన సదరు వ్యక్తి మరో కేంద్రంలో పరీక్ష చేసుకోగా.. రెండు ఫలితాలు వేర్వేరుగా రావడంతో వైద్యారోగ్య శాఖకు ఫిర్యాదు చేశారు. జిల్లాలో వ్యాధి నిర్ధారణ కేంద్రాలు పుట్టగొడుల్లా పుట్టుకొస్తున్నాయి. అర్హత లేకుండానే పలువురు అనధికారంగా కేంద్రాలను నిర్వహిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమడుతున్నారు. ఆర్ఎంపీలు ల్యాబ్‌ల పేరిట దండుకుంటున్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. వైద్యారోగ్యశాఖ అనుమతి తీసుకోకుండానే డయాగ్నొస్టిక్? కేంద్రాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ప్రైవేటు కేంద్రాలపై వైద్యారోగ్యశాఖ దాడులు చేస్తున్నప్పటికి.. అనుమతి పత్రాలు లేకుండానే కొనసాగుతున్నాయి.

**అడుగడుగునా ఉల్లంఘనలు**

జిల్లాలో 15 డయాగ్నొస్టిక్ కేంద్రాలకు మాత్రమే అనుమతి ఉంది. పెద్దపల్లి, గోదావరిఖని, మంథని, సుల్తానాబాద్ ప్రాంతాల్లో రెట్టింపుగా ఉన్నాయి. ఈ కేంద్రాల్లో బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజిస్టు, పాథాలజిస్టులు ఉండాలి. అయితే చిన్న గదుల్లో యంత్రాలు ఏర్పాటుచేసి అర్హత లేనివారు పరీక్షిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్?ఎంపీలు తమ క్లినిక్?లో ల్యాబ్? టెక్నిషియన్? లేకుండానే వ్యాధి నిర్ధారణ పరికరాలతో పరీక్షిస్తున్నారు. సిరంజీలు, రక్తం సేకరించిన డబ్బాలు, ఇతర హానికరమైన బయోవేస్ట్? వస్తువులను పట్టణ శివారులో వదిలేస్తున్నారు.

**ఇవీ నిబంధనలు**

డయాగ్నొస్టిక్ కేంద్రాల నిర్వాహకులకు ల్యాబ్ టెక్నిషియన్ ధ్రువపత్రం కలిగి ఉండటం అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్?మెంట్ అనుమతి తీసుకోవడం

పక్కా భవనంతోపాటు కన్సెల్టెంట్ వైద్యుడు తప్పనిసరి

రోగ నిర్ధారణ పరీక్ష సిటిజన్ ఛార్ట్‌లో ఏ పరీక్ష ఎంత ధరో పొందుపరచడం

వ్యర్థాల కోసం పసుపు, నీలి, ఎరుపు రంగు డబ్బాలు ఏర్పాటు చేయడం.

**నోటీసులు ఇస్తున్నాం–** ప్రమోద్ కుమార్, జిల్లా వైద్యాధికారి

జిల్లాలో డయాగ్నొస్టిక్? కేంద్రాలను నిరంతరం తనిఖీ చేస్తున్నాం. అనుమతి పత్రాలు, ఇతర వసతులు లేని నిర్వాహకులకు నోటీసులిస్తున్నాం. నిబంధనలు పాటించవారిపై చర్యలు తీసుకుంటాం.

# ఆయకట్టు స్థిరీకరణ.. భూగర్భ జలాల పెంపు



మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): వృథాగా పోతున్న గోదావరి జలాలకు అడ్డుకట్ట వేసి ఆయకట్టుకు అందించేలా నిర్మల్ జిల్లా సరిహద్దులో నిర్మించిన సదర్మాట్ బ్యారేజీతో జగిత్యాల జిల్లా రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ బ్యారేజీని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించి నీటిని దిగువకు వదలడంతో యాసంగి పంటలకు నీరందనుంది. దీంతో ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణతో పాటు భూగర్భ జలాలు పెరగనున్నాయి. గోదావరిపై ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి శివారులో గంగనాల, నిర్మల్? జిల్లా ఖానాపూర్? మండలం మేడంపల్లి శివారులో సదర్మాట్? ఆనకట్టలు ఏళ్ల కిందట నిర్మించారు. వీటి కింద ఆయకట్టులో పంటలు సాగవుతుండగా నదిలో ప్రవాహం ఉన్న సమయంలోనే నీరందుతోంది. వరద లేని సమయంలోనూ పంటలకు నీరందించి ఆయకట్టును స్థిరీకరించాలన్న లక్ష్యంతో పాలకులు సదర్మాట్? బ్యారేజీకి రూపకల్పన చేశారు. బ్యారేజీలో నీటిని నిల్వ చేసి అవసరమైన సమయంలో పంటలకు అందించాలన్నది లక్ష్యం.

**తూము ఏర్పాటుతో మేలు**

బ్యారేజీలో నిల్వ చేసే 1.58 టీఎంసీల నుంచి గంగనాల ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తామని పాలకులు చెబుతున్నారు. అయితే నీటిని విడుదల చేసిన సమయంలో నేరుగా గంగనాల ప్రాజెక్టుకు సరిపడా వచ్చే అవకాశం లేదని, అక్కడక్కడ నది లోతు ఎక్కువగా ఉండటంతో ఇటువైపు నీరు రాదని రైతులు పేర్కొంటున్నారు. బ్యారేజీ నుంచి నేరుగా గంగనాల ప్రాజెక్టుకు నీరు వచ్చేలా తూము ఏర్పాటు చేసి కాలువ నిర్మించాలని కోరుతున్నారు. **తగ్గనున్న దూరం**

బ్యారేజీపై రెండు వరుసల వంతెన నిర్మించారు. దీంతో ఇబ్రహీంపట్నం, నిర్మల్, మామడ మండలాల్లోని పలు గ్రామాల మధ్య దూరా భారం తగ్గనుంది. గతంలో సమీప గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చేది. వంతెన నిర్మాణంతో దూరం తగ్గనుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**4,896 ఎకరాలకు సాగునీరు**

నిర్మల్? జిల్లా మామడ మండలం పొన్కల్, ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ మధ్య గోదావరిపై సదర్మాట్? బ్యారేజీ నిర్మించారు. రూ.676.592 కోట్ల పరిపాలనా అనుమతులతో నిర్మాణం పూర్తయింది .మామడ, ఇబ్రహీంపట్నం మండలాల్లో 1,176 ఎకరాల భూమి సేకరించారు. 1.58 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా 987 మీటర్ల పొడవైన ఆనకట్టను నిర్మించి 55 గేట్లు ఏర్పాటు చేశారు. ఖానాపూర్? మండలం సదర్మాట్ ఆనకట్ట కింద 13,120 ఎకరాలకు, ఇబ్రహీంపట్నం మండలం గంగనాల ప్రాజెక్టు కింద 4,896 ఎకరాలకు నీరందించనున్నారు.సదర్మాట్ బ్యారేజీ నిర్మాణంతో 1.58 టీఎంసీల నీటిని నిల్వ చేయనున్నారు. దీంతో దిగువన ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్‌లతో పాటు మల్లాపూర్ మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరందనుంది. బ్యారేజీ నుంచి ఎగువన సుమారు మూడు నాలుగు కిలోమీటర్ల మేర నదిలో నీరు నిలువనుండగా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి, భర్తీపూర్, కోమటికొండాపూర్, మూలరాంపూర్? తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరగనున్నాయి. సాగునీటితో పాటు ఈ ప్రాంతంలో మత్స్యకారులకు జీవనోపాధి మెరుగవుతుంది.

# 990 లీకేజీలు.. 5 లక్షల లీటర్ల జలం వృథా



కరీంనగర్: మరికొన్ని రోజుల్లో వేసవికాలం రానుంది. నీటి అవసరాలు పెరిగే అవకాశముండగా లీకేజీలతో శుద్ధజలం రోడ్లపై వృథాగా ప్రవహిస్తోంది. గత కొన్ని నెలలుగా కరీంనగర్ నగర పరిధిలో వీటి సంఖ్య అధికమైంది. పలు ప్రాంతాలకు రోజూ నీటి సరఫరా చేస్తుండగా.. మరికొన్ని చోట్ల రోజు విడిచి రోజు సరఫరా అవుతోంది. ఆయా రిజర్వాయర్ల పరిధిలో కంట్రోల్? వాల్వులు దెబ్బతింటున్నాయి. వీధులకు సరఫరా చేసేందుకు నిత్యం వీటిని తిప్పుతుండటంతో వాటి రాడ్లు పాడవుతున్నాయి. నగరంలో సుమారు 990 లీకేజీలతో రోజుకు సుమారు 5 లక్షల లీటర్ల శుద్ధజలం వృథాగా పోతోంది.

**కార్మికులు ఏమయ్యారు?** హైలెవల్, లోలెవల్‌జోన్ పరిధిలో 17 రిజర్వాయర్లు ఉన్నాయి. ఏడాది కిందటి వరకు సుమారు 60 మంది లీకేజీ కార్మికులు పని చేశారు. ప్రస్తుతం ఏడుగురే ఉన్నారు. వారంతా ఎక్కడికి వెళ్లారనే విషయం మాత్రం అధికారులు చెప్పలేకపోతున్నారు. అయితే వీరిని ఏడాది కిందట తొలగించడంతో పని భారం అధికమైంది. లీకేజీలు పరిష్కరించే వారు లేకుండాపోయారు. నీరంతా కలుషితం అవుతున్నా, సరఫరా చేస్తున్న నీటిలో మట్టి వస్తుండగా గుర్తించి పరిష్కరించే వారే లేకుండా పోయారు.

**టెండర్లతో శాశ్వత మరమ్మతులా** అన్ని డివిజన్‌లలో తాగునీటి పైపులైన్లు పగలడం, వాల్వులు చెడిపోయి నీరంతా బయటకు రావడంతో శుద్ధజలం రోడ్లపై ప్రవహిస్తోంది. వీటన్నింటికి తరచూ మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. అయితే లీకేజీలు, వాల్వుల మరమ్మతులకు టెండర్లు పిలిచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి ఒకసారి మరమ్మతులు చేస్తే మళ్లీ మూడు, నాలుగు నెలల తర్వాత అవే ప్రాంతాల్లో లీకేజీలు అవుతాయి. అలాంటప్పుడు ఎలా మరమ్మతులు చేస్తారనేది అధికారులు గుర్తించాలి.

నగరానికి స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రత్యేక రిజర్వాయర్లలో శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. అలాంటి నీరు భారీగా వృథా అవుతోంది. ప్రతి రోజు ఒక డివిజన్?కు సరిపడా (సుమారు 5 లక్షల లీటరు) నీరు వృథాగా పోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. **ఆదేశాలు జారీ చేశాం–** రాజ్‌కుమార్, ఎస్ఈ, కరీంనగర్ నగరపాలిక లీకేజీలకు మరమ్మతులు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేసేలా ఇంజినీర్లతో మాట్లాడాం.

డివిజన్లు: 66రిజర్వాయర్లు: 17

నల్లా కనెక్షన్లు: 64,165

పైపులైన్ల దూరం: 610 కి.మీ

## నక్కవాగులో ఇసుక తోడేళ్లు

హత్నూర: హత్నూర, సంగారెడ్డి మండలాల సరిహద్దుల్లోని నక్కవాగును ఇసుకాసురులు కొల్లగొడుతున్నారు. భారీ యంత్రాలతో మట్టి తవ్వకాలు చేపట్టి.. కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నారు. వివిధ ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక దందా దర్జాగా కొనసాగిస్తున్నా.. కట్టడి చేయడంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టించుకోని తీరుపై ఆరోపణలొస్తున్నాయి. హత్నూర మండలం గుండ్లమాచునూర్, పల్పనూర్, సంగారెడ్డి మండలం ఇస్మాయిఖాన్‌పేట, గౌడిచెర్ల పరిధిలోని నక్కవాగులో అక్రమార్కులు నెల రోజులుగా అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతూ.. ఇసుక తయారు చేస్తున్నారు.

**కొరవడిన అధికారుల నిఘా**

ఇసుక వ్యాపారులు నక్కవాగును జల్లెడలా మారుస్తున్నారు. వాగు రూపురేఖలు మారిపోతున్నాయి. వాహనాల రాకపోకలకు ఏకంగా వాగులో మట్టి రోడ్డు నిర్మించారు. పైపులు వేసి నీటికి అడ్డు కట్టలు కట్టారు. ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. అధికారులు అప్పుడప్పుడు నామమాత్రంగా దాడులు చేయడం.. ఆ తర్వాత మిన్నకుంటున్న తీరుపై విమర్శలొస్తున్నాయి. వాహనాలు సీజ్ చేసి క్రిమినల్, పీడీ కేసులు పెట్టి కఠినంగా శిక్షిస్తేనే.. అక్రమార్కుల తీరు మారుతుందని పలువురు సూచిస్తున్నారు.

**వంతెనకు ముప్పు**

ఇసుక తయారీ కోసం మట్టి తవ్వకాలు జరిపే ప్రాంతానికి అతి చేరువలో 161ఏఏ జాతీయ రహదారి ఉంది. ఆ రహదారిపై వాగుమీద నిర్మించిన వంతెన మనుగడకు ముప్పు పొంచి ఉంది. తవ్వకాలతో ఇసుక, మట్టి వరద ప్రవాహనికి కొట్టుకపోయి పిల్లర్లు క్రమంగా పట్టు



సడలి వంతెన కూలిపోయే పరిస్థిని నెలకొంది. తవ్వకాలు జరగకుండా చూడాలని రెండు మండలాల రైతులు ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందన కరవైంది. అధికారులు ఇసుక వ్యాపారుల ఆగడాలు కట్టడి చేయకపోతే భవిష్యత్తులో భారీ ముప్పు వాటిల్లే అవకాశం ఉంది.

**ఉక్కుపాదం మోపుతాం**

–రాజేందర్, ఆర్డీవో, సంగారెడ్డి

నక్కవాగు పరిసరాల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న విషయం మా దృష్టికొచ్చింది. సంగారెడ్డి, హత్నూర మండలాల తహసీల్దార్లతో కలిసి ఏకకాలంలో దాడి చేస్తాం. పట్టుబడిన వాహనాలు సీజ్ చేస్తాం. నిర్వాహకులపై పీడీ కేసులు పెట్టి జైలుకు పంపిస్తాం. నక్కవాగు ప్రాంతంలో కృత్రిమ ఇసుక తయారీపై ఉక్కుపాదం మోపుతాం.

## దారితప్పి.. నేరాల వలలో చిక్కి

మంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్న కాగజ్‌నగర్‌కు చెందిన విద్యార్థి ఇటీవల ద్విచక్రవాహనం చోరీ చేసి పోలీసులకు పట్టుబడ్డాడు. నేరం రుజువు కావడంతో జువైనల్‌హోంకు తరలించారు.స్థానిక జాఫర్‌నగర్‌కు చెందిన ఇద్దరు బాలురు తరచూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. పోలీసులకు పట్టుబడినా మార్పు రావడం లేదు. గంజాయి విక్రయాల్లో విద్యార్థులే కీలకంగా మారుతున్నారు. ఇప్పటికే పలు చోట్ల దొరికిన వారిలో మైనర్లే ఎక్కువగా ఉంటున్నారు.

న్యూస్‌టుడే, మంచిర్యాల నేర విభాగం: కౌమారంలో నేరాలకు పాల్పడుతూ జీవితాలను అంధకారంగా మార్చుకుంటున్న వారి సంఖ్య జిల్లాలో రోజురోజుకూ పెరుగుతోంది. చిన్నతనంలోనే వ్యసనాలకు బానిసలై, చెడు స్నేహాలు చేస్తూ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడవుతోంది. కొంతకాలంగా బాల, యువ నేరస్థుల సంఖ్య పెరుగుతూ, ప్రమాద ఘంటికలు మోగిస్తూ తల్లిదండ్రులను కలవరపరుస్తోంది.

జిల్లాలోని మంచిర్యాల, మందమర్రి, శ్రీరాంపూర్, బెల్లంపల్లిలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ విషసంస్కృతి విస్తరిస్తోంది. పెరిగిన వాతావరణం, స్నేహితుల ప్రభావం, ఆర్థిక పరిస్థితులే నేరాలకు ప్రధాన కారకాలు. ద్విచక్రవాహనం కొనుక్కోవాలనే కోరిక ఒక విద్యార్థిని చోరీకి ప్రేరేపిస్తే, జల్సాలకు డబ్బులు లేవనే కారణం మరో యువకుడిని నేరాలకు పురిగొల్పింది. దొంగతనం చేసి దొరికితే చదువులు, భవిష్యత్తు నాశనమవుతుందని తెలిసినా.. మానసిక పరిపక్వత, మార్గదర్శకత్వం లేకపోవడంతో నేరాల వైపు మళ్లుతున్నారు. చదువుకునే వయసులో శిక్ష అనుభవిస్తున్నారు. జిల్లాలో గతేడాది 25 కేసుల్లో 63 మంది.. ఈ ఏడాది 37 కేసుల్లో 74 మంది బాల నేరస్థులు జువైనల్ హోంలలో శిక్ష అనుభవిస్తున్నారు.

చెడు వ్యసనాలే కారణం.. : విశ్వేశ్వర్‌రావు, మానసిక వైద్యనిపుణుడు, మంచిర్యాలకుటుంబపరంగా ప్రేమలకు, బంధాలకు దూరమవుతున్న వారే చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. యుక్తవయసులో వారిపై అంతర్జాలం, సినిమాలు ప్రభావం చూపుతున్నాయి. మంచిని గ్రహించకుండా చెడునే స్వీకరిస్తున్నారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు మంచి, చెడులను చెప్పాలి. క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చాలి.

## తిర్పల్లి.. విస్తరణ లొల్లి

ఆదిలాబాద్ : జిల్లా కేంద్రంలో అత్యంత రద్దీగా ఉండే తిర్పల్లి రహదారి ఇది.. విస్తరణ పనులు ఆగిపోవడంతో ఎదురెదురుగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది.. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పట్టణంలో పాత జాతీయ రహదారి విస్తరణ చేపట్టేందుకు ఎనిమిదేళ్ల కిందటే పనులు చేపట్టారు. రిమ్స్ ఎదుట నుంచి తిర్పల్లి వరకు 5 కి.మీ మేర నాలుగు వరుసల రహదారిని ఆరు వరుసలుగా విస్తరించడానికి 2017లో రూ.44.20 కోట్లలో పనులు ప్రారంభించారు. మధ్యలో డివైడరు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి. తిర్పల్లి కాలనీకి వచ్చేసరికి అక్కడ రహదారి ప్రాంతంలో నివాసాలు ఉండటం అవాంతరంగా మారింది. పురపాలక, రోడ్లు భవనాలు, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఏళ్లుగా చిక్కుముడి వీడటం లేదు.

తిర్పల్లివద్ద దాదాపు 600 మీటర్ల మేర విస్తరణ పనులు ఒక వైపు పూర్తికావడం, మరోవైపు అధ్వానంగా ఉండటంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు. గుత్తేదారు తుదిబిల్లు తీసుకొని పని వదిలేసి వెళ్లిపోయారు. అప్పటినుంచి రూ.1.25 కోట్ల విలువైన పనులు ముందుకు సాగడం లేదు.ప్రత్యామ్నాయంపై అయిష్టత: రోడ్డు విస్తరణలో కోల్పోతున్న ఇళ్లకు ప్రత్యామ్నాయంగా మావల మండలం బట్టిసావర్గాం సమీపంలో నిర్మిస్తున్న ఐటీ టవర్‌కు సమీపంలో సర్వే నం.134లో ఎకరం స్థలాన్ని ఎంపిక చేశారు. పట్టణానికి దూరంగా ఉండడంతో వారంతా అయిష్టత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదు.. : ప్రవీణ్‌కుమార్, డీఈ, రోడ్లు భవనాల శాఖ రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ఇప్పటికీ ఎనిమిది సార్లు టెండర్లు పిలిచాం. గుత్తేదారులు ఎవరూ ముందుకు రావడం లేదు. విస్తరణకు అడ్డురాకుండా ఆక్రమణలు ఉండొద్దని సంబంధిత అధికారులను కోరుతూనే ఉన్నాం.

## పర్యవేక్షణ కరవు.. మొక్కలు కనిపించవు..

నిర్మల్ : నిర్మల్‌లోని కంచరోని కట్టపై ఒక వైపు భాగంలో పచ్చదనం పెంపునకు రక్షణగా జాలీలు అమర్చి అందమైన మొక్కలు నాటారు. మొక్కలు తొలగించి, రక్షణ కంచె నామరూపాల్లేకుండా చేసి కొందరు తమకు సంబంధించిన ఇసుక, కంకర నిల్వ చేసి వ్యాపారం చేస్తున్నారు. వాహనాలు అక్కడే పార్కింగ్ చేస్తున్నారు.
నిర్మల్– భైంసా ప్రధాన రహదారి మంజులాపూర్ శివారులో రెండేళ్ల క్రితం ఇరువైపులా మొక్కలు నాటారు. రక్షణగా కంచె ఏర్పాటు చేశారు. వాటిని పట్టించుకునే వారు లేక, నీళ్లు లేక మోడు వారి ఎండిపోయాయి. వన మహోత్సవంలో ఈ ఏడాది మరోసారి చదును చేసి మళ్లీ నాటారు. పర్యవేక్షణ లేక మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది.
పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం వెల్లివిరియాలన్న ఉద్దేశంతో గత సర్కారు హరితహారం, ప్రస్తుత ప్రభుత్వం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. నర్సరీల్లో పెంచి ఆయా చోట్లలో నాటారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాల్లో పెద్ద మొత్తంలో మొక్కలు నాటాలని



నిర?యించారు. కొన్నిచోట్ల నాటారు. ప్రస్తుతం ఎక్కడా వాటి జాడే లేకుండా పోయింది.జిల్లా కేంద్రంలో రెండేళ్లలో 75 వేలకుపైగా మొక్కలు రహదారుల పక్కన, విభాగినుల మధ్య నాటారు. ఒక్కో మొక్కకు వ్యయం రూ.25 వరకు అవుతుంది. వాటి పర్యవేక్షణ, నిర్వహణను పట్టించుకునే వారే లేకపోవడంతో మోడువారుతున్నాయి. కొన్ని చోట్ల ఏకంగా మైదానాలనే తలపిస్తున్నాయి. కొందరు మొక్కలు, జాలీలు తొలగించి మరీ స్థలాలను తమ వ్యాపారాలకు అనువుగా మార్చుకున్నారు. నిర్మల్– భైంసా మార్గంలోని విభాగిని మధ్యలోని మొక్కల పాదులు సైతం తీసిన దాఖలాలు లేకపోగా నీళ్లు ఇంకని పరిస్థితి. నీళ్లు లేక ఎండిపోతున్నాయి. నటరాజ్‌మిల్ ఎదుట ఇరువైపులా మొక్కలు చాలా బాగా పెరిగినా నీళ్లు లేక కొన్ని ఎండిపోతున్నాయి. కింది భాగంలో శుభ్రత లేక కళావిహీనంగా మారుతున్నాయి.
ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌ను సంప్రదించగా మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. కంచరోని చెరువు కట్టపై సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. మొక్కలకు నీళ్లు పట్టించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

## తండాలకు వెళ్లాలంటే తండ్లాట

సంగారెడ్డి : ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా కంగ్టి నుంచి పొట్‌పల్లి తండా మీదుగా సిర్గాపూర్‌కు వెళ్లే మార్గాన్ని తారు రోడ్డుగా మార్చేందుకు 2021–22లో రూ.4.37 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న గుత్తేదారు ఆ దారిపై కంకర పరిచి వదిలేశారు. ఇప్పటికీ తారు పనులు పూర్తి చేయలేదు. ఆ మార్గంలో వెళ్లే తండాలు, గ్రామాల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. నాగల్‌గిద్ద నుంచి కరాస్‌గుత్తి మీదుగా కరా?టక సరిహద్దుకు చేరుకోవడానికి ఆ దారిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.6.20 కోట్ల నిధులు కేటాయించింది. పిల్లర్ల నిర్మాణం చేపట్టి పనులను అసంపూర్తిగా వదిలేశారు. చేపట్టిన పనులు నాణ్యతగా లేవని అధికారులు నిర్ధారించారు.
ఈ రెండు పనులే కాదు.. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా జిల్లాలో చేపట్టిన పలు పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
రూ.106 కోట్ల నిధులు మంజూరు
మారుమూల తండాల నుంచి జిల్లా, మండల కేంద్రాలకు చేరుకునేలా రహదారుల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రజలకు రవాణా మార్గం సాఫీగా సాగడానికి రూ.కోట్లలో నిధులు మంజూరు చేస్తోంది. పనులు దక్కించుకున్న గుత్తేదార్లు అసంపూర్తిగా వదిలేయడంతో.. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నప్పటికీ.. కొన్ని చోట్ల ఇంకా పనులు ఆరంభించలేదు. జిల్లాకు పీఎంజీఎస్‌వై ద్వారా 2021, 2022, 2023 సంవత్సరాల్లో 29 పనులు మంజూరు చేసి.. రూ.106 కోట్లు మంజూరు చేశారు. అందులో 16 చోట్ల మాత్రమే పూర్తి చేశారు. ఎనిమిది పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన ఐదు చోట్ల తట్టెడు మట్టి కూడా తీయలేదు. ఏళ్లుగా తాత్సారం సాగుతోంది. ఆయా పనులకు ఎప్పుడు మోక్షం లభిస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు. పనులను వేగవంతం చేస్తామని పీఆర్ ఈఈ యుగంధర్ తెలిపారు.
జిల్లాలో పీఎంజీఎస్‌వై పనులిలా..
మంజూరైనవి... 29
నిధుల అంచనా: రూ:106 కోట్లు
పూర్తయినవి: 16
ఇప్పటి వరకు వ్యయం: రూ.53.27 కోట్లు
ప్రగతిలో ఉన్నవి: 8
ఆరంభించనివి: 5

## మూడో విడత.. ఫలితం ఎటువైపో..!

నర్సాపూర్: జిల్లాలో మొదటి, రెండు విడత పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యాయి. ఫలితాలు ఇటు అధికార కాంగ్రెస్, అటు ప్రతిపక్ష భారాస పార్టీలకు ఉత్కంఠ కలిగించాయి. ఇక రేపు మూడో విడత పోలింగ్ నర్సాపూర్ నియోజకవర్గంలో జరుగనున్న నేపథ్యంలో అందరి చూపు దీనిపైనే ఉంది. తొలి విడతలో కాంగ్రెస్ ప్రభంజనం కనిపించగా, రెండో విడతలో కాస్త తగ్గింది. భారాస పుంజుకుంది. 161 గ్రామాల్లో.. నర్సాపూర్, కౌడిపల్లి, శివ్వంపేట, వెల్దుర్తి, కొల్చారం, మాసాయిపేట, చిలప్‌చెడ్ మండలాల్లో పల్లె పోరు జరుగనుంది. మొత్తం 183 పంచాయతీలు ఉండగా, 22 గ్రామాల్లో సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా 161 పంచాయతీల్లో పోలింగ్ ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. ఆయా చోట్ల ఎవరికి వారే తమ పార్టీ మద్దతుదారులు గెలుస్తారంటూ లెక్కలు వేసుకుంటున్నారు. సొంత మండలాలపై దృష్టి.. ఎమ్మెల్యే సునీతారెడ్డి తన సొంత మండలం శివ్వంపేటపై ప్రత్యేక దృష్టిపెట్టారు. మొత్తం 37 పంచాయతీలు ఉండగా, 3 ఏకగ్రీవం అయ్యాయి. అత్యధిక స్థానాల్లో తమ మద్దతుదారులను గెలిపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ః మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు సుహాసినిరెడ్డి సొంత మండలం కౌడిపల్లిలో కాంగ్రెస్ మద్దతుదారుల తరపున విస్తృతంగా పర్యటిస్తున్నారు. ః డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ సొంత మండలం నర్సాపూర్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెల్దుర్తి ఉమ్మడి మండలంపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ నర్సాపూర్‌లో పావులు కదుపుతున్నారు.ఇప్పటి వరకు ఫలితాలు..తొలి విడత రెండో..

# సాఫీగా సాగిపోయేలా..



హైదరాబాద్: నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతోపాటు అవుటర్ రింగ్‌రోడ్డుకు సులువుగా చేరుకునేలా నగరంలో పలు కొత్త రహదారులు, ఎలివేటెడ్ కారిడార్లతోపాటు రహదారుల విస్తరణకు హెచ్?ఎండీఏ శ్రీకారం చుడుతోంది. కొన్ని ప్రాజెక్టులకు అనుమతులు రాగా కొత్తవి చేపట్టేందుకు టెండర్లు ఆహ్వానించింది. వివరాలను హెచ్?ఎండీఏ బుధవారం వెల్లడించింది.
ప్రస్తుతం సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి రాజీవ్ రహదారి (స్టేట్ హైవే–01)పై, ప్యారడైజ్ నుంచి డెయిరీఫాం రోడ్డు జాతీయ రహదారి–44 వరకు రెండు ఎలివేటెడ్? కారిడార్లతోపాటు తాజాగా బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ టవర్ నుంచి శిల్పా లేఅవుటర్ వరకు ఎలివేటెడ్ కారిడార్–3కి టెండర్లు ఆహ్వానించింది. ఈ కారిడార్ ద్వారా గచ్చిబౌలి వద్ద ఓఆర్?ఆర్?కు సిగ్నల్? లేకుండా ప్రయాణించవచ్చు. తొలిదశలో ఫిల్మ్?నగర్? నుంచి శిల్పా లేఅవుట్ వరకు 5 కిలోమీటర్లు, రెండోదశలో ఐసీసీసీ టవర్? నుచి హాకీంపేట్‌కుంట వరకు 4 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. బంజారాహిల్స్, ఫిల్మ్?నగర్, నార్నెరోడ్, ఐటీసీ కోహినూర్? రోడ్, టీహబ్, శిల్పా లేఅవుట్ కీలక ప్రాంతాలను అనుసంధానం చేస్తుంది. హైటెక్ సిటీ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్? రద్దీ తగ్గనుంది. 4, 6 లేన్లతో భూస్థాయి, ఎలివేటెడ్?గా రెండు భాగాలుగా ఉంటాయి. బంజారాహిల్స్? రోడ్డు నంబరు 82, నార్నెరోడ్, రోడ్డు నంబరు 52, ఐటీసీ కోహినూర్? రోడ్, టీహబ్ జంక్షన్, ఔరో రియాల్టీ జంక్షన్? వద్ద మొత్తం 6 ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లు ప్రతిపాదించారు. వ్యయం రూ.1656 కోట్లు.
నానక్?రాంగూడ నుంచి గచ్చిబౌలి వరకు అవుటర్? రింగ్?రోడ్డు ప్రధాన రహదారి (సర్వీసు రోడ్డు లేకుండా 3 లేన్ల వంతున) 75 మీటర్ల రైట్? ఆఫ్? వేతో గతంలో నిర్మించింది. గచ్చిబౌలి జంక్షన్? వద్ద జీహెచ్?ఎంసీ నిర్మించిన కొండాపూర్, శిల్పాలేఅవుట్? వైపు వెళ్లే 2 ఫ్లైఓవర్ల అప్రోచ్? ర్యాంపులు ప్రస్తుతం రహదారికి ఇరువైపులా ఉండటంతో ట్రాఫిక్? స్తభిస్తోంది. నానక్?రాంగూడ వరకు రద్దీ కొనసాగుతోంది. దీంతో నానక్?రాంగూడ నుంచి గచ్చిబౌలి వరకు ఓఆర్?ఆర్? ఎడమ వైపు ప్రధాన రహదారిని 3 లేన్ల నుంచి 4 లేన్లకు విస్తరించనున్నారు. ఈ పనులకు రూ.26.50 కోట్లతో పరిపాలనా అనుమతులను ప్రభుత్వం మంజూరు చేసింది.
కోకాపేట, మణికొండ, గండిపేట, పుప్పాలగూడ, నార్సింగి పరిసర ప్రాంతాల్లో రద్దీని తగ్గించేందుకు ఎంజీఐటీ నుంచి మణికొండ వరకు పైప్‌లైన్ రోడ్డును 3.57 కిలోమీటర్ల పొడవునా అభివృద్ధి చేయనున్నారు. 6 లేన్ల రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. రహదారి రెండువైపులా డ్రెయిన్ కమ్ ఫుట్‌పాత్, కల్వర్టులు, చిన్న వంతెనలు, జంక్షన్? అభివద్ధి, ల్యాండ్? స్కేపింగ్?కు రూ.110 కోట్లు వెచ్చించనున్నారు.

## వారికి రూ.కోట్లు.. సర్కారుకేమీ దక్కనట్లు




హైదరాబాద్: అనుమతి ఉందా.. లేదా.. అనే విషయాన్ని పక్కనపెడితే.. శివారులోని హోర్డింగులు.. యాడ్? ఏజెన్సీలు, వ్యక్తులు, అధికారులకు రూ.కోట్లు కురిపిస్తున్నాయి. శివారు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలకు మాత్రం రూపాయి దక్కట్లేదు. తాజాగా జీహెచ్‌ఎంసీలో విలీనమైన 27 స్థానిక సంస్థల పరిధిలోని దారుణ పరిస్థితులివి. రూ.కోట్ల ప్రజాధనంతో రోడ్లు నిర్మిస్తే.. వాటిపై అక్రమంగా హోర్డింగులను ఏర్పాటయ్యాయి. అందుకు అనుమతి ఉందంటున్నారు. కానీ రెండేళ్లుగా హోర్డింగులు, ఇతరత్రా ప్రకటన బోర్డుల నుంచి ప్రభుత్వం పన్ను వసూలు చేయలేదు. శివారులో మొత్తం 6,500 హోర్డింగులున్నాయి.
**దృష్టి సారించిన జీహెచ్‌ఎంసీ** పాత బల్దియా పరిధితో పోలిస్తే తాజాగా విలీనమైన 27 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో అక్రమ హోర్డింగులు అధికంగా ఉన్నాయి. వనస్థలిపురం నుంచి అబ్దుల్లాపూర్?మెట్? వరకు, ఉప్పల్ నుంచి ఘట్కేసర్ వరకు, అల్వాల్ నుంచి శామీర్?పేట్? వరకు, కొంపల్లి నుంచి మేడ్చల్ వరకు, మియాపూర్? నుంచి సంగారెడ్డి వరకు, సన్‌సిటీ నుంచి మొయినాబాద్? వరకు, నార్సింగి నుంచి వట్టినాగులపల్లి వరకు, రాజేంద్రనగర్? నుంచి శంషాబాద్? వరకు, చాంద్రాయణగుట్ట నుంచి తుక్కుగూడ వరకు, సాగర్?రింగురోడ్డు నుంచి గుర్రంగూడ వరకు వేలాదిగా అనధికార హోర్డింగులున్నట్లు ప్రకటనల విభాగం తేల్చింది. కొన్ని ఏజెన్సీలు మాత్రం రోడ్లు, భవనాలశాఖ పేరుతో నార్సింగి నుంచి శంకర్?పల్లి వరకు ప్రతి 100 మీటర్లకు ఓ క్యాంటీ లివర్?ను (హోర్డింగులాంటి ప్రకటన బోర్డు) ఏర్పాటు చేసుకున్నాయని, కోకాపేట, నానక్?రామ్?గూడ, ఇతరత్రా ప్రాంతాల్లో వెయ్యికిపైగా క్యాంటీ లివర్స్, లాలిపప్? యాడ్స్? (విభాగినిపై ఏర్పాటు చేసే చిన్న బోర్డులు)ను ఏర్పాటు చేసుకున్నట్లు తేలింది. పన్నులు పెంచే వరకు హోర్డింగులు, క్యాంటి లివర్స్, లాలిపప్? యాడ్స్? నుంచి పన్ను వసూలు చేయొద్దని, కొత్త అనుమతులు ఇవ్వొద్దని ప్రభుత్వం 2024 మార్చి 18న ఉత్తర్వులిచ్చింది. అప్పటి నుంచి ఎగవేత మొదలైంది. అనధికార ప్రకటనలను క్రమబద్ధీకరించడం ద్వారా ఏటా పన్ను రూపంలో రూ.500 కోట్ల ఆదాయం వస్తుందని జీహెచ్?ఎంసీ లెక్కలేస్తోంది.

## అనుసంధానిద్దాం.. సమయం ఆదా చేద్దాం



హైదరాబాద్ : నగర ట్రాఫిక్‌లో ద్విచక్ర వాహనంపై ఘట్‌కేసర్ నుంచి కోకాపేటకు ద్విచక్ర వాహనంపై వెళ్లేందుకు కనీసం రెండు గంటల సమయం పడుతుంది. అదే బస్సు, కారులో వెళితే 3 గంటలు పడుతుంది. ఇలా రోజూ 4 నుంచి ఆరు గంటల ట్రాఫిక్‌లోనే గడుపుతున్నవారు కోకొల్లలు. సంవత్సరానికి సగటున 85గంటలు ట్రాఫిక్?లోనే కాలం వెళ్లదీస్తున్నారంటూ కొన్ని అధ్యయనాలు సైతం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్(ఎంఎంటీఎస్?) నగర ప్రజా రవాణాలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న సర్వీసులను పెంచడంతోపాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఎంఎంటీఎస్? స్టేషన్ల నుంచి సబర్బన్ బస్సు సర్వీసులను అనుసంధానం చేయడం ద్వారా నగరవాసుల విలువైన సమయాన్ని ఆదా చేసే అవకాశముంది.
**ఇదీ పరిష్కారం..** ఘట్‌కేసర్ నుంచి కోకాపేట వెళ్లేందుకు.. ఎంఎంటీఎస్‌లో తెల్లాపూర్? చేరుకొని అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో కోకాపేటకు చేరుకోవడం ద్వారా కనీసం 70 నిముషాల సమయం ఆదా అవుతుంది. ఈ తరహాలోనే హైటెక్‌సిటీ, హఫీజ్‌పేట, తెల్లాపూర్ సబర్బన్ స్టేషన్లకు బస్సు సర్వీసులను పెంచడం ద్వారా వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గి ప్రజా రవాణా మెరుగుపడుతుంది. ఐటీ కారిడార్?లో నమోదవుతున్న కాలుష్యానికి సైతం చెక్ పెట్టొచ్చు.
**ఐటీ కారిడార్‌లో అత్యవసరం**
గచ్చిబౌలి, హైటెక్‌సిటీ, మాదాపూర్, కొండాపూర్, ఐఐఐటీ, కోకాపేట మొదలైన ప్రాంతాల్లో వాహనాల రద్దీ తీవ్రంగా ఉంది. ఉదయం 8 గంటల నుంచి 11, సాయంత్రం 5 నుంచి 8గంటలు మధ్య ట్రాఫిక్? జామ్?లు సర్వసాధారణంగా మారాయి. ఈ నేపథ్యంలో హైటెక్?సిటీ రైల్వేస్టేషన్? నుంచి సైబర్? టవర్స్, మైండ్?స్పేస్, కూకట్?పల్లి, కొండాపూర్? ప్రాంతాలకు బస్సు సర్వీసులను పెంచాల్సిన అవసరముంది.
బీబీనగర్ నుంచి ఆర్సీపురం లేదా తెల్లాపూర్, ఉందానగర్, ఫలక్?నుమా నుంచి అల్వాల్? వంటి మార్గాల్లో విస్తరణ అవసరం.
హఫీజ్‌పేట స్టేషన్ నుంచి కొండాపూర్, మియాపూర్, కూకట్?పల్లి, గచ్చిబౌలి ప్రాంతాలకు చేరుకునేలా ఆర్టీసీ మినీ బస్సులను నడపాలి. తద్వారా హఫీజ్?పేట నుంచి గచ్చిబౌలికి 20 నిముషాల్లో చేరుకునే వీలుంది.
తెల్లాపూర్? స్టేషన్? నుంచి కోకాపేట, అమెరికన్? కాన్సులేట్, విప్రో సర్కిల్? వంటి నివాస, వాణిజ్య ప్రాంతాలకు చేరుకునేలా రవాణా సదుపాయాలు కల్పించాలి.
ఎంఎంటీఎస్? మెరుగుదలకు చేపట్టాల్సిన చర్యలివీ..
ఆలస్యానికి తావు లేకుండా సమయపాలనను కఠినంగా అమలు చేయాలి.
ఒకే ట్రాక్‌పై బహుళ క్రాసింగ్?లు లేకుండా సాంకేతిక అంశాలపై దృష్టి సారించాలి.ఎంఎంటీఎస్? సర్వీసుల సంఖ్యను 150కి పెంచాలి.
బీబీనగర్? నుంచి ఆర్సీపురం, తెల్లాపూర్? నుంచి ఉందానగర్, ఫలక్?నుమా నుంచి అల్వాల్? మార్గంలో ఎంఎంటీఎస్? సర్వీసుల విస్తరణ కీలకం.

## ప్రోత్సాహకం.. అందక నిరుత్సాహం

చంద్రుగొండ : పంచాయతీ ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు నజరానా ప్రకటించింది. దీంతో అనేక గ్రామాలకు చెందిన వారంతా ఊరికి ఉపకారం చేయాలన్న ఉద్దేశంతో ఏకమయ్యారు. అభివృద్ధికి ప్రజలంతా రాజకీయాలు పక్కన పెట్టారు. గ్రామం అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని ఆశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 23 మండలాల్లో 471 పంచాయతీలున్నాయి. గత ప్రభుత్వం(2019) హయాంలో 43 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అప్పుడు ప్రభుత్వం ఒక్కో ఏకగ్రీవ పంచాయతీకి రూ.10 లక్షలు నజరానా ఇస్తానని ప్రకటించింది. ఐదేళ్ల కాలం పూర్తయినా ప్రభుత్వం పైసా విడుదల చేయలేదు.
**ఏకతాటిపై నిలబడి..**
చాలా గ్రామాల్లో ప్రజలు ప్రథమ పౌరుడిని ఏకగ్రీవం చేసుకొని మాట నిలబెట్టుకున్నారు. మళ్లీ ఎన్నికల క్రతువు మొదలైనా ఇప్పటి వరకు ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు మాత్రం విడుదల కాలేదు. పదవీ కాలం పూర్తయ్యేదాకా ఎదురు చూసి నిరాశ చెందారు. ప్రస్తుతం ఎన్నికలకు నజరానా వర్తిస్తుందా.. లేదా... అన్న సందేహం ఆశావహుల్లో నెలకొంది. ఇప్పుడు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె




ఆదినారాయణ మాత్రం ఏకగ్రీవ పంచాయతీలకు తన కోటా నుంచి రూ.10 లక్షలు ప్రోత్సాహం అందిస్తానని ప్రకటించారు.
**నిధుల్లేక ఇబ్బందులు**
ప్రోత్సాహకాలతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల నిధులతో గ్రామాలను సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనింపజేయాలని చాలామంది ముందుకు వచ్చారు. ఆశించిన మేరకు నిధులు రాకపోవటంతో సర్పంచులు అప్పులపాలయ్యారు. జనాభా ప్రాతిపదికన నిధులు విడుదల కావటంతో అన్ని రకాల పనులకు సరిపోక పల్లెల పురోభివృద్ధికి అడ్డంకిగా మారింది. అనుకున్న పనులను మాత్రం నెరవేర్చలేకపోయామని సర్పంచులు బాహాటంగానే అప్పట్లో ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నచిన్న పనులే తప్ప ప్రజా సమస్యల పరిష్కారంలో ఆశించినంతగా మెప్పు పొందలేకపోయామని వాపోయారు. ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. నిధుల కొరత కారణంగా పల్లెల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రహదారుల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల కల్పనలో విఘాతం ఏర్పడింది.

## గౌరవెల్లి.. హుస్నాబాద్ కల్పవల్లి

హుస్నాబాద్: మెట్టప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గంలో శాశ్వత సాగునీటి ఇబ్బందులు తీర్చడానికే గౌరవెల్లి రిజర్వాయరు నిర్మించారు. నీటి సరఫరాకున్న అడ్డంకులను తొలగిస్తే లక్ష ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారిగా హుస్నాబాద్‌కు వస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంత వాసులు సమస్య పరిష్కారానికి చొరవ చూపుతారని గంపెడాశలు పెట్టుకున్నారు.
**కాలువల నిర్మాణానికి రూ.430 కోట్లు**
రెండున్నరేళ్ల క్రితం 95 శాతం పనులు పూర్తయ్యాయి. ఎన్జీటీలో కేసు, భూ నిర్వాసితుల సమస్య కారణంగా రిజర్వాయరులోకి నీటి పంపింగ్ చేయడం లేదు. 8.25 టీఎంసీ సామర్థ్యం కల్గిన రిజర్వాయరులోకి నీటిని పంపింగ్ చేసి నిల్వ చేస్తే సుమారు లక్ష ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలగడంతో పాటు భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయి. రిజర్వాయరు నుంచి పంట పొలాలకు నీరిందించడానికి కాలువల నిర్మాణానికి రూ.430 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి పనులు వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.
**నియోజకవర్గాన్ని కరీంనగర్‌లో చేర్చుతారా?**
పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హుస్నాబాద్ సభలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు ముక్కలు చేసిన హుస్నాబాద్ శాసనసభ నియోజకవర్గాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో చేర్చుతామని హామీ ఇచ్చారు. దీనిపై వివిధ పక్షాల నాయకులు కూడా ఆందోళన చేస్తున్నాయి.
బహుజన ఉద్యమనేత సర్వాయిపాపన్నకోటను సందర్శించి ఆయన స్వగ్రామమైన ఖిలాషాపురంను కోటతో సహా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.
గండిపల్లిపై హామీ ప్రస్తావించేనా..



గౌరవెల్లి ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న గండిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి 2023 మార్చిలో పాదయాత్ర చేపట్టి హుస్నాబాద్‌లో జరిగిన సభలో మాట్లాడారు. అక్కన్నపేట మండలంలోని గండిపల్లి రిజర్వాయరును సందర్శించానని, అధికారంలోకి వస్తే ఆరు నెలల్లోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అప్పట్లోనే రీడిజైన్ చేసిన ఈ రిజర్వాయరుకు రూ.500 కోట్లతో అంచనాలు చేసినా మోక్షం లభించలేదు.
**వరద ముప్పు తొలగేనా..**
నాలుగు జిల్లాలకు మధ్యన అభివృద్ధి చెందుతున్న హుస్నాబాద్ పట్టణం భారీ వర్షం కురిస్తే జలమయం అవుతోంది. ప్రతి ఏటా ఇదే తంతు కొనసాగుతోంది. పట్టణంలో ప్రధానంగా మూడు కుంటలు తొలగించి వాటిలో మార్కెట్, పోలీస్ స్టేషన్, ఇతర భవనాల నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఎత్తయిన ప్రాంతాల నుంచి వచ్చే వరద పట్టణంలో ప్రవహించి ప్రజా జీవనాన్ని అతలాకుతలం చేస్తోంది. వరద మళ్లింపునకు ప్రత్యేక కార్యాచరణ చేపడితేనే శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. యార్డును అప్‌గ్రేడ్ చేసి కొత్త మార్కెట్ నిర్మాణంపై దృష్టి సారించాలి.

# పైపులైన్ పనులకు అనుమతుల గండం

భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లాలో తాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రత్యేకంగా వేస్తున్న పైపులైన్ పనులకు అటవీ శాఖ అనుమతులు అడ్డంకిగా మారాయి. అవసరాల మేరకు తాగునీటిని సరఫరా చేసేందుకు మల్లన్న సాగర్ నుంచి నేరుగా ప్రత్యేకంగా పైపు లైన్ వేసే పనులు 2024లో ప్రారంభమయ్యాయి. జిల్లాలోని భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పలు ప్రాంతాలకు మిషన్ భగీరథ పథకంలో మల్లన్న సాగర్ నుంచి గోదావరి జలాలను పంపిణీ చేస్తున్నారు. హైదరాబాద్ జంటనగరాలకు సరఫరా చేస్తున్న హెచ్ఎండబ్ల్యూఎస్ ద్వారా నీటి సరఫరా జరుగుతోంది.
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట సమీపంలోని గణపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, యాదగిరిగుట్ట క్షేత్రానికి నీటి సరఫరా చేస్తున్నారు. జిల్లా అవసరాల కోసం రోజుకు 100 ఎంఎల్‌డీల నీటి సరఫరా చేయాల్సి ఉండగా ప్రస్తుతం 35 ఎంఎల్‌డీల నీటిని మాత్రమే విడుదల చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
**గడువు ముగిసినా...** నీటి సరఫరా కోసం 33 కి.మీ మేర 1.6 డయామీటర్ల వ్యాసార్థం గల పైపులైన్ వేస్తున్నారు. ఈ పనులు 2025 సెప్టెంబరులోగా పూర్తికావాల్సి ఉంది. మల్లన్న సాగర్ నుంచి గణపురం



గుట్ట వరకు 33 కి.మీ మేర పైపులైన్ వేయాలని ప్రతిపాదించారు. రూ.200 కోట్లను కేటాయించి సుమారు రూ.160 కోట్లు ఖర్చుచేశారు. అక్కారం పనులు పూర్తి చేశారు. అక్కడి నుంచి అచ్చాయిపల్లి వరకు కూడా పైపులైన్ పనులు పూర్తయ్యాయి. మూడు కి.మీ పొడవునా అటవీ శాఖ భూములు ఉండటంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. అటవీ శాఖ అనుమతుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. ఇప్పటికే గణపురం నుంచి జిల్లాలోని తుర్కపల్లి వరకు పైపులైన్ ఉంది. గణపురం వద్ద ఉన్న పైపులైన్‌తో విడిగా వేసిన పైపులైన్‌కు కలుపుతారు. దీంతో హెచ్ఎండబ్ల్యూఎస్‌తో అసరం లేకుండా మల్లన్న సాగర్ నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా జిజిల్లాకు 100 ఎంఎల్‌డీల నీరు సరఫరా అవుతుంది.
**మార్చినాటికి పూర్తి స్థాయిలో సరఫరా...** శ్రీనివాస్, ఈఈ, మిషన్ భగీరథ... వచ్చే మార్చి నాటికి పైపులైన్ పనులు పూర్తిచేస్తాం. యాదాద్రి భువనగిరి జిల్లాకు మల్లన్న సాగర్ నుంచి నేరుగా పూర్తి స్థాయిలో నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. అటవీ శాఖ అనుమతుల కోసం నిరీక్షిస్తున్నాం. జనవరిలో అనుమతులు రావచ్చు.

# రాత్రిపూట.. ఇసుకాసురుల వేట..!

కొత్తగూడెం : కొందరు వ్యక్తులు రింగులా ఏర్పడి జిల్లాలోని సహజ సంపదను ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల మీదుగా హైదరాబాద్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సొంతింటి నిర్మాణానికి ఇసుక దొరక్క సామాన్యులు కన్నీరు పెడుతుంటే.. అక్రమార్కులు మాత్రం నదీగర్భాలను గుల్లచేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు.పగలు ప్రశాంతంగా కనిపించే నదీతీరాలు చీకటి పడగానే సందడిగా మారుతున్నాయి. అక్రమార్కులు.. భారీ యంత్రాలతో ఇసుకను తోడేసి రహస్య ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు.
**సరిహద్దులు దాటిస్తున్నారు..**
జిల్లాలో వివిధ ప్రాంతాల్లో తవ్వుతున్న ఇసుక.. స్థానిక ప్రజలకు అందటం లేదు. భారీ లారీల్లో లోడ్ చేసి రాత్రికి రాత్రే ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉన్నచోట విక్రయిస్తూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు.
**మామూళ్ల మత్తులో యంత్రాంగం**
కొన్నిచోట్ల అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతోందనే



ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. పహారా కాయాల్సిన వారే పక్కకు తప్పుకోవటంతో ఇసుక మాఫియాకు అడ్డు లేకుండా పోతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.
**పట్టుకునేది ఎవరిని..?**
ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను రెవెన్యూ, మైనింగ్, పోలీసు యంత్రాంగం పట్టుకుంటున్నా.. మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట పడకపోవటంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధుల అండ లేనివారిని.. అధికార యంత్రాంగానికి అంతా 'మామూలే' అని చెప్పని వారినే పట్టుకుంటున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు స్థానిక తహసీల్దార్లు, పోలీసులు ఎప్పటికప్పుడు కేసులు నమోదుచేస్తున్నారని ఉన్నతాధికారులు చెప్పటం పరిపాటిగా మారుతోంది.
**సామాన్యులకు చుక్కలు**
సామాన్యుడు ఒక ట్రాక్టర్ ఇసుక కోసం రూ.వేలు వెచ్చించి అనుమతుల కోసం ఎదురుచూస్తుంటే.. మాఫియా మాత్రం వేల టన్నుల ఇసుకను ఎలా తరలించగలుగుతోంది. అక్రమ రవాణా వెనుక ఉన్న 'పెద్ద' రహస్యం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మిగులుతోంది.
**ఏడాదిలో 301 కేసులు** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2025లో డిసెంబర్ 29 వరకు పోలీసు శాఖ.. ఇసుక అక్రమ రవాణా కేసులు-301 నమోదుచేయటం గమనార్హం. 327 వాహనాలను పోలీసులు స్వాధీనపరచుకున్నారు. 550 మందిని అరెస్ట్ చేశారు. జిల్లావ్యాప్తంగా సగటున నెలకు 25కు పైగా కేసులు నమోదవటం ఇసుక దందా సాగుతున్న తీరుకు నిదర్శనం గా నిలుస్తున్నాయి. పోలీసుశాఖ కాకుండా రెవెన్యూ, మైనింగ్ అధికారుల నమోదు చేసే కేసులను లెక్కిస్తే ఈ సంఖ్య మరింత పెరగనుంది.

# వీధుల్లో చెత్త.. నల్లా నీర్ బంద్



కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులతోపాటు తాగునీటి సరఫరా విభాగంలో విధులు నిర్వహించే కార్మికులు సైతం సమ్మె బాటపట్టారు. బకాయి వేతనాలు చెల్లించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు మొర పెట్టుకున్నా స్పందించకపోవడంతో ధర్నా చేస్తున్నారు.
**రెండు రోజులుగా..**
బల్దియాలో అయిదు ట్యాంకుల ద్వారా రోజూ 11 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందుకు పెద్దవాగు పంపు హౌజ్ ఆపరేటర్లు, నీటి సరఫరా, ఎలక్ట్రీషియన్ విభాగాల్లో మొత్తం 32 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ట్యాంకులకు పెద్దవాగు నుంచి నీటి సరఫరా, అక్కడినుంచి వార్డులకు నల్లాల ద్వారా నీటి సరఫరాతోపాటు పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేపడుతున్నారు. వీరికి నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడంలేదు. దీంతో కార్యాలయం ఎదుట బైఠాయించి సమ్మెకు దిగడంతో.. రెండు రోజులుగా సరఫరా నిలిచిపోయింది.
**పేరుకుపోతున్న చెత్తాచెదారం..**
పారిశుద్ధ్య విభాగంలో 141 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అయిదు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో.. ఈ నెల 22 నుంచి తొమ్మిది రోజులుగా సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిందని, అనారోగ్యం పాలైన వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని వాపోతున్నారు. సమ్మె కారణంగా పట్టణంలోని వీధులన్నీ చెత్తతో నిండిపోయాయి.
**ప్రభుత్వం స్పందిస్తేనే..**
జీతాలు సక్రమంగా అందకపోవడం, పీఎఫ్, ఈఎస్ఐ సొమ్మును కార్మికుల నుంచి వసూలు చేసి ఖాతాల్లో జమ చేయడం లేదనే సమస్యలపై పారిశుద్ధ్య కార్మికులు.. పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసినా పరిష్కారం లభించడంలేదు. పారిశుద్ధ్య, మంచినీటి, ఎలక్ట్రీషియన్ విభాగాల కార్మికులకు చెల్లించాల్సిన బకాయి వేతనాలు రూ.1,43,03,285 అవసరం. మున్సిపల్ కమిషనర్ రాజేందర్ నేతృత్వంలో కలెక్టర్‌కు సమస్యను విన్నవించారు. స్పందించిన పాలనాధికారి కార్మికుల వేతనాల చెల్లింపునకు నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శికి లేఖ రాశారు. ప్రభుత్వం స్పందించి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తేనే సమస్య పరిష్కారం అవుతుంది.

# కాలం కలిసిరాక.. అన్నదాత గోస



మంచిర్యాల : ఈ ఏడాది ఆగస్టులో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు నదులు, వాగులు, వంకలు పొంగడంతో తీర ప్రాంతాల్లోని వరి, పత్తి చేలు నీట మునిగాయి. పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. ఈ ఏడాది అన్నదాతకు కలిసి రాలేదు. పంట చేతికొచ్చే సమయంలో భారీ వర్షాలు, తుపాను ప్రభావం రైతన్నకు శాపంగా మారింది. తెగుళ్లు దిగుబడిపై ప్రభావం చూపాయి. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి.. ఆరుగాలం శ్రమించిన రైతులకు పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది.
**మద్దతు అంతంతమాత్రమే..**
పత్తి కొనుగోలు కోసం ప్రభుత్వం ఈ సారి కిసాన్ కపాస్ స్లాట్ బుకింగ్ యాప్ ప్రవేశపెట్టింది. క్వింటాలు పత్తికి మద్దతు ధర రూ.8,150 నిర?యించగా.. సీసీఐ నాణ్యత పేరుతో రూ.8,010 ధరతో కొనుగోలు చేసింది. 8 శాతం కన్నా ఎక్కువ తేమ వస్తే తేమ పేరుతో మరింత ధర తగ్గిస్తుండటంతో చాలా చోట్ల రైతులు దళారులు చెప్పిన ధరకే వారికే అమ్ముకున్నారు. వరిలో వానాకాలం సన్నాలు ఎక్కువగా సాగు చేశారు. ప్రైవేటు ధర.. ప్రభుత్వ ధరతో సమానంగా ఉండటంతో ప్రైవేటుకే విక్రయించారు. యాసంగిలో వరి ధాన్యం అమ్మేందుకు రైతులు అవస్థలు పడ్డారు. రైస్ మిల్లర్లు తేమ, నాణ్యత పేరుతో కోతలు విధించడంతో రైతులు నష్టపోయారు.
తుపాను.. తెగుళ్లతో తగ్గిన దిగుబడి
అకాల వర్షం, తెగుళ్ల ప్రభావంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నివారణకు పెట్టుబడి పెరిగింది. ఇంత చేసినా పంట చేతికి వచ్చే సమయంలో ఈదురుగాలులతో కురిసిన వర్షాలకు చాలా చోట్ల పైరు నేల రాలింది.
పెట్టుబడి సైతం రాలేదు
చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు బత్తుల బుచ్చన్న. రెబ్బనపల్లి గ్రామం. అయిదున్నర ఎకరాల్లో వరి సాగు చేశారు. సాగు, పురుగు మందులు, ఎరువులు, కూలీలకు కలిపి రూ.1.80 లక్షల పెట్టుబడి అయింది. వర్షాలకు పొలం పడిపోయింది. 50 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే చేతికి వచ్చింది. కనీసం పెట్టుబడి చేతికి రాలేదని వాపోతున్నారు.

# పరిశ్రమ స్వార్థం.. ఒంట్లోకి విషం



సిరిసిల్ల : జిల్లాలో బియ్యం మిల్లులు, డంపింగ్‌యార్డులు, గ్రానైట్ క్వారీలు, క్రషర్ల నుంచి వెలువడే కాలుష్యానికి తోడు సిరిసిల్ల పట్టణంలో అద్దకం పరిశ్రమ కూడా ఉంది. ఇందులో రంగుల తయారీకి ఉపయోగించే రసాయనాలు.. వాటి కలయిక పూర్తిగా పాత పద్ధతిలోనే సాగుతుండటంతో అందులోని కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారు. చుట్టూ గాలి, నీరు కలుషితమవుతోంది. సిరిసిల్ల పట్టణంలో నెలకొన్న పరిస్థితులపై కాలుష్య నియంత్రణ మండలి నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 49 పరిశ్రమలపై పీసీబీకి ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన టాస్క్‌ఫోర్స్ బృందం ఆరు పరిశ్రమల మూసివేతకు ఆదేశాలు జారీ చేశారు. అందులో జిల్లాలోని అద్దకం పరిశ్రమ ఉండటం గమనార్హం.
**60కి బదులు 77 మైక్రోగ్రాములు**
జిల్లా వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా అద్దకం పరిశ్రమ విస్తరించింది. వీటిలో వేలాదిమంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఇందులో పనిచేస్తున్నవారు ఎలాంటి రక్షణ చర్యలు పాటించకపోవడంతో శ్వాసకోస, జీర్ణాశయం, అలర్జీ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. అద్దకం పరిశ్రమలో ఒక ఘనపు మీటర్‌కు 60 మైక్రోగ్రాముల వాయు నాణ్యత ఉండాల్సినచోట.. సగటున 77 మైక్రోగ్రాములు ఉన్నట్లు నివేదికలు స్పష్టం చేశాయి.
**ఫిర్యాదులు వస్తేనే తనిఖీలు**
బియ్యం మిల్లుల యంత్రాలు వెదజల్లే పొగతో కార్బన్ డై ఆక్సైడ్ మోతాదు ఎక్కువై సమీప పొలాలు, చెట్లకు పొగ, ధూళి చేరుతుంది. సిరిసిల్ల పట్టణంలో బియ్యం మిల్లుల కన్నా అద్దకం పరిశ్రమలే ఎక్కువున్నాయి. వీటినుంచి వెలువడే రసాయన వ్యర్థ జలాలను చాలావరకు శుద్ధి చేయకుండానే వదులుతున్నారు. వీటిపక్కనే తాగునీటి పైపులు ఉండటం.. కొన్నిసార్లు పైపుల్లో కలిసి నీరు రంగు మారుతున్న ఉదంతాలు లేకపోలేదు.
**కనిపించని టాస్క్‌ఫోర్స్ బృందాలు**
ఆరునెలలకొకసారి జిల్లాస్థాయి వాయు నాణ్యత కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉన్నప్పటికి ఎక్కడా జరగడంలేదు. పీసీబీ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేసేది. సిబ్బంది కొరతతో ఆయా బృందాల జాడ కరవైంది.
**కాగితాలకే పరిమితం**
పట్టణ బృహత్ ప్రణాళికలో భాగంగా పరిశ్రమల జోన్‌ను పెద్దూరులో నిర్ణయించారు. ప్రణాళిక అమలు కాకపోవడంతో జనావాసాల్లోనే కొనసాగుతున్నాయి. టెక్స్‌టైల్, అపరెల్ పార్కుల మాదిరిగా అద్దకం పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేకంగా స్థలాలు కేటాయించాలని గతంలో యూనిట్ల యజమానులు గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనికోసం పట్టణంలో సర్వే కూడా చేశారు. ఆ నివేదికలు కాస్త కాగితాలకే పరిమితమయ్యాయి.

# ఇసుక దిబ్బలు.. కన్నీటి సుడులు

ఇందల్‌వాయి: ఈ చిత్రంలో కనిపిస్తున్న ఇసుక కుప్పలు ధర్పల్లి మండలం వాడి గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి రైతు పొలంలోనివి. ఆగస్టులో భారీ వర్షానికి ముత్యాల చెరువు తెగి ఆయనకున్న రెండెకరాల పొలమంతా ఇసుక మేటలు వేయడంతో వానాకాలంలో చేతికందిన పంట మొత్తం పోయింది. రెండు ట్రాక్టర్లు, జేసీబీ సాయంతో దాదాపు 30 గంటలకు పైగా ఇసుక, ఇతర వ్యర్థాలను కుప్పలు చేశారు. మరో 30 గంటలైనా పొలం పూర్వ పరిస్థితికి వచ్చే అవకాశం లేదని యాసంగి సాగు మానుకున్నారు. పంట నష్టంతో రూ.3 లక్షలు, పొలాన్ని యథాస్థితికి తెచ్చేందుకు రూ.లక్ష వరకు నష్టం జరిగింది. ఈ ఏడాది ఆగస్టు 28న హొన్నాజిపేట్ అటవీ ప్రాంతంలోని ముత్యాల చెరువు తెగిపోయి ధర్పల్లి, సిరికొండ, భీమ్‌గల్ మండలాల్లో బీభత్సం సృష్టించింది. వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు నీటమునిగాయి. వందల ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. దీంతోపాటు ఇందల్‌వాయిలోని డొంకల్ చెరువు తెగి గౌరారం, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల్లో వరదలు ఉప్పొంగాయి. వ్యవసాయాధికారులు వారం రోజులు క్షేత్రస్థాయిలో తిరిగి పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించారు.



అత్యవసరంగా స్పందించాల్సిన ప్రభుత్వం నాలుగు నెలలు గడిచినా.. నష్టపరిహారంపై ఊసెత్తడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
నాకున్న 5 ఎకరాల వ్యవసాయ భూమిలో ఇసుక మేటలు వేశాయి. 2 ఎకరాల భూమిని సాగులోకి తీసుకొచ్చేందుకు సుమారు రూ.3 లక్షలు ఖర్చయింది. ప్రస్తుతం 2 ఎకరాల్లో వరి వేశా. మరో మూడు ఎకరాలను చదును చేయాల్సి ఉంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.
రతన్, బీరప్ప తండా
**ప్రభుత్వానికి పంపాం** నష్టపోయిన పంటలపై క్షేత్రస్థాయిలో సర్వే చేసి నివేదికలు ప్రభుత్వానికి పంపాం. సర్కారు నిధులు విడుదల చేసి ఉత్తర్వులిస్తుంది. తదనుగుణం గా వాటిని అమలు చేస్తాం.శ్రీకాంత్, మండల వ్యవసాయాధికారి, ఇందల్‌వాయి

# అడ్డగోలుగా అక్రమం

రాజోలి : అధికారులను మచ్చిక చేసుకొని.. ఒకరికొకరు గుంపులుగా మారి.. సహజ సంపదను అడ్డగోలుగా దోచేస్తున్నా పట్టించుకునే నాథుడులేక, ఇసుకాసురులు ఆడింది ఆటగా సాగుతోంది. రాజోలి శివారులోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను రాత్రికి రాత్రి ఊరు దాటించేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఓ వైపు స్థానిక ప్రజలు ఇసుక దొరకక, నానా ఇక్కట్లు పడుతుంటే.. అక్రమార్కులు మాత్రం స్వేఛగా తరలించేస్తున్నారు. ప్రస్తుతం నదిలో ప్రహహం ఉన్నప్పటికీ లెక్కచేయకుండా పగటి వేళ ఎద్దుల బండ్ల ద్వారా ఇసుక డంపులు వేస్తున్నారు. రాత్రివేళ, తెల్లవారుజామున జేసీబీ, ట్రాక్టర్లతో నదిలోకి దిగి శాంతినగర్, అయిజ, గద్వాల తదితర ప్రాంతాలకు టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. పోలీసులు పహారా ఉండని, భారత్‌మాల హైవే ద్వారా ఈ తంతు కొనసాగుతోందని సమాచారం.**బెదిరింపులు:** రాజోలిలో గంగమ్మ, పెద్దమ్మ ఆలయాల సమీపంలో, మార్లబీడు వీధి, పునరావాస గృహాలు, కల్లాలుండే ఖాళీ



ప్రదేశాలు, పాడుబడిన ఇళ్ల మధ్య పెద్ద ఎత్తున ఇసుక డంప్ చేస్తున్నారు. రాత్రయి ందంటే.. ఈ డంపులను టిప్పర్లు, ట్రాక్టర్లలో నింపి తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి టిప్పరుకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు, ట్రాక్టర్ ఇసుకను రూ.6 - రూ.10 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇది రోజూ జరిగే తంతు అయినా.. కూతవేటు దూరంలోని ఠాణా, ఇసుక డంపులున్న ప్రాంతాల్లోనే మండల అధికా రుల కార్యాలయాలున్నా వారు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రవాణాను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న కొందరిపై బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండటంతో ఇసుకాసు రులు యథేఛగా ఈ తంతుకు పాల్పడుతున్నారనే ప్రజలు అంటున్నారు. అక్రమ రవాణా చేస్తే చర్యలుంటాయని తహసీల్దార్ రామ్మోహన్ పేర్కొన్నారు.

# రక్షించే కార్మికులకు ఇదేం శిక్ష!

తాంసి : సూర్యోదయానికి ముందే చీపుళ్లు.. చెత్త బుట్టలు, పూడికతీసే పారలతో వీధుల్లోకి అడుగుపెడతారు.. స్వఛతేకు రాత్రింబవళు శ్రమిస్తారు.. ప్రజలకు వ్యాధులు దరి చేరకుండా రక్షిస్తారు... అయినా, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ పరికరాలు కరవయ్యాయి. చర్మ వ్యాధుల బారిన పడుతున్నా.. అధికారులను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 473 పంచాయతీల్లో 1576 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. ప్రధాన రహదారులు, కూడళ్లతోపాటు వీధుల పరిసరాలను శుభ్రంగా ఉంచడం, మురుగు కాల్వల్లో పూడికతీత పనులు, చెత్తను తొలగిస్తుంటారు. ప్రభుత్వం పంచాయతీ నిధులతో ఏటా రెండు సార్లు కార్మికులందరికీ గ్లౌజులు, మాస్క్‌లు, రెండు జతల వస్త్రాలు, బూట్లు, తువాళ్లు, కొబ్బరినూనె, శానిటేషన్‌కు సంబంధించిన సబ్బులు ఇవ్వాలి. కానీ, క్షేత్రస్థాయిలో మాస్క్, బూట్లు, గ్లౌజులు ఇలా ఏదీ ఇవ్వడం లేదు. కొంతమంది కార్మికులు మాత్రం సొంతంగా కొనుగోలు చేసి ఆరోగ్యం కాపాడుకుం టుంటే.. మరికొందరు పూడిక, చెత్త ఇతర పనులు చేసే క్రమంలో చేతులు, కాళ్లు చెడిపోయి.. ఒళ్లంతా రోగాలతో బాధపడుతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కార్మికులకు రక్షణ పరికరాలు, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.
**బీమా చేయించాలి**
-బొజ్జు ఆశన్న, పారిశుద్ధ్య కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు
గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పంచాయతీ నిధులతో బీమా తప్పనిసరిగా చేయించాలి. కొన్నిచోట్ల చేయించడం లేదు. రక్షణ పరికరాలు ఆరు నెలలకోసారి అందించాలి. పలుమార్లు జిల్లా అధికారులు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

# లెక్క తేలుతోంది..

అనకాపల్లి : ఉపాధి హామీ పథకంలో బినామీ మస్తర్లకు చెక్ పెట్టేలా ప్రభుత్వం చేపట్టిన ఈ కేవైసీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇందులో పనులకు వచ్చే వారి, రానివారి లెక్క తేలుతోంది. త్వరలోనే వీరికి ముఖ ఆధా రిత హాజరు అమలు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఉపాధి హామీలో ఎక్కువగా బినామీ మస్తర్ల ద్వారా తేడాలు జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అందుకే వేతనదారులందరికీ ముఖ ఆధారిత హాజరు వేయడానికి వీలుగా నేషనల్ మస్తర్ మానిటరింగ్ సిస్టం (ఎన్.ఎం.ఎం.ఎస్.) యాప్ ద్వారా ఈ-కేవైసీ చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో అక్టోబరులో ప్రారంభించారు. 85 శాతం వరకు పూర్తి చేశారు. మరోవైపు కొత్త జాబ్ కార్డులు కావల్సినవారి నుంచి వేల సంఖ్యలోనే దరఖాస్తులు వచ్చాయి. ఈ-కేవైసీ నమోదుతో జిల్లాలో దాదాపు 31,467 బోగస్ జాబ్ కార్డులు



వెలుగులోకి వచ్చాయి. వీటిని రద్దు చేశారు. దీంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.

**అనుసంధానమైన వారికే ఉపాధి**

ప్రస్తుతం జరుగుతున్న సర్వే త్వరితంగా పూర్తి చేసేలా చూస్తున్నాం. ఇప్పటికే 85 శాతం చేశారు. గ్రామసభల్లో వేతనదారుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం ఈ-కేవైసీ అనుసంధానం జరిగిన వారే పనులకు వస్తున్నారు. దీంతోపాటు నూతన జాబ్ కార్డులను త్వరితగతిన మంజూరు చేయిస్తున్నాం.

# చలికాలం.. జాగ్రత్త చిన్నా

అనకాపల్లి : రావికమతం మండలం తోటకూరపాలెంకి చెందిన 11 ఏళ్ల చిన్నారికి చర్మంపై దద్దుర్లు వచ్చాయి. మందుల దుకాణాల్లో ఆయింట్‌మెంట్ కొని వాడారు. తగ్గకపోగా మరింత పెరిగాయి. అనకాపల్లి ఆసుపత్రికి తీసుకొస్తే చర్మం పొడిబారిన కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని గుర్తించారు. అచ్యుతాపురానికి చెందిన తొమ్మిదేళ్ల బాలుడికి దగ్గు మొదలైంది. దీనిని నిర్లక్ష్యంగా చేయడంతో ఇది కాస్తా ఆయాసంగా మారి ఊపిరి పీల్చుకోవడం కష్టమైంది.
జిల్లావ్యాప్తంగా చలి పెరిగింది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ కాలంలో చర్మం పొడిబారడం ఎక్కువగా ఉంటుంది. చిన్నారుల్లో ఇది మరింత ఎక్కువగా ఉంటుందని, నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించాలని చిన్నపిల్లల వైద్యులు చెపుతున్నారు. కానీ గ్రామీణ ప్రాంత ప్రజలు చర్మ సంబంధిత వ్యాధులపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. పరిస్థితి తీవ్రమయ్యాక కానీ ఆసుపత్రికి తీసుకురావడం లేదు. దీనివల్ల చిన్న వయస్సులోనే చర్మసంబంధిత వ్యాధులు వస్తున్నాయి. చలికితోడు పెరుగుతున్న కాలుష్యం వల్ల చిన్నారుల్లో శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి. దగ్గు, ఆయాసం, శ్వాస తీసుకోడానికి ఇబ్బంది పడుతూ చికిత్స కోసం ఆసుపత్రి వచ్చే చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. ఆదిలోనే తగిన చికిత్స చేయించుకుంటే ఎలాంటి సమస్యా ఉండదని వైద్యులు చెబుతున్నారు.
అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి రోజుకు 30 నుంచి 40 మంది వరకు చిన్నారులు చర్మసంబంధిత వ్యాధులతో బాధపడుతూ చికిత్స కోసం వస్తున్నారు. దగ్గు, శ్వాసకోశ సమస్యలతో వస్తున్న వారి సంఖ్య 15 నుంచి 20 వరకు ఉంటోంది.

**ఆధునిక సేవలు అందుబాటులో..**

చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో వసతులు కల్పించారు. నలుగురు చిన్నపిల్లల వైద్య నిపుణులతో ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. అప్పుడే పుట్టిన చంటిబిడ్డల నుంచి టీనేజ్ వరకు బాలల వరకు చికిత్స నిమిత్తం అవసరమైన పరికరాలు సమకూర్చారు. చిన్నపిల్లలకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు.

**నిర్లక్ష్యం చేయొద్దు**

చలికాలంలో పిల్లలకు చర్మ, శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా వస్తాయి. నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వసతులున్నాయి. డాక్టర్ వెంకటేశ్

# అమ్మలేం.. అనుభవించలేం

తాడేపల్లిగూడెం : డెల్టాలో రహదారి పక్కన సారవంతమైన భూములున్నాయి. కానీ.. అన్నదాత అవసరానికి ఉపయోగపడటం లేదు. గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో 30వేల ఎకరాల భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో వారసులకు బదిలీ చేయలేక, ఆర్థిక అవసరాలకు అమ్ముకోలేక ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నారు. తమ భూములను క్రమబద్ధీకరించాలని కోరుతూ వెళ్లని కార్యాలయం లేదు.. కలవని అధికారి లేరు. మొగల్తూరులో 722/1ఏ1 సర్వే నంబరు పరిధిలో సుమారు 98 ఎకరాలకు 25 సెంట్లు మాత్రమే ప్రభుత్వ భూమి కాగా మిగిలినది నిషేధిత జాబితాలో చేర్చారు. భీమవరం మండలం రాయలంలో 14/1లో 23 ఎకరాలు, 49/2లో 85 సెంట్లు, 51/2లో ఎకరంన్నర నిషేధిత జాబితాలోకి వెళ్లిపోయాయి.

**ఏలూరులో గ్రీవెన్స్**

కూటమి సర్కారు చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో ఉమ్మడి జిల్లాలో సుమారు 18 వేల ఫిర్యాదులొచ్చాయి. వాటిలో తమ భూములు నిషేధిత జాబితాలో చేర్చారని సుమారు 300 వరకు ఉన్నాయి. ఇదిగో అదిగో అంటూ అధికారులు చెప్పడమే గానీ ఇచ్చిన అర్జీలకు పరిష్కారం దొరకలేదు. ఇటీవల ఏలూరులో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో భూ సమస్యల పరిష్కారానికి డిసెంబరు 16న గ్రీవెన్స్ ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరిస్తున్నారు. ఇలాంటి గ్రీవెన్స్‌ను పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

**ఎటూ ఉపయోగపడక..** రెవెన్యూ రికార్డుల్లో పట్టాభూములుగా నమోదై క్రయవిక్రయాలు జరిగిన భూములను సైతం 22ఏలో చేర్చారు. పట్టాదారు పాస్ పుస్తకాలున్నా ఆన్‌లైన్‌లో మాత్రం నిషేధిత జాబితాలో చూపిస్తున్నాయి. వైద్య అవసరాలతో పాటు పిల్లల విద్య, వివాహ, ఇతర అవసరాలకు క్రయవిక్రయాలు చేసే వీల్లేక రైతులు అప్పుల పాలవుతున్నారు. ముఖ్యంగా గతంలో ఆ భూములను కొనుగోలు చేసిన రైతులు విక్రయించిన వారిపై గొడవలకు దిగుతున్నారు. మూడేళ్ల కిందట క్రయవిక్రయాలు జరిగిన భూమికి ఇటీవల మొగల్తూరులో ఇద్దరి రైతుల మధ్య తగాదా చోటుచేసుకుంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని డీఆర్వో నారాయణరెడ్డి తెలిపారు.

# ఇసుక బండి.. దారికి గండి



కర్నూలు: తుంగభద్ర తీరం వెంట గ్రామాల్లో ఇసుక వాహనాలు దూసుకెళ్తున్నాయి.. నిబంధనల కళ్లకు గంతలు కట్టి రవాణా శాఖ ఆదేశాలు విస్మరించి నిండుగా ఇసుక నింపి తరలిస్తున్నారు.. అధిక బరువుతో వెళ్తుండటంతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి.. ఆయా రోడ్లపై వాహనదారులు 'గొయ్యో'మొర్రో అనుకొంటూ వెళ్తున్నారు. నదిచాగి ఇసుక రీచ్? నుంచి వెళ్లే టిప్పర్ల కారణంగా కౌతాళం మండలం గోతులదొడ్డి- కుంబళనూరు మధ్య ఆరు కి.మీ.ల రహదారి భారీగా దెబ్బతింది. కల్వర్టు సుమారు ఎనిమిది నెలల కిందట కూలిపోయింది. 12 గ్రామాలకు వందలాది మంది ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూలిపోయిన కల్వర్టులో పడి ఇద్దరు ద్విచక్ర వాహనదారులు ఆరు నెలల కిందట మృత్యువాతపడ్డారు. ఇలా రహదారులు దెబ్బతిన్నా, కాలుష్య సమస్యలు తలెత్తినా పంచాయతీరాజ్, డీపీవో, ఆర్?అండ్?బీ తదితర శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు.

**నిధులున్నా గుంతలు పూడ్చరు**

మైనింగ్? ప్రాంతాల చుట్టూ ప్రత్యక్షంగా 10 కి.మీ, పరోక్షంగా 10-25 కి.మీ వరకు ప్రభావితమవుతున్న గ్రామాల్లో సౌకర్యాలు చక్కదిద్దాలన్నదే డీఎంఎఫ్? లక్ష్యం. ఖనిజంపై చెల్లించే రాయల్టీలో 30 శాతం డీఎంఎఫ్?కు వెళ్తుంది. ఈ నిధులతో రహదారులు, వంతెనలు, తాగునీటి పథకాలు, ఆర్వో ప్లాంట్లు, వైద్యశాల వంటి అభివృద్ధి పనులు చేపట్టొచ్చు. నంద్యాల జిల్లాలో డీఎంఎఫ్ నిధులు రూ.22.75కోట్లతో చేపట్టిన 124 పనులు ఇంకా పూర్తికాలేదు. కర్నూలు జిల్లాకు డీఎంఎఫ్? నిధులు సాధించడంలో గనులశాఖ అధికారులు విఫలమవుతుండటంతో ఆ నిధులు దక్కని దుస్థితి తలెత్తింది.

**కానరాని తనిఖీలు**

పది టైర్ల లారీలో 25 టన్నులు, 12 టైర్లు.. 31 టన్నులు, 16 టైర్ల లారీలో 35 టన్నుల మేర తీసుకెళ్లడానికి అనుమతులు ఉన్నాయి. దీంతోపాటు లోడుపై 3 టన్నులు మార్జిన్? ఇచ్చి, అంతకన్నా ఎక్కువ సామర్థ్యంతో వెళ్తే కేసులు నమోదు చేసే అధికారం రవాణా శాఖ అధికారులకు ఉంది. అధిక సామర్థ్యంతో వెళ్తున్న వాహనాలు గుర్తించి అదనంగా నింపిన లోడుకు ఒక టన్నుకు రూ.2-10 వేల వరకు జరిమానా విధించొచ్చు.
రీచ్‌ల నుంచి 10 టైర్ల లారీ 30-35 టన్నుల లోడుతో ఇసుక తీసుకెళ్తూ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. తడి ఇసుక కావడంతో మరింత బరువు ఉండటంతో రోడ్లు భారీగా దెబ్బతింటున్నాయి.

**ఛిద్రమైన దారులు**

నదిచాగి, గుడికంబాలి, మరళి ఇసుక రీచ్?ల నుంచి కొన్ని లారీలు కోసిగి, మాలపల్లి మీదుగా ఎమ్మిగనూరు వెళ్తుంటాయి. మాలపల్లి-ఎమ్మిగనూరు మధ్య 20 కి.మీ. దారి అత్యంత అధ్వానంగా మారింది. గుడికంబాలి ఇసుక రీచ్ నుంచి వాహనాలు పెద్దకడబూరు మండలం మీదుగా ఆదోని, ఎమ్మిగనూరు వెళ్తుంటాయి. దీంతో చిన్నకడబూరు నుంచి రంగాపురం వరకు రహదారి గుంతలమయంగా మారింది. సి.బెళగల్ మండలంలోని పల్?దొడ్డి, కె.సింగవరం, ఈర్లదిన్నె రీచ్‌ల నుంచి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. పోలకల్?-సి.బెళగల్ రహదారి కంబదహాల్ వరకు సుమారు 18 కి.మీ. మేర పూర్తిగా దెబ్బతింది. గూడూరు మండలం మునగాల నుంచి కొత్తకోట వరకు సుమారు ఐదు కి.మీ.ల రహదారి తీవ్రంగా దెబ్బతింది.

# తడారిన కేసీ మడి



నంద్యాల : కర్నూలు-కడప(కేసీ) కాల్వలో సాగు నీటి ప్రవాహం ఆగిపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర నీటి ఆధారంగా సుంకేసుల జలాశయం నుంచి వెలుగోడు వరకు పంటలు సాగు చేస్తారు. అధిక వర్షాల కారణంగా ఈసారి రబీ సీజను ఆలస్యమైంది. వరి, జొన్న, మొక్కజొన్న, మినుము, మిరప పంటలు సాగు చేశారు. కొన్ని కంకి దశలో మరికొన్ని పూత దశలో ఉన్నాయి. తుంగభద్ర జలాశయం గేట్లకు మరమ్మతులు చేస్తుండటంతో ఐదు రోజుల కిందట కాల్వలకు నీటి విడుదల నిలుపుదల చేశారు.

**50 వేల ఎకరాలపై ప్రభావం**

నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు, వెలుగోడు, బండిఆత్మకూరు, గడివేముల మండలాల్లోని అల్లూరు, వడ్డేమాను, ముచ్చుమర్రి, నెహ్రూనగర్, ప్రాతకోట, బన్నూరు, తంగడంచ, పగిడ్యాల, వాడాల, తూడిచర్ల, రుద్రవరం, కరిమద్దెల, పరమటూరు, యర్రగుంట్ల తదితర గ్రామాల్లో దాదాపు పదివేల ఎకరాల్లో వరి సాగు చేశారు. మిగిలిన ప్రాంతాల్లో జొన్న, మిరప, ఇతర ఆరుతడి పంటలు కలిపి 40 వేల ఎకరాల్లో సాగయ్యాయి. ఆయకట్టు ఎగువ ప్రాంతమైన నందికొట్కూరు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున వరి సాగు చేపట్టారు. ఇక్కడ వినియోగం ఎక్కువగా ఉంటుంది. దిగువకు నీళ్లు వెళ్లాలంటే కాల్వలో పూర్తి స్థాయి నీటి ప్రవాహం ఉండాలి. తుంగభద్ర నుంచి నీటి విడుదల ఆగిపోవడంతో చేతికొచ్చే దశలో ఉన్న 50 వేల ఎకరాల్లో పంట ఎండిపోయే పరిస్థితి నెలకొంది.

**ఎత్తిపోయడం సాధ్యమేనా**

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఎత్తిపోస్తే తప్ప పంటలను కాపాడే పరిస్థితి లేదు. ఇక్కడున్న నాలుగు పంపుల ద్వారా నిత్యం 1,000 క్యూసెక్కులు తీసుకోవడానికి అవకాశం ఉంది. రోజుకు 750 క్యూసెక్కుల నీటిని తీసుకుంటే తప్ప ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడుకోలేని పరిస్థితి. మూడు నెలల పాటు 5 టీఎంసీల వరకు ఎత్తిపోయాల్సి ఉంటుంది. ఇందుకు కేఆర్‌బీ (కృష్ణా రివర్? బోర్డు) అనుమతులు అవసరం. గతేడాది ఇలానే ముచ్చుమర్రి ద్వారా నీటిని తీసుకునే క్రమంలో తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు చెప్పడంతో ఆపేశారు. వెలుగోడు జలాశయం నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా అతి కష్టం మీద నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాలకు సాగు నీరు అందించారు. ముచ్చుమర్రి నుంచి ఎత్తిపోయడం ఒకింత వ్యయ, ప్రయాసలతో కూడుకున్నది. గతేడాది పంపింగ్ చేసిన నీటికే రూ.70 కోట్ల విద్యుత్తు వ్యయం అయింది. ఈ పథకానికి సంబంధించి పాత బకాయిలు ఇప్పటికే రూ.వందల కోట్లకు చేరుకున్నాయి.


**ముందస్తు సమాచారం లేదు : ఈశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు, కేసీ కెనాల్? డిస్ట్రిబ్యూటరీ కమిటీ** ముందస్తు సమాచారం లేకుండా నీటిని నిలుపుదల చేశారు. ప్రత్యామ్నాయ చర్యలు లేవు. సాగునీరు రాకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. జిల్లా కలెక్టర్, ఇరిగేషన్? సీఈని కలిశాం.

# డ్రోన్ ఉండగా.. దిగులెందుకు రైతన్నా

నూజివీడు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయంపై దృష్టి సారించింది. రైతులకు రాయితీపై చిరు ధాన్యాలు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, డ్రోన్లు పంపిణీ చేసింది. ఈ సేవలను మరింత అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా డ్రోన్ సేవలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. ప్రజా రవాణాలో క్యాబ్? మాదిరి చేసుకోవచ్చు. దాని ద్వారా కేవలం 15 నిమిషాల్లో ఎకరా విస్తీర్ణంలో రైతులు ఎరువులు పిచికారీ చేయించుకోవచ్చు.

**రాయితీపై మండలానికి రెండు..** గతంలో రైతులకు 80 శాతం రాయితీపై తొలుత మండలానికి రెండు చొప్పున అందజేశారు. జిల్లాలో ఎక్కడైనా రైతులు పొలాలకు పురుగు మందు పిచికారీ, ఎరువులు, విత్తనాలు చల్లడానికి డ్రోన్లను అద్దెకు తీసుకోవచ్చు. ఎక్కువ విస్తీర్ణం ఉన్నా, వీటితో సులభంగా పని ముగించవచ్చు. దూరాన్ని బట్టి వాటి నిర్వాహకులు అద్దె వసూలు చేస్తారు.

**ఎలాగంటే..** గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి 'ఉబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రైతు చరవాణి సంఖ్య, వివరాలు నింపాలి. మన లొకేషన్? ఆధారంగా సమీపంలో ఉన్న డ్రోన్లను చూపిస్తుంది.



దాని ఆధారంగా బుక్ చేసుకోవచ్చు.
గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన డ్రోన్ దీదీ, సేవల గోడ పత్రికలోని క్యూఆర్? కోడ్?ను స్కాన్? చేసి, డ్రోన్? సేవలను ఉపయోగించుకోవచ్చు. **ఎంతో ఉపయుక్తం..- హబీబ్ బాషా, జిల్లా వ్యవసాయాధికారి**

డ్రోన్ల వినియోగంతో కూలీల సమస్య అధిగమించడంతో పాటు, పురుగు మందులు, ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. సమయం, ఖర్చు ఆదా అవుతోంది. రైతులకు ఇది ఎంతో ఉపయుక్తం.

# కీలక మార్గాలు.. ఎన్నో అడ్డంకులు!

విశాఖపట్నం : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి నగరం, సమీప ప్రాంతాల నుంచి సులభంగా చేరుకోవటానికి విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రతిపాదించిన ఏడు రోడ్ల పనుల్లో అనుకున్నంత వేగం కనిపించడం లేదు. అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్నట్లుంది. కొన్ని సమస్యలను పరిష్కరించడంలో అధికారులు వేగంగా స్పందించటం లేదు. ముఖ్యంగా టీడీఆర్‌ల మంజూరులో జాప్యమే అవరోధంగా ఉంది.

**ఆటంకాలు తొలగితే..**

అడవివరం- గండిగుండం రోడ్డును మాస్టర్‌ప్లాన్‌లో 200 అడుగులుగా ప్రతిపాదిస్తే ప్రస్తుతం వంద అడుగుల్లో నిర్మిస్తున్నారు. ఈ మార్గంలో అటవీశాఖ భూములున్నాయి. ఆ శాఖ నుంచి అభ్యంతరా లొస్తున్నాయి. దీనిపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఇటీవల కలెక్టర్‌తోనూ సమావేశమయ్యారు. సుమారు 400 విద్యుత్తు స్తంభాలను మార్చాల్సి ఉంది. బోయపాలెం-మంగమారిపేట రోడ్డులో 39 ఆస్తులకు టీడీఆర్లు



మంజూరు చేయాల్సి ఉంది. పరదేశిపాలెం- గంభీరం మార్గానికి 600 మీటర్లలోని స్థలాలకు టీడీఆర్లు మంజూరు చేయాలి. నేరెళ్లవలస-తాళ్లవలస రోడ్డులో 40 ప్రయివేటు ఆస్తులతో పాటు ఒక ఎంపీపీ స్కూల్ ఉంది. దాన్ని అక్కడి నుంచి తరలించడం క్లిష్టంగా ఉంది. చిప్పాడ- పోలుపల్లి రోడ్డుకు ఇంకా ఆర్‌డీపీ, ఎలైన్‌మెంట్ తయారు చేయాలి. శివశక్తినగర్- హరితా ప్రాజెక్టు మార్గంలో ప్రైవేటు స్థలాలు ఇవ్వటానికి కొందరు ముందుకు రాలేదు. 'ప్రతి వారం పనుల ప్రగతిపై నివేదిక తెప్పించుకొని పరిశీలిస్తున్నాం. సమస్యలున్న చోట క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తయ్యేలా చూస్తున్నాం' అని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. మొత్తం రోడ్లు: 7
వ్యయం (అంచనా): రూ.174.64 కోట్లు

# అర్ధాకలితో పది విద్యార్థులు!!

మాధవధార : పదో తరగతిలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ప్రభుత్వం పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా డిసెంబరు ఒకటి నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో తరగతులను నిర్వహించినా మధ్యాహ్న భోజనం అందించ నున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. సాయంత్రం అల్పాహారం లేక విద్యార్థులు ఖాళీ కడుపుతో ప్రత్యేక తరగతుల్లో ఉంటున్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పిల్లలను చదివిస్తున్నారు. ఉదయం ఇంటి దగ్గర ఆహారం తీసుకుని, మధ్యాహ్నం పాఠశాలలో భోజనం చేస్తున్నారు. సాయంత్రం పాఠశాల విడిచిన తరువాత పది నిమిషాలు విరామం ఇచ్చి మళ్లీ వారికి రాత్రి 7 వరకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ సమయంలో ఆకలిగా ఉండటంతో తరగతుల పట్ల ఏకాగ్రత చూపలేకపోతున్నారు. అల్పాహారం అందిస్తే ఉత్సాహంగా హాజరవుతారని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

**మూడేళ్లుగా లేదు..:** గతంలో జీవీఎంసీలో ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు... మధ్యాహ్న భోజనం సరఫరా చేసే అక్షయపాత్రకే నిధులు కేటాయించి, సాయంత్రం పూట ప్రత్యేక తరగతుల విద్యార్థులకు అల్పాహారం అందించేవారు. మూడేళ్ల క్రితం వైకాపా ప్రభుత్వం



జీవీఎంసీ పరిధిలోని పాఠశాలలన్నీ జిల్లా విద్యాశాఖ పరిధిలోకి తీసుకు రావడంతో అప్పటి నుంచి జీవీఎంసీ నిధులు కేటాయింపు నిలిపివేసింది. దీంతో విద్యార్థులకు అల్పాహారం అందడం లేదు. జీవీఎంసీలోని 21 ఉన్నత పాఠశాలలకు మేయర్, కమిషనర్, కార్పొరేటర్లు స్పందించి అల్పాహారం అందించేలా తగు చర్యలు తీసుకోవాలని పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

**చాలా మంది పరిస్థితింతే..:** ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులు చాలా మంది ఏమీ తినకుండా వస్తున్నారని, కొన్ని చోట్ల ఉపాధ్యాయులు బిస్కెట్లు, అరటి పండ్లు వంటివి ఇస్తున్నారు. గతంలో స్వచ్ఛంద సంస్థలు, దాతలు, నాయకులు, సహకరించి అల్పాహారం అందించేవారు. దాతలు, పాలకులు ఈ అంశంపై దృష్టిసారించాల్సి ఉంది. 21 పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులు: 2,283 మంది
బాలురు: 1,144 బాలికలు 1,139

# రొయ్య 'ధర'హాసం

పాయకరావుపేట : రొయ్య మీసం మెలేస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలతో దెబ్బతిన్న ఆక్వా రైతులకు ధరల పెరుగుదలతో ఊరట లభిస్తోంది. అక్టోబరు వరకు ఒడుదొడుకులతో ఇబ్బంది పడగా.. ప్రస్తుతం ఎగుమతులు ఆశాజనకంగానే ఉండటంతో పరిస్థితులు కుదురుకుంటున్నాయి. రొయ్యల కౌంట్ ధరల్లో రూ.20 నుంచి 40 వరకు వ్యత్యాసం ఉండటం, క్రిస్మస్ నేపథ్యంలో ఎగుమతులకు డిమాండ్ నెలకొనడంతో సాగుదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జిల్లాలో పాయకరావుపేట, నక్కపల్లి, అచ్యుతాపురం, ఎస్.రాయవరం, ఎలమంచిలి మండలాల పరిధిలో రెండు వేల ఎకరాలకుపైగా రొయ్యల చెరువులున్నాయి. ఇక్కడి నుంచి వియత్నాం, చైనా, జపాన్, అమెరికా దేశాలకు రొయ్యలు ఎగుమతి అవుతున్నాయి. అమెరికా ఆంక్షల నేపథ్యంలో 20 శాతం వరకు ఆక్వా రైతులు పంట వేయలేదు. వేసవిలో వైట్ గట్, విబ్రియో, ఈహెచ్‌పీ వ్యాధుల ప్రభావంతో రొయ్యల దిగుబడి తగ్గింది. ప్రస్తుతం చలిగాలులు వీస్తుండటంతో వైట్‌స్పాట్ వ్యాప్తి చెందుతోంది. దీంతో రొయ్యలకు డిమాండుతో పాటు ధర పెరుగుతూ వస్తోంది. సీడ్‌లో నాణ్యత లేకపోవడంతో రొయ్యలు వ్యాధుల బారిన పడుతున్నాయని, పెట్టుబడి వ్యయం తగ్గించుకునేందుకు తక్కువ విస్తీర?ంలో ఎక్కువ సీడ్ వేస్తున్నారని పాయకరావుపేటకు చెందిన ఆక్వా రైతు యజ్జల చంద్రశేఖర్ చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల సాగుదారులు నష్టపోతున్నారన్నారు. తాజాగా ఊహించిన దానికన్నా ధర పెరగడంతో కష్టాల నుంచి ఒడ్డున పడతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 'జీవీఎంసీ'లో విలీనానికి సమ్మతమేనా?!

భీమిలి : రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో పంచాయతీలను విలీనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలోపు ఆ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. భీమిలిలో మూడు మండలాలకు సంబంధించి 64 పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేసేందుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇప్పటికే అక్కడి నాయకులతో చర్చించారు. స్థానిక పాలకుల అనుమతితో ప్రక్రియ పూర్తయితే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. విలీనమైతే 98 వార్డులతో విస్తరించిన ఉన్న జీవీఎంసీ పరిధి మారుతుంది. మళ్లీ వార్డుల విభజన ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది.

**అభివృద్ధి జరిగేనా..?**

భీమిలి, అనకాపల్లి పరిధికి చెందిన కాపులుప్పాడ, చేపలుప్పాడ, నిడిగట్టు, నగరంపాలెం, జేవీ అగ్రహారం, తాడి, వల్లూరు, తల్లవలని పాలెం, రాజుపాలెం విలీనం తర్వాత గ్రేటర్ విస్తీర్ణం 535 చదరపు కిలోమీటర్ల నుంచి 640 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. అయితే ఆయా ప్రాంతాల్లో ఇప్పటికీ గ్రామీణ వాతావరణమే కనిపిస్తుంది. ఇప్పుడు మళ్లీ మరో 64 పంచాయతీలను విలీనం చేస్తే.. నగర విస్తీర్ణం పెరుగుతుందే తప్ప, ప్రజల జీవనం విధానంలో మార్పులు ఆశించొచ్చా



అనే చర్చ కూడా సాగుతోంది.

భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో పంచాయతీల విలీనం అంశం ఇంకా తమ దృష్టికి రాలేదని జీవీఎంసీ ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ప్రభాకరరావు తెలిపారు.

**గతంలో ఇలా..** 2012లో పాలకవర్గం కాలపరిమితి తర్వాత భీమిలి, అనకాపల్లికి చెందిన పది పంచాయతీలను విలీనం చేయడానికి ప్రతిపాదించారు. ఆయా పంచాయతీల నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ఏళ్ల పాటు కేసులు పరిష్కారం కాలేదు. ఆ తర్వాత విలీన ప్రక్రియ పూర్తి చేసి, 2020లో జీవీఎంసీ ఎన్నికలు నిర్వహించారు. 2005లో గ్రామాలతో పాటు, పలు పంచాయతీలను విలీనం చేశారు. ఇప్పటికీ ఆయా ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో రహదారుల నిర్మాణం లేదు. తాగునీరు, వీధి దీపాలు, కాలువలు వంటి వసతులు అరకొరగానే ఉన్నాయి.

## కొత్త పంచాయితీలిస్తున్నారహో..

నక్కపల్లి : గ్రామాల అభివృద్ధిలో పంచాయతీలే కీలకం. ప్రస్తుతం మరిన్ని పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయిదేళ్ల కిందట ఏర్పాటు చేసిన నూతన పంచాయతీలకు తోడు ఇప్పుడు మరిన్ని ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి విశాఖగా ఉన్న సమయంలో 2020లో నూతన పంచాయతీల ఏర్పాటు జరిగింది. ఈ క్రమంలో 50 గ్రామాలు ఏర్పాటు కాగా, ఒక్క అనకాపల్లి జిల్లాలోనే 49 ఉన్నాయి. ఇందులో చీడిక, అవరాజాం, గొర్లి ధర్మవరం, చినమదీనా, సీతయ్యపేట, కంతారం, రామన్నపాలెం, చామంతిపురం, మామిడిపాలెం, మూలపేట, రామగిరి, దుగ్గాడ, మెట్టపాలెం, సుందరకోట, తిక్కవానిపాలెం, వెంకటాపురం, కె.కోట్నివిల్లి, రొంగలపాలెం, ములకపల్లి తదితర అప్పట్లో ఏర్పాటైనవే. ఇందులో ఒకట్రెండు మినహా మిగిలిన వాటన్నింటికి ఎన్నికలూ జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాజాగా నూతన పంచాయతీలకు, ఇతరత్రా సవరణలకు ప్రభుత్వం సుముఖత తెలుపుతూ వీటిపై ఉన్న నిషేధాన్ని ప్రస్తుతం సడలించింది.

ప్రభుత్వం చేసిన సడలింపు ద్వారా పంచాయతీని రెండు పంచాయతీలుగా మార్పు చేయడం, రెండు పంచాయతీలను ఒకేదానిగా మార్పు, ఒక పంచాయతీలో గ్రామాన్ని మరో పంచాయతీలోకి విలీనం చేయడం, సమీపంలోని పుర, నగరపాలక సంస్థల్లోకి చేర్చడం వరకు అవకాశం ఉంటుంది. ఓ పంచాయతీని మరో మండలంలోకి విలీనం చేసే సౌలభ్యం మాత్రం లేదు.

జిల్లాలో ప్రస్తుతం నక్కపల్లి మండలం రాజయ్యపేట నుంచి బోయపాడు, పెదతీనార్ల నుంచి దొండవాక, వి.మాదుగుల మండలం పోతనపూడి అగ్రహారం నుంచి కొండయ్యపాలెం, కోటవురట్ల మండలం కొత్త తంగేడు నుంచి పాత తంగేడు, రాంబిల్లి మండలం గోకివాడ నుంచి మూలకొత్తూరును విభజించి పంచాయతీ చేయాలనే ప్రతిపాదనలు స్థానికుల నుంచి వచ్చాయి. ఇలా జిల్లాలో 40 వరకు ఉంటాయని అంచనా. మరోవైపు దేవరాపల్లి మండలం కొత్తపెంట పంచాయతీని



కె.కోటపాడు మండలంలోకి విలీనం చేయాలనే డిమాండ్ ఉంది.

పంచాయతీ ఏర్పాటు కావాలంటే గ్రామంలో జనాభా, వనరులు, ప్రస్తుత పంచాయతీకి.. ప్రతిపాదిత గ్రామానికి మధ్య దూరం, రెవెన్యూ సర్వే నంబర్ల విభజన తదితర వాటిని పరిగణనలోకి తీసుకుంటారు. గ్రామాల విలీనం, విభజనకు సంబంధించి పంచాయతీల్లో పాలకవర్గం తీర్మానం చేయాలి. పాలకవర్గం లేని చోట్ల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ప్రక్రియ జరుగుతుంది.

**ప్రస్తుతం జిల్లా స్వరూపం**

మొత్తం పంచాయతీలు : 646

ప్రత్యేకాధికారి పాలనలో ఉన్నవి: మూడు (చీడిక, ఎం.చింతువ, అప్పారాయుడుపాలెం)

మేజర్ పంచాయతీలు : 48

జనాభా : 14,94,947

**ఆదేశాలు రాగానే అమలు**

ప్రభుత్వం పంచాయతీల్లో మార్పులు, చేర్పులకు సంబంధించి నిషేధం ఎత్తివేయడం ద్వారా నూతన ప్రతిపాదనలకు మార్గం సుగమం అవుతుంది. ఇందుకు సంబంధించి పూర్తిస్థాయిలో ఆదేశాలు రాగానే, ప్రతిపాదనలను కలెక్టర్ ద్వారా కమిషనర్‌కు పంపిస్తాం. అక్కడ ఆమోదం పొందుతాయి. ఈ ప్రక్రియ పూర్తయ్యే క్రమంలో గ్రామసభలు పెట్టి, తీర్మానాలు, అభ్యంతరాలు స్వీకరిస్తారు.

సందీప్, జిల్లా పంచాయతీ అధికారి

# కరిగిపోతున్న కొండ.. ఆగని దందా!



అనకాపల్లి : పర్యావరణానికి రక్షణగా నిలిచే కొండలను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. కాసులే పరమావధిగా తవ్వకాలు చేస్తున్నారు. కొండలకు ఆనవాళ్లే లేకుండా గుండు చేస్తున్నారు. అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపాల్సిన జిల్లా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో వారి అక్రమ తవ్వకాలను అంతేలేకుండా పోతోంది. నెలవారీ ముడుపులు అందడంతోనే అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని శేషుకొండ ఉంది. ఇక్కడ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన రాయి, గ్రావెల్, కంకర దొరుకుతుంది. కానీ.. ఇక్కడ తవ్వకాలు చేసేందుకు ఎటువంటి అనుమతులు లేవు. అయినా.. స్థానిక నేతల అండదండలతో అక్రమంగా తవ్వేస్తున్నారు. దర్జాగా భారీ యంత్రాలు పెట్టి కొల్లగొడుతున్నారు. బాంబుల సాయంతో పేల్చి కొండరాయి అమ్ముతున్నారు.

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిసర ప్రాంతాల్లో లేఅవుట్లు, నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో మట్టి, కంకర, రాయికి మంచి డిమాండ్? ఉంది. ఇదే అదునుగా చేసుకుని అక్రమార్కులు రాత్రింబవళ్లు తవ్వకాలు సాగిస్తూ రాయి ట్రాక్టర్? రూ. 1800, కంకర రూ. 1200కు విక్రయిస్తున్నారు. కంకరను ట్రాక్టర్? రూ. 2 వేల వరకు అమ్ముతున్నారు. దూర ప్రాంతాలకు అయితే ఈ రేటు పెరుగుతుంది.

రాంబిల్లిలోని పేలోడు కొండప్రాంతంలో కొంతకాలంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయి. ఇళ్ల పునాదులు, లేఅవుట్ల ఎత్తుకు తరలించేస్తున్నారు. స్థానికంగా ఉన్నవారు కంకర తవ్వకాలపై స్థానిక రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇచ్చినా స్పందించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమమని తెలిసినా అంతే..

శేషుకొండ పరిధిలో ఏఎంఆర్? కంపెనీకి ఓ చెక్‌పోస్టు ఉంది. శేషుకొండలో తవ్వకాలు చేసి.. వేరే మార్గంలో తరలిస్తే తమ ఆదాయం పోతుందని తవ్వకాలు చేస్తున్నచోట సీనరేజీ వసూలు చేస్తున్నారు. ఈ తవ్వకాలు అక్రమ వ్యాపారమని ఏఎంఆర్? కంపెనీ ప్రతినిధులకు తెలిసినా.. కనీసం మైనింగ్? అధికారులకు సమాచారం ఇవ్వడంలేదు. దీనికి తోడు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇదే తరహాలో రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో కొండలను పిండిచేసి అక్రమ కంకర వ్యాపారం చేస్తున్నారు. ఈ విషయాన్ని కొందరు మైనింగ్? అధికారులకు సమాచారం అందించినా వారు పట్టించుకోవడంలేదు.

**అక్రమంగా తవ్వితే చర్యలు**

– శ్రీనివాస్, మైనింగ్ ఏడీ, అనకాపల్లి

శేషుకొండ ప్రాంతంలో కంకర, రాయి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవు. అక్రమంగా తవ్వకాలు చేయడం నేరం. అక్కడ ఇటీవల ఫిర్యాదులు అందడంతో.. రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశాం. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తే.. అపరాధ రుసుం విధించి వాహనాలు సీజ్? చేస్తాం.

# మట్టి మింగేస్తున్నారు



ధర్మవరం : ధర్మవరం నియోజకవర్గంలో మట్టి మాఫియా పెట్రేగుతోంది. కొండలు, గుట్టలను తవ్వి మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెరువులనూ వదలడం లేదు. బత్తలపల్లి మండలంలోని అప్పరాచెరువు గ్రామ సమీపంలో మట్టి తవ్వకాలతో కొండలు కనుమరుగు అవుతున్నాయి. కొండకు ఇరువైపులా యంత్రాలతో తవ్వి టిప్పర్లలో ధర్మవరం పట్టణంతోపాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. డిమాండ్?ను బట్టి టిప్పర్? మట్టి రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు విక్రయిస్తున్నారు. పోట్లమర్రి చెరువులోనూ విచ్చలవిడిగా మట్టి తవ్వి బత్తలపల్లి, ధర్మవరం ప్రాంతాల్లో వెంచర్లకు, భవన నిర్మాణాల పునాదులకు విక్రయిస్తున్నారు. తహసీల్దారు, పోలీసుస్టేషన్? పక్కనే మట్టి టిప్పర్లు వెళ్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఫిర్యాదులు వచ్చినా అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తాయి. అక్రమార్కులు ఆయా శాఖల్లోని కిందిస్థాయి సిబ్బంది, అధికారులకు భారీగా మొత్తం ముట్టచెబుతూ మట్టి దోపిడీకి పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**కేసులు నమోదు చేస్తాం**

మట్టి తరలింపునకు ఎవరికీ అనుమతులు లేవు. అప్పరాచెరువు, పోట్లమర్రి ప్రాంతాల్లో తవ్వకాలపై విచారణ చేపడతాం. అక్రమంగా మట్టి తరలించేందుకు ఉపయోగించే పొక్లెయిన్లు, టిప్పర్లను జప్తు చేసి కేసులు నమోదు చేస్తాం. స్థానిక రెవెన్యూ, పోలీసుల పర్యవేక్షణ ఉండే విధంగా చూస్తాం.

మహేష్, ఆర్డీవో ధర్మవరం

# కవర్ కట్టు.. లాభాలు పట్టు



అనంతపురం: ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు వాతావరణ పరిస్థితులను తట్టుకుని పండ్ల నాణ్యతను పెంచడం కష్టంగా మారేది. ఫ్రూట్ కవర్ల వినియోగంతో ఈ సమస్యను అధిగమిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దానిమ్మ, అరటి, మామిడి రైతులు ఫ్రూట్, ప్లాంట్ కవర్లు వినియోగిస్తూ నాణ్యమైన దిగుబడి సాధిస్తున్నారు. పండ్లు నాణ్యతగా ఉండటంతో వ్యాపారులు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

**దానిమ్మలో అదనపు ఆదాయం**

దానిమ్మలో ఫ్రూట్ కవర్లు, ప్లాంట్ కవర్లు ఏర్పాటు చేసేందుకు హెక్టారుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చవుతోంది. కవర్ల వినియోగంతో హెక్టారుకు 2 టన్నుల మేర దిగుబడి పెరిగే అవకాశం ఉంది. సాధారణ సాగులో హెక్టారుకు 4 క్వింటాళ్ల వరకు పండ్లకు మచ్చలు ఏర్పడతాయని అధికారులు చెబుతున్నారు. నాణ్యమైన పండ్లు ప్రస్తుతం కిలో రూ.200 కాగా మచ్చలున్న కాయలు రూ.80కు మించి పలకడం లేదు. ఫ్రూట్‌కవర్ల వినియోగంతో హెక్టారుకు రూ.2 లక్షల వరకు అదనపు ఆదాయం పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం మార్కెట్‌లో కాస్మోటిక్ ఫ్రూట్ ప్రొటెక్షన్ బ్యాగులు, నాన్ వోవెన్ కవర్లు, పేపర్ కవర్లు అందుబాటులో ఉన్నాయి. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చవుతుంది. తెలుపు, ఎరుపు రంగుల్లో లభ్యమవుతున్నాయి. పండు రంగుకు అనుగుణంగా కవర్లను ఎంపిక చేసుకోవచ్చు. పిందె దశలోనే గాలి చొరబడకుండా ఫ్రూట్? కవర్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

**తెగుళ్ల నుంచి రక్షణ**

ఉద్యాన పంటల్లో ఫ్రూట్ కవర్లు వాడటం వల్ల చీడపీడలు, పక్షులు, ఈగల నుంచి రక్షణ లభిస్తుంది. ప్రతికూల వాతావరణంలోనూ నాణ్యతపై ప్రభావం పడదు. ఎండ, వాన, గాలుల నుంచి కలిగే నష్టాన్ని తగ్గిస్తాయి. రంగు మెరుగుపడి పండ్ల నాణ్యత పెరుగుతుంది.

పురుగు మందుల ఖర్చులు తగ్గి రైతులకు పెట్టుబడి తగ్గుతుంది.

# తమలపాకు.. ధర రికార్డుబ్రేకు

పాయకరావుపేట: తమలపాకు ధర ఎన్నడూలేని రీతిలో పెరిగింది. బంగారం, వెండి ధరల పెరుగుతున్న తీరుగానే... ఆకుల ధరలు ఆకాశానికి చేరాయి. ప్రస్తుతం పంతా రూ. 100 చొప్పున రైతులు విక్రయిస్తున్నారు. 150 నుంచి 180 ఆకులు కట్ట కడతారు. దీన్ని పంతాగా పిలుస్తారు. రాష్ట్రవ్యాప్తంగా తమలపాకు తోటల్లో ఆకుల దిగుబడి తగ్గింది. దీంతోపాటు వైరస్ తెగుళ్లతో తోటలు దెబ్బతిన్నాయి. ఆకుల లభ్యత తగ్గింది. దీంతో నెల రోజులుగా ధర పెరుగుతూనే ఉంది. పాయకరావుపేట మండలం సత్యవరం, అరట్లకోట, కొత్తూరు, పెదరామభద్రపురం, మంగవరం, గోపాలపట్నం, మాసాహెబ్?పేట, సత్యవరం, ఎస్?.రాయవరం, లింగరాజుపాలెం గ్రామాల పరిధిలో సుమారు మూడు వేల ఎకరాల్లో ఈ పంట సాగు చేస్తున్నారు. ఇక్కడి నుంచి తెలంగాణ, ఢిల్లీ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు ఆకులను ఎగుమతి చేస్తుంటారు. 55 ఏళ్ల నుంచి తమలపాకును పండిస్తున్నామని, ఇప్పటివరకు రూ. 65 గరిష్ఠ ధర చూశామని, పంతా రూ. వందకు అమ్మడం ఇదే తొలిసారని మాసాహెబ్‌పేటకు చెందిన రైతు కొంతం నాగేశ్వరరావు పేర్కొన్నారు. తెగుళ్ల కారణంగా ఎకరాకు 500 పంతాలకు మించి రావడం లేదని తెలిపారు.

# స్మార్ట్ ఏఐ డస్ట్‌బిన్

కర్నూలు : నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న జనాభాతో పాటు డంపింగ్ యార్డుల్లో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. వివిధ చోట్ల కొన్ని వస్తువులను రీసైక్లింగ్ చేస్తున్నా.. వ్యర్థాలన్నీ కలిసిపోయి ఉండటంతో వేరుచేయడం కష్టమవుతోంది. దీనికి పరిష్కారంగా కర్నూలుకు చెందిన జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు స్మార్ట్ ఏఐ డస్ట్‌బిన్ రూపొందించారు. రీసైక్లింగ్, నాన్ రీసైక్లింగ్ వస్తువులను ఇందులో వేయగానే ఆ రెండింటిని వేరుచేస్తోంది. సీఎస్‌ఎం చదువుతున్న ఎన్.హర్షవర్ధన్, ఎం.భరణికుమార్‌రెడ్డి, పి.లహరి కలిసి దీన్ని తయారుచేశారు. ఇందుకోసం ఎరుపు రంగు, ఆకుపచ్చ రంగు గల రెండు చెత్తబుట్టలను తీసుకొన్నారు. దీనికి సెన్సార్‌తో కూడిన



ఆర్డినో అండ్ స్టెప్పర్ మోటారు అమర్చారు. చెత్తబుట్టలపైన వస్తువులను ఉంచేందుకు వీలుగా ఓ అట్టముక్కను ఏర్పాటు చేశారు. ఆపైన ఓ ఇనుప కడ్డీకి ఈఎస్‌పీ32-సీఎంఏ కెమెరా బిగించారు. రీసైక్లింగ్, నాన్ రీసైక్లింగ్‌కు సంబంధించిన 88 రకాల వస్తువులను గుర్తించేందుకు వీలుగా వాటి చిత్రాలను ముందుగానే అందులో నిక్షిప్తం చేశారు. వివిధ రకాల వస్తువులను అట్టముక్కపై ఉంచగానే సెన్సార్ సాయంతో వాటిని గుర్తిస్తోంది. రీసైక్లింగ్ చేసే వస్తువులను ఆకుపచ్చ రంగు చెత్తబుట్టలో, నాన్ రీసైక్లింగ్ వస్తువులను ఎరుపు రంగు చెత్తబుట్టలో వేస్తోంది. ఇందుకు అనుగుణంగా మోటారు ఎడమ, కుడివైపు సులువుగా తిరుగుతోంది. దీన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించగా విజయవంతమైంది. తమిళనాడులోని చెంగల్పట్టులో సెప్టెంబరు 4న ఇన్ఫోసిస్-పాల్స్ టెక్ జూకా హ్యాకథాన్-2025లో నిర్వహించిన ప్రదర్శనలో జాతీయస్థాయిలో రెండో బహుమతి సాధించింది. నమూనా రూపొందించగా.. పూర్తిస్థాయిలో తయారీకి కసరత్తులు చేస్తున్నారు.

# గుట్ట దిగని మైలు'రాయి'

నంద్యాల : నిధులున్నా 'దారి'న పడటం లేదు. ఈ-పాస్ విధానంతో ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల రహదారులు, వంతెనల నిర్మాణాలు ఆగిపోయాయి. రోడ్డు, వంతెనలకు సంబంధించి నంద్యాల జిల్లాలో 27 పనులు(రూ.663 కోట్లు), కర్నూలులో 11 పనులు(రూ. 523 కోట్లు) చేపట్టాల్సి ఉంది. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. వీటి నిర్మాణానికి అవసరమైన కంకరను గతంలో నేరుగా క్వారీలు, గనుల నుంచి సేకరించేవారు. ప్రస్తుతం తీసుకొచ్చిన ఈ-పాస్ విధానంతో గుత్తే'దారి' కదలడం లేదు.

**అన్నింటికీ ఆటంకం**

కొత్తగా తీసుకొచ్చిన ఈ-పాస్ విధానం పలు అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతోంది. కేంద్ర రహదారుల పనులు, కోర్‌నెట్ ప్లాన్, ఆర్ఐడీఎఫ్, మేజర్ జిల్లా రహదారులు, ఎన్‌డీబీ పనులు, భవన నిర్మాణాలు, నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం ఫేజ్-2, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులు ఫేజ్-1, ఫేజ్-2, జీవో నంబరు 350, 151 కింద మంజూరైనా ప్రధాన జిల్లా, రాష్ట్ర రహదారులు, నాబార్డు, ఎండీఆర్ పనులు ఉన్నాయి.

నంద్యాల నియోజకవర్గం పరిధిలో ఆరు, మంత్రాలయంలో మూడు, ఆలూరులో నాలుగు, పత్తికొండలో ఆరు, కోడుమూరు నియోజకవర్గం పరిధిలో రెండు చోట్ల రహదారి పనులు ప్రారంభమే కాలేదు.

**ఈపాస్ కష్టాలు** రహదారి, వంతెన తదితర నిర్మాణాలకు అవసరమైన మెటల్, గ్రావెల్, కంకర తదితరాల కోసం ముందుగా ఆర్అండ్‌బీ హెచ్‌వోడీ వర్క్ ఆర్డర్ ఇవ్వాలి. ఇందుకు తగ్గ అంచనాలు పేర్కొనాలి. ఆ దస్త్రం శాఖకు చేరుతుంది. అప్పుడు సీనరేజ్ పుస్తకం ఇస్తారు. ఆ వివరాలు తిరిగి ఆర్అండ్‌బీకి చేరుతాయి.

కంకర, గ్రావెల్ తదితర సామగ్రికి సంబంధించిన చలానాను 'ఆన్‌లైన్'లో చెల్లించాలి. అప్పుడు గనుల శాఖ సీనరేజ్ 'ఈ-పాస్' బిల్లు జారీ చేస్తుంది. దాని ప్రకారం రోడ్డు నిర్మాణ సామగ్రిని తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఇదంతా జరగడానికి నెలల తరబడి పట్టే అవకాశం ఉంది.

వీటిపై తీవ్ర ప్రభావం

కర్నూలు జిల్లాలో ఎండీఆర్ పథకం కింద 13 పనులు మంజూరయ్యాయి. 2 మాత్రమే పూర్తయ్యాయి. నంద్యాల జిల్లాలో ఆత్మకూరు షాదీఖానాకు డిపాజిట్ వర్క్స్ బిల్డింగ్ కింద నిధులు మంజూరు కాగా కొత్త నిబంధనలతో పనులు ముందుకు సాగడం లేదు.

కర్నూలులో రూ.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న న్యాయస్థానాల భవనాలపై ప్రభావం చూపాయి. ఉమ్మడి జిల్లాలో ఇటీవల జీవో నంబరు 350 కింద 42 సీడీ పనులు మంజూరయ్యాయి. రూ.40 కోట్లతో చేపట్టాల్సిన ఈ పనులు ఒక్కటీ ప్రారంభం కాలేదు.

# తేనె తోట.. ఉపాధి బాట

నందికొట్కూరు : ఆత్మకూరు, పాములపాడు, జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాల పరిధిల్లోని పంట పొలాల పక్కన ఎక్కువగా తేనెటీగల బాక్సులు కనిపిస్తాయి. గుంటూరు, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు చెందిన యువకులు వచ్చి, ఇక్కడ తేనె ఉత్పత్తి చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

ఏటా నవంబరు నుంచి జనవరి వరకు ఎక్కువగా తేనె బాక్సులు ఏర్పాటు చేస్తుంటారు. ఆ సమయంలో చుట్టుపక్కల పంటల్లోని పుష్పాల మకరందాన్ని తేనెటీగలు తీసుకొచ్చి బాక్సుల్లో ఉన్న ప్లేట్లకు తెట్టను ఏర్పాటు చేసుకొని సంతతితోపాటు తేనెను ఉత్పత్తి చేస్తాయి.

ఒక బాక్సు నుంచి ఐదు కిలోలు తేనెటీగల ఫారం పెట్టేవారు రూ.4,600 వెచ్చించి ఒక్కొక్క బాక్సు కొనుగోలు చేయాలి. గుంటూరు, హైదరాబాద్‌లలో ఉన్న ఉత్పత్తి కేంద్రాల నుంచి రెండు వేల ఈగలను రూ.2వేల చొప్పున కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మొదట 10 బాక్సులతో ఉత్పత్తి ప్రారంభిస్తారు. ప్రస్తుతం 50 నుంచి 150 వరకు బాక్సులు ఏర్పాటు చేస్తున్నారు. తేనెటీగలు మకరందాన్ని తీసుకువచ్చి తేనె తయారు కావడానికి నెల సమయం పడుతోంది. ఒక్కొక్క బాక్సు నుంచి ఐదు కిలోల తేనె ఉత్పత్తి అవుతుంది.

మూడు రకాల ఈగలు ఒక్కొక్క బాక్సులో తొమ్మిది వరకు ప్లేట్లు ఉంటాయి. ప్లేటుకు 2వేల చొప్పున ఒక్క బాక్సులో 18వేల వరకు ఈగలు ఉంటాయి. పోతు, రాణి, కూలి ఈగలు ఉంటాయి. కూలి ఈగలు మకరందాన్ని తీసుకువచ్చి తేనె ఉత్పత్తి చేస్తాయి. ఆడ, పోతు ఈగలు సంతానాన్ని ఉత్పత్తి చేస్తుంటాయి. ఈగలు అధికమైతే వాటిని ఇతర బాక్సుల్లోకి మార్చవచ్చు, కొత్తగా ఫారాలు నిర్వహించే వారికి విక్రయించవచ్చు. ఏటా బాక్సులు ఏర్పాటు చేస్తాను మణికంఠ, గుంటూరు మొదట భయంగా, కష్టంగా ఉన్నా.. కాలక్రమేన అలవాటు కావడంతో లాభాలు తీయవచ్చు. నేను గుంటూరు నుంచి ఇక్కడికి వచ్చాను. ఏటా రెండు నెలలు ఇక్కడ బాక్సులు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతాను. పంటలను బట్టి బాక్సుకు 5 నుంచి 8 కిలోల తేనె ఉత్పత్తి అవుతోంది. ఆసక్తి ఉంటే ఉచితంగా శిక్షణ ఇస్తా రమేష్, శిక్షకుడు యూపీ, ఎంపీ, రాజస్థాన్, గుజరాత్, తెలంగాణ, ఏపీ ప్రాంతాల్లో పంటల కాలాన్ని బట్టి బాక్సులు ఏర్పాటు చేస్తుంటాను.

# క్షీరపురి.. ఉద్యాన సిరి!

పాలకొల్లు : ఆధ్యాత్మిక, వాణిజ్య కేంద్రంగా వెలుగొందుతున్న క్షీరపురి ఉద్యాన శోభ సంతరించుకొంది. పట్టణంలో ఉద్యానాలు లేని లోటు ఎన్నో దశాబ్దాల తర్వాత నెరవేరుతోంది. రెండు పార్కులను ఒకే సమయంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దగా వచ్చే సంక్రాంతి నాటికి వీటిని ప్రారంభించేలా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. రూ.10 కోట్ల వ్యయం.. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో రెండు పార్కులను అభివృద్ధి చేశారు. ఆహ్లాదంతో పాటు పిల్లల ఆటపాటలకు, పెద్దలు వ్యాయామం చేసుకోవడానికి అనువుగా వీటిలో పరికరాలు ఏర్పాటు చేశారు. రెండు చోట్లా తేనీరు, ఇతర ఆరోగ్యకర ఆహారాలు



విక్రయించేందుకు దుకాణ సముదాయాలు నిర్మించారు.
పాలకొల్లు బస్టాండ్‌కు కూతవేటు దూరంలో ఉన్న రామగుండం పార్కు ఇది. అందమైన మొక్కలు, ఆకట్టుకొనే ఆకృతులతో ఆహ్లాదకర వాతావరణం అందించేలా దీనిని తీర్చిదిద్దారు. నేటి తరానికి మన సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసేలా పలు కళాకృతులను ఏర్పాటు చేశారు. రూ.లక్షల విలువ చేసే మొక్కలను కడియం నర్సరీలు, పూణె వంటి ప్రాంతాల నుంచి తీసుకొచ్చి పార్కుల్లో నాటించారు.

# ఇదీ అసలు లోగట్టు

ఆకివీడు : అనుకున్నది ఒక్కటి.. అయిందొక్కటి. ఆకివీడు నడిబొడ్డున అయిదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దొరగారి చెరువులో మట్టి తవ్వకం పనుల తీరు చూస్తే తెలుస్తోంది. పట్టణ జనాభాకు తగట్టు తాగునీరు సరఫరా చేయడానికి దీన్ని అభివృద్ధి చేయాలని భావించారు. ఈ పనులు అధికారులు చేపట్టకుండా.. ఒక ప్రైవేటు వ్యక్తికి అప్పగించారు. అతను చెరువులో సుమారు 15 అడుగుల లోతున మట్టిని తవ్వేసి ట్రాక్టర్లతో బయటకు తరలించేశారని స్థానిక నాయకులు ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకెళ్లారు. పనులు చూసిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేసి నిబంధనల మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు.
చెరువును లోతుగా తవ్వేయడంతో బలమైన గట్టు జారిపోతోంది. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు గట్టును ఆనుకుని కొత్తగా మరొకటి వేస్తున్నారు. ఇష్టానుసారంగా చేస్తున్న పనుల వల్ల గతేడాది



రూ.35 లక్షలతో పచ్చదనం.. సుందరీకరణ సంస్థ ఆధ్వర్యంలో చెరువు చుట్టూ అభివృద్ధి చేసిన వాకింగ్ ట్రాక్, సిమెంటు కట్టడాలు, ఇనుప మెస్ ధ్వంసం అయ్యాయి. ఇప్పటికే ఆక్రమణకు గురై కొంత చెరువు విస్తీర్ణం తగ్గిపోయింది. ఇప్పుడు గట్టు వెడల్పు, నీటి సామర్థ్యం కూడా తగ్గిపోనుంది.

**మరో మార్గం లేదు..**

– విజయ్, డీఈ, ప్రజారోగ్య, భీమవరం

చెరువును లోతు పెట్టేశారు. అందులో నీరు నింపితే పాత గట్టు జారిపోతుంది. లోతు 8 అడుగుల లోపే ఉండాలని సూచించాం. ఆ మేరకు పనులు పూర్తయితే విస్తీర్ణం రెండు ఎకరాలలోపే ఉంటుంది. ఆక్రమణల విషయం నగర పంచాయతీ అధికారులు చూడాలి.

# మోగనున్న చరవాణులు

అర్ధవీడు: చరవాణి సిగ్నల్ సమస్యకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లో సంపూర్ణంగా సెల్‌ఫోన్ నెట్‌వర్కును అందుబాటులోకి తేనుంది. ఇందుకోసం 38 మండలాల పరిధిలో కొత్తగా 54 సెల్ టవర్ల నిర్మాణం చేపట్టనుంది. డిజిటల్ భారత్ నిధి పథకంలో భాగంగా కేంద్రం ఈ ఖర్చును భరించనుండగా..స్థలాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. ఈ పథకం కింద ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌తో పాటు ప్రైవేటు సంస్థలు జియో, ఎయిర్‌టెల్ టవర్లను త్వరలో ఏర్పాటు చేయనున్నారు.



మారుమూల ప్రాంతాల్లో సిగ్నళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న పల్లెల్లో 4జీ నెట్‌వర్క్ కల్పించనున్నారు. సెల్‌ఫోన్ల సంఖ్య పెరగడంతో ఇప్పటికే ఉన్న టవర్ల సామర్థ్యం సరిపోవడం లేదు. అలాంటి ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో అటవీ ఏజెన్సీ ప్రాంతాలతో పాటు తరచూ సిగ్నల్ సమస్య ఎదురయ్యే మారుమూల పల్లెల్లోనూ టవర్లను నెలకొల్పుతున్నారు. గిద్దలూరు నియోజకవర్గంలోని అర్ధవీడు, బేస్తవారపేట లోయ, గిద్దలూరు మండలాలతో పాటు, యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పెద్దారవీడు, పెద్దదోర్నాల, పుల్లలచెరువు మండలాల్లోనూ టవర్ల సామర్థ్యం సరిపోక చరవాణులు పనిచేయవు. ఇక్కడి అటవీ ప్రాంతాల్లో ఉండే పల్లెల్లోనూ సిగ్నల్ సమస్య ఉంటుంది. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు స్థలాలు గుర్తించారు. వీటి నిర్మాణ పనుల సైతం ఆయా సంస్థలకు అప్పగించడంతో..కొత్త ఏడాదిలో పనులు వేగవంతం కానున్నాయి.

# సాకారానికి శ్రీకారం



ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావాసులకు ప్రయోజనం కలిగే పలు అభివృద్ధి ప్రాజెక్టులు 2025లో పట్టాలెక్కగా మరికొన్ని తుదిదశలో ఉన్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజానీకానికి మేలు చేసే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం, రెండు జిల్లాల యంత్రాంగం ఈ ఏడాది శ్రీకారం చుట్టింది. లక్ష్యం మేర జరిగేలా తీసుకున్న చర్యలతో ఇప్పటికే పలు పనులు పూర్తి కాగా మరికొన్ని త్వరలో కొలిక్కి రానున్నాయి. వీటిల్లో ప్రధానమైనవి. **నిర్వాసితులకు అండగా...**
పోలవరం నిర్వాసితులకు ఒక్క ఈ ఏడాదే రూ.1900 కోట్లు నష్టపరిహారం, ప్యాకేజీ సొమ్ములు విడుదల చేసి ప్రభుత్వం వారికి అండగా నిలిచింది. పునరావాస కాలనీల్లో పనులను వేగవంతం చేసింది. 79కి 49 కాలనీల్లో పనులు పురోగతిలో ఉన్నాయి. మిగిలిన కాలనీల్లో పనుల నిర్వహణకు ఈ ఏడాది నవంబరులో రూ.739 కోట్లతో టెండర్లు పిలిచారు. ప్రాజెక్టు పనులు ఈ ఏడాది వేగవంతమయ్యాయి. ఇప్పటికే 88 శాతానికి పైగా పూర్తి చేసి 2027 డిసెంబరు నాటికి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో రేయింబవళ్లు పనులు జరుగుతున్నాయి.

**తుది దశలో సర్వే**

దశాబ్దాల నాటి కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపటానికి ఈ ఏడాది జూన్‌లో సాధికార కమిటీ పర్యటించి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుంది. ఇప్పటికే సరిహద్దుల నిర్ధారణకు వీలుగా రెండు జిల్లాల పరిధిలో సర్వే చురుగ్గా సాగుతోంది. రెండు జిల్లాల పరిధిలో ఉప్పుటేరు చుట్టూ ఆక్రమణలు తిష్ట వేయగా వాటిని కొంతమేర తొలగించి కొల్లేరు నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి వెళ్లేలా కాలువల ఆధునికీకరణ పనులు చేశారు.

**అడ్డుతొలగిన ఆటంకాలు**ఖమ్మం–దేవరపల్లి, జీలుగుమిల్లి–పోలవరం, కైకలూరు–ఆకివీడు–భీమవరం మధ్య జాతీయ రహదారుల నిర్మాణాలకు అడ్డంకిగా ఉన్న కోర్టు కేసులను యంత్రాంగం పరిష్కరించి పనులను వేగవంతం చేశాయి. తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వరకు రహదారి విస్తరణకు రూ.99 కోట్లు మంజూరయ్యాయి.

**ఇన్నాళ్లకు దారిన పడింది** గుంతల రోడ్ల పునరుద్ధరణ, నూతన రహదారుల కోసం ఒక్క ఆర్అం డ్‌బీ ఆధ్వర్యంలో ఈ ఏడాది రూ.250 కోట్లు వెచ్చించారు. సంక్రాంతి కల్లా మరికొన్ని రహదారులకు మరమ్మతులు చేయాలని ఏలూరు జిల్లాకు రూ.23.10 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాకు రూ.32.33 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో వెయ్యి కి.మీ పరిధిలో గుంతలు పూడ్చారు.

# అలా మారాయి!



కందుకూరు : 2022లో జరిగిన జిల్లాల పునర్విభజనలో ప్రకాశం జిల్లా 14,322 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లాగా నిలిచింది. తాజాగా కూటమి ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజనలో ఆరు నియోజకవర్గాలతో ప్రకాశం జిల్లా, మరో నాలుగు నియోజకవర్గాలతో మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఆవిర్భవించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం తుది నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుత ప్రకాశం జిల్లాలో 39 మండలాలుండగా తాజాగా 28 మండలాలకు పరిమితం కానుంది. రెవెన్యూ డివిజన్ల వారీగా ఒంగోలు- 11, కందుకూరు-7తోపాటు కొత్తగా ఏర్పాటైన అద్దంకి–10 మండలాలు ఉండనున్నాయి. కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలు తిరిగి ప్రకాశంలోకి రానున్నాయి.

**1970లో ఒంగోలు... 1972లో ప్రకాశం**

గుంటూరు జిల్లాలోని ఒంగోలు, అద్దంకి, చీరాల, నెల్లూరు జిల్లాలోని కందుకూరు, కనిగిరి, దర్శి, పొదిలి, కర్నూలు జిల్లాలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు తాలుకాలతో 1970 ఫిబ్రవరి 2వ తేదీన ఒంగోలు జిల్లాగా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1972లో జిల్లాకు టంగుటూరి ప్రకాశం పంతులు పేరుతో ప్రకాశం జిల్లాగా నామ కరణం చేశారు. జిల్లా ఏర్పడిన తొలి రోజుల్లో 4 లక్షల కుటుంబాలుండగా, 19,19,995 మంది జనాభా ఉన్నారు. 2011 జనాభా గణన ప్రకారం జిల్లాలో 8,60,463 కుటుంబాలుండగా, 33,97,448 మంది జనాభా ఉన్నారు. 2021లో మరో విడత జన గణన జరగాల్సి ఉండగా కొవిడ్ దృష్ట్యా వాయిదా పడింది.

**రామాయపట్నం ఓడరేవుతో...**

కందుకూరు నియోజకవర్గం కలయికతో జిల్లాలోకి పరిశ్రమలు రానున్నాయి. గుడ్లూరు మండలం రామాయపట్నం ఓడరేవు సుమారు రూ.3,500 కోట్లతో నిర్మాణమవుతోంది. ఇప్పటికే ఓడరేవు మొదటి బెర్తు పూర్తికాగా, మరో మూడు బెర్తులు నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. దీంతోపాటు సుమారు రూ.లక్ష కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బీపీసీఎల్ పరిశ్రమ కూడా రానుంది. చేవూరు వద్ద సౌరఫలకల పరిశ్రమ (ఇండోసోల్) ఉత్పత్తిని ప్రారంభించింది. ఇవి పూర్తయితే 30 వేల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం 5 మండలాల పరిధిలో 50 కిలోమీటర్ల మేర విశాలమైన సముద్ర తీరం ఉంది. కొత్తపట్నం, సింగరాయ కొండ మండలం పాకల బీచ్‌లు ఉన్నాయి. కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు, గుడ్లూరు మండలాల పరిధిలోని తీర ప్రాంతాల కలయికతో మరో 12 కిలోమీటర్ల విస్తీర్ణం పెరగనుంది. రాళ్లపాడు రిజర్వాయర్, మోపాడు, పీబీ ఆయకట్టు, వీఆర్ కోట తదితర మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల కింద 44,257 ఎకరాల సాగు చేస్తున్నారు. రాళ్లపాడు రిజర్వాయర్, వీఆర్ కోట సప్లయ్ ఛానల్ ఆయకట్టు తిరిగి ప్రకాశం జిల్లాలోకి రానుంది.

# మార్కాపురం సాకారం

ఒంగోలు : ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మార్కాపురం జిల్లా ఎట్టకేలకు ఆవిష్కృతమైంది. బుధవారం నుంచే కొత్త పాలనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో కొత్త ఏడాది సంబరాలు పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో ముందే ప్రారంభమైనట్లయింది. తమ కల నెరవేరినందుకు చాలా ఆనందంగా ఉందని ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు. కొత్త జిల్లా పాలన జనవరి 1వ తేదీ నుంచి అందుబాటులోకి తీసుకురావాలని భావించగా, ఒక రోజు ముందే పాలన ప్రారంభించేవిధంగా మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి అనుబంధంగా మార్కాపురం శివారు తర్లుపాడు రోడ్డులోని పునరావాస కాలనీలో కలెక్టరేట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. వెలిగొండ ముంపు బాధితుల కోసం ఇక్కడ పునరావాస కాలనీని నిర్మించారు. ఇక్కడ ప్రాంగణంలో మూడు భవనాలుండగా, 24 వరకు గదులు అందుబాటులో ఉన్నాయి. కలెక్టర్‌తో పాటు సంయుక్త కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, సర్వే, పౌరసరఫరాలు, సీపీవో, పౌరసంబంధాల తదితరాలు తప్పనిసరి ఏర్పాటు చేయాల్సి ఉన్నందున, ఇక్కడ సరిపోతుందని భావిస్తున్నారు. మిగిలిన జిల్లా కార్యాలయాలకు సంబంధించి ఆయా డివిజన్ అధికారులకు వెతుకులాడే బాధ్యతను కలెక్టర్ ఇప్పటికే నిర్వహించిన సమీక్షలో అప్పగించారు. ఇప్పుడున్న డివిజన్ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలా.. లేక ప్రైవేటు భవనాలు అద్దెకు తీసుకోవాలనేది నిర్ణయించనున్నారు. ప్రస్తుతం మార్కాపురం జిల్లా కేంద్రంగా పరిపాలన ప్రారంభమవుతుందని తెలియడంతో రాజకీయ పార్టీల నేతలు, వివిధ సంఘాలకు చెందినవారు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు.

**ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎవరు?**

ప్రస్తుతం ప్రకాశం కలెక్టర్ రాజాబాబు మార్కాపురానికి వచ్చి కొత్త



జిల్లా పాలనకు శ్రీకారం చుట్టే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఒంగోలు నుంచి వివిధ శాఖలకు చెందిన పలువురు అధికారులు కూడా హాజరుకానున్నారు. కొత్త జిల్లా కలెక్టర్ ఎవరనేది స్పష్టత రాలేదు. ఇప్పుడున్న కలెక్టర్ రాజాబాబు ఇన్‌ఛార్జిగా ఆయనే కొనసాగుతారా.. లేక కొత్తవారు ఎవరైనా నియమితులవుతారనేది తేలలేదు. మరోవైపు ప్రకాశం సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా నియమించినట్లు ప్రచారం నడుస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పునరావాస కాలనీలో కలెక్టరేట్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మార్కాపురం ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి పేర్కొన్నారు.

**మళ్లీ పాత ప్రకాశం**అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలు నాడు ప్రకాశం జిల్లాలో ఉండగా, జిల్లాల పునర్వభజనలో దూరమయ్యాయి. ప్రస్తుతం తిరిగి కలపడంతో పాత ప్రకాశం జిల్లాకు ఊపిరిపోసినట్లయిందని ఇక్కడివారు చెబుతున్నారు. తాము ప్రతి పనికి ఒంగోలు వైపు చూసేవారిమని, కొన్నాళ్లు దూరం కాగా, ఇప్పుడు మళ్లీ తమకు అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. పాలనా సౌలభ్యంలో భాగంగా అద్దంకి, కందుకూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు బుధవారమే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు.

# అన్నీ శుభ శకునాలే!

ఒంగోలు: కాలచక్రంలో ఒక ఏడాది ముగియనుంది. నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. కొత్త ఏడాది తమకు కలిసి రావాలని, అంతా మంచే జరగాలని ప్రార్థిస్తున్నారు. మరోవైపు కీలకమైన ప్రాజెక్టులు చివరి దశకు చేరుకుని ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. లక్షలాది మందికి మేలు జరగనుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

**రైలు కూత షురూ**

వెనుకబడిన పశ్చిమ ప్రకాశం ప్రాంతాన్ని బయట ప్రాంతాలతో అనుసంధానం చేసే నడికూడి–శ్రీకాళహస్తి రైల్వేలైను జిల్లా పరిధిలో చాలా వరకు పూర్తయింది. త్వరలో పామూరు వరకు రైలు మార్గం పూర్తికానుండడంతో ఇక్కడి వరకు రైలు పరుగులు పెట్టిస్తామని అధికారులు ఇటీవల పరిశీలనకు వచ్చినప్పుడు పేర్కొన్నారు. మరోవైపు బెంగళూరు–విజయవాడ జాతీయ రహదారి నిర్మాణ పనులు జిల్లాలో చాలా వరకు పూర్తయ్యాయి. కొత్త ఏడాదిలో వాహనాలు పరుగులు తీయనున్నాయి.

**కృష్ణమ్మ పరుగులు**

ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న మార్కాపురం ప్రాంత వాసులకు వెలిగొండ ప్రాజెక్టు గొప్ప వరమే. దశాబ్దాలుగా ఎదురుచూపులు చూస్తున్న ఇక్కడ ప్రజలకు తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టు నూతన సంవత్సరంలో పూర్తికానుండటంతో సర్వత్రా ఆనందం వ్యక్తమవుతోంది.

**పంటలకు జలం**



నాగార్జునసాగర్ జలాశయం పూర్తిగా నీటితో నిండి ఉండడం, మొంథా తుపాను నేపథ్యంలో కురిసిన వర్షాలకు జిల్లాలో నూరు శాతం చెరువులు నిండటంతో జలకళ సంతరించుకుంది. సాగర్ నుంచి జిల్లాకు 57 టీఎంసీలు నీరు కేటాయించగా, ఇప్పటి వరకు 34 టీఎంసీలు విడుదల చేశారు. మరో 23 టీఎంసీల జలాలు రానున్న కాలంలో పంటలకు విడుదల చేయనున్నారు.

**కొత్త కొలువులు**

పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవి కాలం త్వరలో ముగియనుండడంతో కొత్త ఏడాదిలో ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక పాలనలో కీలకమైన పల్లె, పట్టణ పీఠాలకు పోటీ రసవత్తరంగా సాగుతుంది. స్థానిక సంస్థలు కొత్తగా కొలువుదీరనుండడంతో మొత్తం మీద పల్లెల్లో పండగ వాతావరణం నెలకొంది.

**ప్రగతి పరుగులు**


15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చే మార్చి నెలలోగా ఖర్చు చేయాల్సి రావడంతో అన్నిచోట్లా పనులు ఊపందుకున్నాయి. మండల పరిషత్తు పాలకవర్గాల్లో రాజకీయ ఆధిపత్య పోరు ఉన్న చోట తప్ప తమ ఊరి బాగుకు మేలు చేయాలనే సంకల్పంతో అభివృద్ధి పనులు చేపట్టారు. మరోవైపు ఒంగోలు నగరంలో రహదారులు, కాలువల నిర్మాణం, ముఖ్యమైన కూడళ్ల సుందరీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

# వ్యసనం.. వదిలిస్తున్నారు!

కాకినాడ : పిఠాపురం మండలానికి చెందిన 19 ఏళ్ల యువకుడు కాకినాడలో డిగ్రీ మొదటి ఏడాది చదువుతున్నాడు. ఆకతాయిలతో తిరిగి ఏడాదిన్నర నుంచి మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు అతడిని జీజీహెచ్‌లోని డీఅడిక్షన్ ఓపీకి తీసుకొచ్చారు. యువకునికి ఇక్కడి వైద్యులు చికిత్స అందించి, కౌన్సెలింగ్ చేసి పంపారు.తాళ్లరేవు మండలానికి చెందిన 18 ఏళ్ల యువకుడు ఇంటర్ చదివి మానేశాడు. తర్వాత గంజాయికి బానిసయ్యాడు. తల్లిదండ్రులనూ లెక్క చేయడం లేదు. దాంతో వారు గత అక్టోబర్‌లో జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. ఇక్కడ ప్రత్యేక చికిత్స అందించి, మందులు ఇచ్చారు. ప్రస్తుత చాలామంది సరదాగా అంటూ సిగరెట్ తాగడం మొదలుపెడుతున్నారు. ఆ తర్వాత గుట్కా, మందు అలవాటు అవుతున్నాయి. ఆ వ్యసనం అక్కడితో ఆగకుండా గంజాయి వరకూ వెళుతోంది. ప్రధానంగా యువత వీటి బారినపడి తమ బంగారు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. కళాశాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని కొందరు గంజాయి విక్రయాలు చేస్తున్నారు. ఒక్కసారి వీటి బారిన పడితే భవిష్యత్తు ఉండదని అధికారులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**జీజీహెచ్‌లో ప్రత్యేక చికిత్స..**

వ్యసనపరుల్లో మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం 2020 మేలో వ్యసన విముక్తి కేంద్రం(డి–అడిక్షన్) సెంటర్‌ను ఏర్పాటు చేసింది. గత ఆరేళ్లుగా ఓపీ, ఐపీ సేవలు అందిస్తున్నారు. కొందరు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. మరికొంతమంది భయంతో, అందరికీ



తెలిసిపోతుందనే కారణంతో రావడం లేదు. ప్రస్తుతం ఇక్కడ ఒక వైద్యుడు, ఇద్దరు నర్సులు, ఇద్దరు కౌన్సిలర్లు అందుబాటులో ఉన్నారు. వ్యసనవిముక్తి కేంద్రాన్ని వినియోగించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

**పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలి..**

పిల్లల ప్రవర్తనలో మార్పు ఉంటే తల్లిదండ్రులు గమనించాలి. విపరీతమైన కోపం, కళ్లు ఎర్రబడటం, సరైన సమయానికి తిండి, నిద్ర లేకపోవడం, తనలో తాను మాట్లాడుకోవడం, భ్రమలు వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలి. కొంతమందికి కౌన్సెలింగ్, మరికొంతమందికి మందులతో ఇక్కడ చికిత్స అందిస్తున్నారు.
డాక్టర్ వి.వరప్రసాద్, మానసిక వైద్యనిపుణుడు, జీజీహెచ్

## అడగాలా.. మళ్లీ మళ్లీ రావాలా

భీమవరం : అర్జీల పరిష్కారంపై కలెక్టర్, జేసీ తరచు సమావేశాలు నిర్వహించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నారు. అయినా.. క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు.. ఉద్యోగులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు ఎంత చెబుతున్నా పూర్తిస్థాయిలో ఫలితాలు రావడం లేదు.

ఆరో స్థానం.. ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో అర్జీల పరిష్కారంలో జిల్లా ఆరో స్థానంలో ఉంది. ఇటీవల జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సదస్సులో జిల్లాల వారీగా గణాంకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్,



జేసీ పరిస్థితిని చక్కదిద్దే చర్యలు చేపట్టారు.

ఈ ఏడాది మార్చి 1 నుంచి నవంబరు 30 వరకు జిల్లాలో 17,753 అర్జీలు పరిష్కరించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 4061 పెండింగ్‌లో ఉండిపోయాయి. రెవెన్యూ శాఖలో ఎక్కువ ఉన్నట్లు కలెక్టర్ గుర్తించి పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు.

మా ప్రాంతంలో రోడ్డు, డ్రెయిన్ ఆక్రమణలపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికే అనేక సార్లు ఫిర్యాదు చేశా. 15న జరిగిన పీజీఆర్ఎస్‌లోనూ మరోమారు అర్జీ ఇచ్చా.

వెంకటబాలాజీ, పెదఅమిరం

మా గ్రామంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. దీని గురించి చాలా కాలంగా స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. తాజాగా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశా. అదే సమయంలో కలుషిత నీరు తాగి గ్రామస్థులు అనారోగ్యం పాలవుతున్నారు.

వి.నాగరాజు, తోకతిప్ప

## చూపిస్తారు బొమ్మ

భీమవరం : ప్రతి పండగను, సందర్భాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్న సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం 'నూతన సంవత్సర శుభాకాంక్షల' పేరుతో ఉన్నదంతా దోచుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వారి చేతికి చిక్కి ఖాతాలు ఖాళీ చేసుకోవడమే కాదు, ఫోన్లలో ఉన్న వ్యక్తిగత సమాచారం అంతా పోగొట్టుకోవాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

డిసెంబరు 31 అర్ధరాత్రి నుంచే ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకోవడం సహజం. ఈ క్రమంలో సాధారణంగా కాకుండా రకరకాల చిత్రాలు, సందేశాలను మీ పేరుతో సహా తయారు చేసుకుని పంపొచ్చని, ఇందుకోసం ఈ కింది లింకుపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేస్తే చాలని సెల్‌ఫోన్లకు సందేశాలు వస్తున్నాయి. పొరపాటున వాటిని క్లిక్ చేశారంటే తిప్పలు తప్పవు. హ్యాపీ న్యూఇయర్ అంటూ వచ్చే



ఫేక్ మెసేజ్‌లలో డాట ఏపీకే పదం కనిపిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయవద్దని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కొత్త నంబర్లతో వచ్చిన ఫొటోలను, వీడియోలను తెరవొవద్దని చెబుతున్నారు. అందులోని బైనరీ కోడ్ ఆధారంగా మాల్‌వేర్ ప్రవేశిస్తుంది. దాంతో బ్యాంకు ఖాతా మొదలుకొని వ్యక్తిగత సమాచారం వరకు హ్యాక్ చేసే కొత్త ట్రిక్కులతో సైబర్ నేరగాళ్లు ముందుకు రాబోతున్నట్లు పోలీసులు హెచ్చరిస్తున్నారు. నూతన సంవత్సరాన్ని చేదు జ్ఞాపకాలతో ప్రారంభించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. నూతన ఏడాదిలో సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు.

## పాఠశాలకు ఒక అధికారి..!

సోంపేట : పదో తరగతిలో శత శాతం ఫలితాలు సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే 100 రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని రోజూ పర్యవేక్షించేలా ప్రత్యేకాధికారులను నియమించి బాధ్యతలు అప్పగించింది. బోధన, సాధన, పరీక్షలు, ఇతర అంశాలను పరిశీలించి మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోనున్నారు.

**రోజూ తనిఖీలు**

జిల్లాలో 414 ఉన్నత పాఠశాలల్లో 21,343 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

తహసీల్దారు, ఎంపీడీవో, ఎంఈవో, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణం, వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యాన, ఇతర శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు, మండల ప్రత్యేకాధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తూ పాఠశాలలను కేటాయించారు. హెచ్ఎం, ఎంఈవో, డిప్యూటీ డీఈవో, డీఈవో, సమగ్ర శిక్షా అధికారులను సమన్వయం చేసుకుంటూ 100 రోజుల ప్రణాళిక మెరుగ్గా నిర్వహించేలా చర్యలు తీసుకుంటారు.

ప్రధానంగా రోజూ నిర్వహించే పరీక్షల్లో విద్యార్థులు సాధిస్తున్న మార్కులు ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయించడం, సబ్జెక్టు వారీగా సామర్థ్యాలను అంచనా వేయడం, ఇతర అంశాలు పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షించాలి.

రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, ఇతర అంశాలను పరిశీలిస్తారు. పరీక్షల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత ఉపాధ్యాయులతో చర్చిస్తారు.

ఎక్కువ రోజులు పాఠశాలకు గైర్హాజరయ్యే విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు తీసుకున్న చర్యలు పరిశీలించి తల్లిదండ్రులతో మాట్లాడతారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా పర్యవేక్షించడానికి, సమస్యల పరిష్కారానికి మండల స్థాయి అధికారులను నియమించినట్లు డీఈవో ఎ.రవిబాబు తెలిపారు.

# అల్లుకున్న అవినీతి తీగలు



నంద్యాల : ఇళ్లు కాదు ఊళ్లు నిర్మిస్తున్నట్లు గత వైకాపా సర్కారులో ఆర్భాటం చేశారు. గుట్టలు.. కొండలు.. బంజరు పొలాల్లో కాలనీలు నిర్మించారు.. అక్కడ ఒక్క లబ్ధిదారుడు కూడా ఇల్లు నిర్మించకున్నా విద్యుత్తు సౌకర్యం పేరుతో రూ.కోట్లు వెచ్చించారు. ఓ గుత్తేదారు సంస్థకు లబ్ధి చేకూర్చే క్రమంలో 'వెలుగుల'మాటున అక్రమాలకు పాల్పడ్డారు. చేసిన పనులు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. విలువైన సామగ్రిపై కన్నేసిన దొంగలు ఎక్కడికక్కడ ఎత్తుకెళ్తున్నారు.

గడివేముల: గడివేములలో 450 మందికి ఇళ్లపట్టాలిచ్చారు. ఇప్పటి వరకు కేవలం 10 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. కొందరు పునాదుల వరకు నిర్మించి వదిలేశారు. ఈ కాలనీలో విద్యుత్తు సౌకర్యం కోసం రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు.

**కన్నేసిన దొంగలు**

బండిఆత్మకూరులోని కాలనీలో ఇళ్ల నిర్మాణానికి కనీసం బేస్‌మెంట్లు పడకున్నా.. విద్యుత్తు, నియంత్రికలు, స్తంభాలు, తీగలు, ఇతర పరికరాలు ఏర్పాటు చేశారు. మూడేళ్ల కిందట రూ.12 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇక్కడ కంపచెట్లు తప్ప ఏమీ లేవు. ప్రస్తుతం కేవలం నాలుగు గృహాలు మాత్రమే ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలోని పలు జగనన్న కాలనీల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు, పరికరాలు, వస్తువులు చోరీకి గురయ్యాయి. కాలనీల్లో నిర్మాణాలు జరగకపోవడంతో చాలాచోట్ల విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వలేదు. ఇదే అదనుగా దొంగలు వీటిని అపహరించారు.

**ఇలా వినియోగిస్తే బాగు**


ఉమ్మడి జిల్లాలో గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యం కల్పించేందుకు రూ.1,200 కోట్లతో ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద పనులు చేపట్టారు. గుత్తేదారు సంస్థ నిర్వాకంతో ఇవి ఆగిపోయాయి. పనుల్లో భాగంగా త్రీఫేజ్ విద్యుత్తు నియంత్రికలు అవసరమవుతాయి. ప్రస్తుతం జగనన్న కాలనీల్లో వృథాగా ఉన్న నియంత్రికలను ఆర్‌డీఎస్ఎస్‌కు వినియోగిస్తే ఎలా ఉంటుందన్న చర్చ.. ఆరు నెలల కిందట జరిగింది.

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వివిధ సెక్షన్ల పరిధిలో నూతన సర్వీసులు, ఇప్పటికే ఉన్నవాటిపై అదనపు లోడు కోసం దరఖాస్తులు వచ్చాయి. వీటి గడువు డిసెంబరు 31వ తేదీ నాటికి ముగియనుంది. ఇప్పటికీ ఏ నిర్ణయం తీసుకోలేదు.

**రూ.450 కోట్ల వరకు ఖర్చు**


ఉమ్మడి జిల్లాలోని జగనన్న కాలనీల్లో గత ప్రభుత్వ హయాంలో విద్యుదీకరణ పేరుతో రూ.450 కోట్లకు పైగా ఖర్చు చేశారు. లబ్ధిదారులు పునాదులు కూడా నిర్మించుకోలేదు. ఉమ్మడి జిల్లాలో 716 కాలనీలకు సంబంధించి 10,125 విద్యుత్తు సర్వీసులు ఇచ్చేశారు. నంద్యాలలో 9432 ఇళ్లకు 3,615, కర్నూలులో 19,121 గృహాలకు 9,104 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఒక్కో కాలనీలో 100 కేవీ నియంత్రికలు ఐదు వరకు అమర్చారు. ఒక్కోదానికి రూ.4 లక్షల వరకు ఖర్చు చేశారు. తీగలకు ప్రతి కి.మీ. సుమారు రూ.80 వేల వరకు ఖర్చు పెట్టారు. ఒక్కో స్తంభానికి రూ.4 వేలు వెచ్చించారు. నియంత్రికలు, ఇతర సామగ్రి తదితరాలన్నీ కలిపి ప్రతి కి.మీ.కు సరాసరిన రూ.2.50 లక్షలు ఖర్చవుతుంది. ఇంత చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికే కొన్నిచోట్ల విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. నియంత్రికలు అలంకారప్రాయంగా మారాయి.

# పగలూ చలేస్తోంది



అనకాపల్లి : ఈ ఏడాది జిల్లాలో చలితీవ్రత పెరిగింది. మైదాన ప్రాంతాల్లోనూ మన్యాన్ని తలపించే విధంగా చలిగాలులు వీస్తున్నాయి. ఉదయం 10 దాటినా చలి తీవ్రత తగ్గడంలేదు. సాయంకాలం 5 గంటల నుంచి మంచు కమ్మేస్తోంది. దీంతో వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారు. సాధారణం కంటే ఉష్ణోగ్రతలు రెండు, మూడు సెల్సియస్ డిగ్రీలు తక్కువగా ఉన్నట్లు వ్యవసాయ వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణంగా చలికాలంలో పగటి అత్యధిక ఉష్ణోగ్రతలు 32 డిగ్రీల వరకు ఉంటాయి. ఈసారి 30లోపే ఉన్నాయి. చలితీవ్రత ఎక్కువగా ఉండటానికి అనేక కారణాలు ఉన్నా ముఖ్యంగా వర్షాలు అధికంగా కురవడం, ఉత్తర భారతదేశం నుంచి చల్లటి పవనాలు వీయడం వలనే ఉష్ణోగ్రతలు తగ్గాయని వాతావరణ శాస్త్రవేత్త గౌరి తెలిపారు. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. చలి పెరగడం వల్ల ముఖ్యంగా కూరగాయలు, జీడి, మామిడి పంటలకు ఎక్కువగా నష్టం వచ్చే అవకాశాలు ఉన్నాయని ఉద్యాన శాఖ అధికారి రహీం తెలిపారు. ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల పూత రావడం ఆలస్యం అవుతుందని తెలిపారు. పూత, లేత చిగురు ఆకు మాడిపోతాయని, ముదురు ఆకులు గిడసబారతాయని తెలిపారు. దీనివల్ల దిగుబడులు 15 నుంచి 20 శాతం తగ్గే అవకాశం ఉందన్నారు. జిల్లాలో జూన్ నుంచి డిసెంబరు వరకు సాధారణ వర్షపాతం 1,004 మిల్లీలీటర్లు కాగా ఈ ఏడాది 1,126 కురిసింది. మొత్తం 89 రోజులు వర్షం పడింది. గత ఏడాది 1,070 మిల్లీమీటర్లు కురిసింది. ఈఏడాది తుపానులు ఎక్కువగానే వచ్చాయి. వర్షాలు అధికంగా కురవడంతో భూగర్భ జలాలు బాగున్నాయి. దీంతో తేమ వాతావరణం ఏర్పడటంతో చలి ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గాలిలో తేమ శాతం ఎక్కువగానే ఉంటుంది. శాతం కాగా అత్యల్పం 47 శాతంగా ఉంది.

# అక్షరమే ఆయుధమై.. అభివృద్ధికి ఆయువై..



భీమవరం : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సామాన్యుడి పక్షాన నిలుస్తూ కలం కదిలించింది. నిత్య జీవితంలో ఎదుర్కొనే ఇబ్బందులను పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటికి మోక్షం కల్పించింది. బాధితులే నేరుగా అధికారులకు ఫోన్ చేసి సమస్యలు చెప్పుకొనేలా ఫోన్‌ఇన్ కార్యక్రమాలు, కాలనీల్లోని బాధలను స్వయంగా పరిశీలించి పర్యవేక్షించేలా వాక్‌విత్ కమిషనర్.. మేమున్నాం.. మీకు తోడు ద్వారా వారధిగా నిలిచింది.

**తలుపులొచ్చాయి**

యలమంచిలి మండలం వడ్డిలంకలో నక్కల డ్రెయిన్‌పై అవుట్‌ఫాల్ స్లూయిజ్ తలుపులు 20 ఏళ్లుగా పనిచేయక ఏటా వరదల సమయంలో 25 వేల ఎకరాలు నీట మునిగి అన్నదాతలు తీవ్రంగా నష్టపోయేవారు. దీనిపై వరుస కథనాలు రాగా మంత్రి నిమ్మల రామానాయుడు స్పందించి రూ.45 లక్షలతో కొత్త తలుపులు ఏర్పాటు చేయించారు

వీధులకు వెలుగులు.. తణుకు పురపాలక సంఘం పరిధిలో ప్రధాన దారులు, పట్టణ వీధులు, కాలనీల్లో దీపాలు వెలగక పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. దీనిపై వరుస కథనాలు ఇవ్వగా 225 వీధి దీపాలు కొత్తవి ఏర్పాటు చేశారు.

జలాశయం పనులు మొదలు: తాడేపల్లిగూడెంలోని కుంచనపల్లిలో రెండో వేసవి జలాశయం రెండు దశాబ్దాలుగా కొలిక్కి రాలేదు. ఇది పూర్తయితే 26 ప్రాంతాలకు నీరు అందుతుంది. సమస్యను ఎమ్మెల్యే బొలిశెట్టి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వరుస కథనాలు ఇవ్వగా ఆయన చొరవతో అమృత్ 2.0లో 54.93 ఎకరాలలో రూ.73.43 కోట్లతో చెరువు పని మొదలైంది.

రహదారులకు మోక్షం.. పర్యాటకులకు ఉపయోగపడే ముత్యాలపల్లి–పేరుపాలెం రహదారి నిర్మాణం రెండేళ్లుగా ఆగింది. దీనిపై కథనాలివ్వగా రూ.28 కోట్లతో పనులు పూర్తి చేశారు. చించినాడ – లోసరి రహదారికి రూ.20 లక్షలతో మరమ్మతులు, వీధి దీపాలు ఏర్పాటు చేశారు. భీమవరంలో గుంతల రహదారుల సమస్యను ఎమ్మెల్యే పులపర్తి దృష్టికి తీసుకెళ్లగా మున్సిపాలిటీ నిధులు మంజూరు చేశారు. శ్రీరామపురం (జువ్వలపాలెం రోడ్డు నుంచి బలుసుమూడి వరకు), లోసరి–గుట్లపాడు మార్గాలను రూ.2.70 కోట్లతో సీసీ రోడ్లుగా మార్చారు. రూ.9.89 లక్షల ఆదాయం.. మొగల్లులో దేవస్థానం భూములు 16.75 ఎకరాలు ముంపు కారణంగా పదేళ్లుగా సాగుకు దూరమయ్యాయి. చేపల చెరువులుగా మార్చేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపినా ఆమోదం రాలేదు. ఉపసభాపతి రఘురామ దేవదాయ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి వేలం నిర్వహించడంతో రూ.9.89 లక్షల ఆదాయం సమకూరింది.

## భల్లోకగిరి.. అక్రమార్కులకు సిరి

మందస : మందస మండలం పిడిమందస రెవెన్యూ పరిధిలోని 100 ఎకరాల భల్లోకగిరి కొండపై అక్రమార్కుల కన్ను పడింది. కొన్ని నెలల నుంచి కొండకు తూర్పు, దక్షిణ భాగాల్లో నల్లరాయి క్వారీల్లో అనుమతికి మించి రాళ్లు పేల్చి క్రషర్లకు తరలిస్తున్నారు. పశ్చిమ, ఉత్తర భాగాల్లో ఉన్న కంకర నిల్వలను ఎలాంటి అనుమతులు లేకుండా కొల్లగొడుతున్నారు. రాత్రి వేళ టిప్పర్లలో తరలిస్తున్నారు.

**రాత్రి వేళ తరలింపు..:** బహాడపల్లి సమీపంలో ప్రైవేటు వెంచరుకు ఇటీవల వందల టిప్పర్ల కంకర తరలించారు. పలాస, సోంపేట మండలాల్లో ప్రైవేటు అభివృద్ధి పనులకు రవాణా చేస్తున్నారు. వారం రోజుల నుంచి రాత్రివేళ తరలిస్తున్నారని తెలిసి గ్రామస్థులు ఇటీవల



అడ్డుకుని అక్రమార్కులతో వాగ్వాదానికి దిగారు. దీంతో మధ్యలో ఒక రోజు రాత్రి ఆపి మళ్లీ కొనసాగిస్తున్నారు.

**వారే అని తెలిసినా..:** వైకాపా మండలస్థాయి నాయకుల కనుసన్నల్లోనే అక్రమ దందా జరుగుతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులైనా అడ్డుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 'పిడిమందస దరి కొండలో అక్రమంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదు వస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అక్రమార్కులపై కేసులు పెట్టి వాహనాలను సీజ్ చేస్తామని' గనులశాఖ టెక్కలి ఏడీ విజయలక్ష్మి తెలిపారు.

## ప్రయోగం.. ఓ బ్రహ్మ పదార్థం

ఓబులవారిపల్లె : విద్యార్థుల భవిష్యత్తును మలుపు తిప్పేది ఇంటర్ విద్యే. భవిష్యత్తు లక్ష్య సాధనకు బాటలు పడేది ఇక్కడే. అందుకే ఎక్కువ మార్కులు సాధించేందుకు విద్యార్థులు కష్టపడుతుంటారు. చాలా కళాశాలల్లో ప్రయోగ పరీక్షలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. కొన్ని ప్రభుత్వ, కస్తూర్బా విద్యాలయాల్లో ప్రయోగశాలలే లేవు. ఈ కారణంతో థియరీలో మంచి మార్కులు తెచ్చుకున్నా ప్రయోగాల్లో వెనుకబడుతున్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఒకేషనల్, ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు జనరల్(ఎంపీసీ, బైపీసీ) విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులు కలవర పరుస్తున్నాయి.




కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో చదువుతున్న బైపీసీ, ఎంపీసీ, ఒకేషనల్ విద్యార్థినులకు పూర్తి స్థాయిలో ప్రయోగశాలలు లేవు. వీరు ప్రయోగాలు చేసేందుకు సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రభావం ఇంటర్ ఫలితాలతో పాటు ప్రవేశాల పైనా పడుతోందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ప్రభుత్వ, ఆదర్శ, కేజీబీవీ, రెసిడెన్షియల్, ప్రైవేట్ కళాశాలలోని 67 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు.

బైపీసీ, ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,173 మంది హాజరు కానున్నారు. ఒకేషనల్ మొదటి, రెండో ఏడాది కలిసి 1,354 మంది చదువుతున్నారు.

## అక్రమాల తాకిడికి... ఆదాయం గాలికి

అమరావతి: అవసరమైన వనరులు పుష్కలంగా ఉన్నాయి... ఆదాయం ఆర్జించే అవకాశాలున్నాయి.. అయినా గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో అక్రమార్కులు కొత్తదారులు ఎంచుకుంటున్నారు. దీనికో ఉదాహరణ ప్రదర్శనల బోర్డుల ఏర్పాటులో మాయాజాలం. అధికారిక లెక్కల ప్రకారం 42 ప్రకటనల ఏజెన్సీలున్నాయి. అనధికా రికంగా రెట్టింపు ఉన్నాయి. సుమారు 1,400 డిస్‌ప్లే బోర్డులు ఉన్నట్టు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అంతకుమించి ఉన్న విషయం బహిరంగ రహస్యమే. నగరంలో డిస్‌ప్లే.. గ్యాంట్రీ.. ఇలా ఏ తరహా బోర్డులు ఏర్పాటు చేయాలన్నా జీఎంసీ అనుమతి తప్పనిసరి. ఇందుకు నిర్ణీత రుసుం చెల్లించాలి. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఇదీ సమస్య.. ఒకదానికి అనుమతి పొంది ఆ పేరుతో రెండుమూడు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. కొందరైతే అసలేమాత్రం అనుమతుల్లేకుండానే రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి పని కానిచ్చేస్తున్నారు. వారు రూ.లక్షల్లో ఆదాయం ఆర్జిస్తున్నా.. కార్పొరేషన్‌కు మొండిచేయి చూపుతున్నారు. మరోవైపు అనుమతులు తీసుకున్న ఏజెన్సీలు ఏళ్ల తరబడి బకాయిలు చెల్లించడం లేదు. అవి రూ.కోట్లలో పేరుకుపోయాయి. దీనిపై కౌన్సిల్ సమావేశాల్లో



చర్చ జరుగుతున్నా.. అధికారులు మిన్నకుండిపోతున్నారు. 2024–25లో కొత్తగా బోర్డులు నెలకొల్పడానికి అనుమతులివ్వలేదని మూడు నెలల క్రితం అధికారికంగానే ప్రకటించారు. కానీ.. డిస్‌ప్లే డివైజ్ ఫీజు కింద అరియర్స్‌తో కలిపి రూ.15.18 కోట్ల డిమాండ్‌కుగాను రూ.10.20 కోట్లు వసూలు చేసినట్టు చూపించారు. ఇంకా రూ.5 కోట్ల మేర బకాయిలున్నట్టు గత కౌన్సిల్‌లో ప్రస్తావిం చారు. ఒక సంస్థ రూ.3.77 లక్షలు, మరో సంస్థ రూ.27 లక్షల బకాయి ఉన్నట్టు తాజా కౌన్సిల్ సమావేశంలో లెక్కలు చూపించారు. పేర్లు మార్చి.. ఏమార్చి.. బకాయిలు ఎగ్గొట్టడానికి కొంతమంది గుత్తేదారులు తమ సంస్థల పేర్లు మార్చేసి కొత్తగా దరఖాస్తు చేస్తున్నారు. అధికారులు దీన్ని పట్టించుకోకుండా ఆమోదించేస్తున్నారు. మరికొంతమందైతే కాసులకు కక్కుర్తి పడి అక్రమాలకు సహకారం అందిస్తున్నారు. ప్రభుత్వం తాజాగా అమల్లోకి తెచ్చిన నిబంధనలను ఇక్కడ ఏమేరకు అమలు చేస్తారన్నది ప్రశ్న. కూలే స్థితిలో... నగరంలో చాలా బోర్డులకు స్ట్రక్చర్ స్టెబిలిటీ లేదు. ఏ బోర్డు కూలుతుందో.. ఎవరి నెత్తిన పడుతుందో తెలియని పరిస్థితి.




## చూపులతోనే హృదయాలు దోచుకుంటున్న అనుపమ!

అనుపమ పరమేశ్వరన్ ఈ మధ్యకాలంలో ఏం చేసినా అది సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గానే నిలుస్తోంది. టిల్లు స్క్వేర్ మూవీతో తన రూట్ మార్చిన ఈ ముద్దుగుమ్మ వరుస ఫోటోషూట్స్, వరుస సినిమాలతో ఊపు మీద ఉంది.అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా తన ఇన్స్టా ఫోటోలతో మరోసారి స్పెషల్ మీడియాలో హైలెట్ గా నిలిచింది. తాజాగా ఎల్లో కలర్ క్రాప్ టాప్ లో ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇందులో గోల్డెన్ కలర్ టాప్ ఎల్లో కలర్ బాటమ్ తో ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. స్లీవ్ లెస్ గోల్డెన్ కలర్ టాప్ లో తళుక్కుమని మెరిసిపోతుంది.. అంతేకాదు చెవులకు పెద్ద చెవి దుద్దులను పెట్టి తన లుక్ లో చెవి దుద్దులనే హైలెట్ చేసింది. రింగుల జుట్టుతో మత్తెక్కించే కళ్ళతో ఉన్న ఈ ఫోటోలు సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. ఈ హాట్ ఫోటోలను చూస్తే ఎవరైనా సరే అనుపమ అందానికి ఫిదా అవ్వాల్సిందే. అలా ఫోటోలతో కుర్రకారు గుండెల్లో మంట పెట్టిన అనుపమ పరమేశ్వరన్ ఇలాంటి ఫోటోల వల్లే సోషల్ మీడియాలో మరింత ఫేమస్ అవుతుంది. ముఖ్యంగా ఈ హీరోయిన్ ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో సాంప్రదాయమైన లుక్ తో అందరినీ కట్టిపడేసింది. కానీ రాను రాను అందరిలాగే ఈ హీరోయిన్ కూడా



తయారైంది అనేలా కొన్ని విమర్శలు ఎదుర్కుంది. ఎందుకంటే సినిమాల్లోకి వచ్చినా కొత్తలో అనుపమ పరమేశ్వరన్ ఒక్క సినిమాలో కూడా బోల్డ్ పాత్రలో నటించలేదు. పొట్టి బట్టలు వేసుకోలేదు. కానీ రౌడీ బాయ్స్ సినిమాతో రూట్ మార్చేసింది. ఈ సినిమాలో కాస్త బోల్డ్ గా నటించడంతోపాటు రొమాంటిక్ సన్నివేశాల్లో రెచ్చిపోయి నటించింది. దాంతో ఈ హీరోయిన్ ని ఇలాంటి పాత్రలో కూడా తీసుకోవచ్చని దర్శక నిర్మాతలకు ఓ క్లారిటీ వచ్చింది. డీజే టిల్లు సినిమాకి సీక్వెల్ గా వచ్చిన టిల్లు స్క్వేర్ సినిమాలో మాత్రం పూర్తి బోల్డ్ గా కనిపించింది. పొట్టి పొట్టి బట్టలు వేయడంతో పాటు లిప్ లాక్ లతో రెచ్చిపోయి అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే అప్పటివరకు ఈ హీరోయిన్ ని అభిమానించిన అభిమానులు కూడా ఇదేంటి ఈ హీరోయిన్ ఇలా మారిపోయింది అని నోరెళ్లబెట్టి టిల్లు స్క్వేర్ సినిమాలో ఆమె పర్ఫామెన్స్ ను చూసి షాక్ అయిపోయారు. అయితే అలాంటి అనుపమ పరమేశ్వరన్ టిల్లు స్క్వేర్ సినిమా తర్వాత బోల్డ్ పాత్రలకు కూడా ఓకే చెప్పి మరిన్ని అవకాశాలు అందుకుంటుంది.అలా ఈ హీరోయిన్ టిల్లు స్క్వేర్ మూవీ తర్వాత పరదా అనే లేడీ ఓరియంటెడ్ మూవీ తో వచ్చింది. పరదా అనే డిఫరెంట్ కాన్సెప్ట్ ఉన్న మూవీని ఎంచుకొని సమాజంలో ఆడవాళు ఎదుర్కొనే ఇబ్బందుల గురించి ఈ సినిమాలో చూపించగా.. అందులో అద్భుతంగా నటించింది. కానీ ఈ సినిమా పెద్దగా విజయం సాధించలేదు. ఆ తర్వాత వెంటనే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో కిష్కింధపురి అనే మూవీ తో వచ్చి దెయ్యం పాత్రలో అందర్నీ భయపెట్టేసింది. అలా వరుస సినిమాలు చేస్తూ సౌత్ ఇండస్ట్రీలో బిజీ బిజీగా ఉంటున్న ఈ హీరోయిన్ చేతిలో ప్రస్తుతం ఎల్ క్లాసికో,ది పెట్ డిటెక్టివ్ అనే మలయాళ సినిమాలతో పాటు తెలుగులో భోగి, తమిళంలో బైసన్ అనే సినిమాలు ఉన్నాయి.

## గ్లామర్ వర్క్ అవుట్ కాలేదని ఈసారి అలా..?

మహానటి కీర్తి సురేష్ సౌత్ లో తన ఫాలోయింగ్ ఒక రేంజ్ లో ఉన్నా కూడా బాలీవుడ్ లో కూడా తన సత్తా చాటాలని ఒక అటెంప్ట్ చేసింది. బేబీ జాన్ అంటూ అమ్మడు చేసిన ప్రయత్నం వర్క్ అవుట్ కాలేదు. సౌత్ లో చాలా క్లీన్ ఇమేజ్ తో ట్రెడిషనల్ లుక్స్ తో కనిపించిన కీర్తి సురేష్ ఒక్కసారి బాలీవుడ్ నీళ్లు పడ్డాయో లేదో థై షోస్ తో అదరగొట్టేసింది. కీర్తి సురేష్ సౌత్ లో ఇన్ని సినిమాలు చేసినా కూడా చేయని గ్లామర్ షో బేబీ జాన్ లో గుమ్మరించేసింది. ఐతే అదంతా బీ టౌన్ ఆడియన్స్ మెప్పు కోసమే అని తెలుస్తున్నా కూడా అమ్మడు ఈ రేంజ్ గ్లామర్ షో అయితే ఆమె ఫ్యాన్స్ ఎక్స్ పెక్ట్ చేయలేదు.

**బేబీ జాన్ కి బిఫోర్ రిలీజ్ మంచి బజ్..** ఐతే గ్లామర్ షో వల్ల బేబీ జాన్ కి బిఫోర్ రిలీజ్ మంచి బజ్ వచ్చినా సినిమాలో మ్యాటర్ లేకపోవడం వల్ల రిజల్ట్ రివర్స్ అయ్యింది. ఐతే నెక్స్ట్ గ్లామర్ షో కాకుండా ఈసారి కీర్తి సురేష్ ఒక మంచి సినిమాతో మరో ప్రయత్నం చేస్తుంది. అదే శిక్షక్. బాలీవుడ్ టాలెంటెడ్ యాక్టర్ రాజ్ కుమార్ రావు నటిస్తూ నిర్మిస్తున్న ఈ సినిమాలో కీర్తి సురేష్ ఛాన్స్ అందుకుంది. ఈ సినిమాను



ఆదిత్య నింబల్కర్ డైరెక్ట్ చేస్తున్నారు. ఇండియన్ ఎడ్యుకేషన్ సిస్టం నేపథ్యంతో ఈ సినిమా వస్తుందని తెలుస్తుంది. సినిమాలో టానియా మనిక్తల కూడా ప్రధాన పాత్రలో నటిస్తుంది. ఐతే కీర్తి సురేష్ కి సౌత్ లో మంచి నటీమణిగా పేరు ఉంది. అలాంటి పాత్రలో హిందీలో కూడా అదరగొట్టేస్తుంది. బేబీ జాన్ తో తప్పు జరిగినా ఈసారి రాబోతున్న సినిమాల విషయంలో మాత్రం అమ్మడు అసలు తప్పు చేయకూడదు అనుకుంటుంది. ఈ క్రమంలోనే అమ్మడు శిక్షక్ ఛాన్స్ అందుకుంది. ఇక అమ్మడి తెలుగు సినిమాల విషయానికి వస్తే విజయ్ దేవరకొండ తో రౌడీ జనార్ధన్ సినిమా చేస్తున్న కీర్తి సురేష్ నెక్స్ట్ ఎల్లమ్మ సినిమాలో కూడా కథానాయికగా నటిస్తుందన్న టాక్ ఉంది. వేణు యెల్దండి డైరెక్షన్ లో తెరకెక్కబోతున్న ఎల్లమ్మ సినిమా ఫైనల్ కాస్టింగ్ పై ఇప్పటివరకు క్లారిటీ రాలేదు. కీర్తి సురేష్ కి ఆ ఛాన్స్ వస్తే మాత్రం మరోసారి అవార్డ్ గ్యారెంటీ అనేలా స్క్రిప్ట్ ఉందని తెలుస్తుంది. కీర్తి సురేష్ కూడా మళ్లీ టాలీవుడ్ లో గ్రిప్ సాధించేందుకు అమ్మడు గురి పెట్టింది. రాబోతున్న రెండు సినిమాలు తప్పకుండా తెలుగులో మళ్లీ కీర్తి సురేష్ ని తిరిగి ఫాం లోకి వచ్చేలా చేస్తాయన్న టాక్ ఉంది. అటు బాలీవుడ్ లో కూడా తన ప్రయత్నాలను ఆపట్లేదు కీర్తి సురేష్.

## శ్రీరామనవమికి వారణాసి రిలీజ్ డేట్ లాక్?




సూపర్ స్టార్ మహేష్ బాబు- రాజమౌళి కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న చిత్రం వారణాసి. పాన్ వరల్డ్ లెవెల్ లో చిత్రీకరణ జరుపుకొంటోందీ మూవీ. గత ఏడాది నవంబర్ లో రిలీజ్ అయిన టైటిల్ గ్లింప్లెస్ ఈ సినిమాపై హైఎక్స్ పెక్టేషన్స్ ఇచ్చాయి. సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చాయి. రుద్రగా గతంలో ఎప్పుడో చేయని రోల్ లో మెరుపులు మెరిపించబోతోన్నాడు మహేష్ బాబు. ప్రియాంక చోప్రా, మలయాళ సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ది ఇందులో కీ రోల్. ఈ సినిమాపై తాజా సమాచారం వెలువడింది. 2027లో విడుదల కాబోతోంది. ఈ విషయాన్ని వారణాసి యూనిట్ అధికారికంగా వెల్లడించింది. COMING IN 2027 అని అధికారికంగా ప్రకటించింది. ఎక్స్ అకౌంట్ లో దీన్ని షేర్ చేసింది. టైటిల్ గ్లింప్సెస్ సమయంలో విడుదల చేసిన ఓ 26 సెకెన్ల నిడివి ఉన్న వీడియోను దీనికి యాడ్ చేసింది. విడుదల సంవత్సరాన్ని బహిరంగంగా ప్రకటించినప్పటికీ.. తేదీ ఇంకా కన్ఫర్మ్ చేయలేదు. 2027 ఏప్రిల్ 9వ తేదీన శ్రీరామనవమి పండగ సందర్భంగా ఈ చిత్రం థియేటర్లలోకి వస్తుందని తెలుస్తోంది. " వారణాసిలో ముఖ్యమైన రామాయణ ఎపిసోడ్?ను చిత్రీకరించినట్లు సినిమా టైటిల్ గ్లింప్స్ ఈవెంట్ సందర్భంగా ఎస్ ఎస్ రాజమౌళి వెల్లడించిన విషయం తెలిసిందే. సంజీవినీ పర్వతాన్ని తీసుకొచ్చిన హనుమంతుడి ఉదంతం ఈ సినిమా ప్రధాన కథాంశంగా అప్పట్లో చెప్పారాయన. ఎటు తిరిగి రామాయణం బ్యాక్ గ్రౌండ్ కావడం వల్ల 2027 ఏప్రిల్ 9వ తేదీన శ్రీరామనవమి నాడు సినిమా విడుదల అయ్యే అవకాశాలు లేకపోలేదు. ఈ ఒక్క రామాయణం ఎపిసోడ్?ను 60 రోజులు చిత్రీకరించింది యూనిట్. తన చిన్నతనం నుండీ రామాయణ మహాభారతాలు అంటే ఎంతో ఇష్టమని, వాటిని అంతే అద్భుతంగా తెరకెక్కించడం తన కలల ప్రాజెక్ట్ అని చాలాసార్లు చెప్పారు. రాజమౌళి. రామాయణం నుండి ఒక ముఖ్యమైన ఎపిసోడ్‌ను ఇంత త్వరగా చిత్రీకరించే అవకాశం వస్తుందని నేను ఎప్పుడూ ఊహించలేదని అన్నారు. శ్రీరాముడి గెటప్ లో మహేష్ బాబును చూసినప్పుడు గూస్?బంప్స్ వచ్చాయిని, ఆ ఫోటోను వాల్‌పేపర్‌గా కూడా పెట్టుకుని, ఎవరూ చూడకూడదనే ఉద్దేశంతో తీసేశానని వివరించారు.

## ఆ స్టార్ హీరో ఈసారి పాత పద్ధతిలోనా?



కోలీవుడ్ స్టార్ సూర్య సరైన సక్సస్ అందుకుని చాలా కాలమవుతోంది. జైభీమ్ తర్వాత సరైన సక్సెస్ ఒక్కటీ పడలేదు. జైభీమ్ కూడా ఓటీటీ రిలీజ్ కావడంతో థియేట్రికల్ గా ఆడియన్స్ దూరంగానే కనిపించింది. కానీ ఆ సినిమాతో సూర్యకు వచ్చిన గుర్తింపు మాత్రం ఎంతో ప్రత్యేకమైనది. ఆ తర్వాత వరుసగా రిలీజ్ అయిన నాలుగైదు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. ప్రత్యేకించి ఆ సినిమా రిలీజ్ లు కూడా అన్నీ తమిళ టైటిల్స్ తో తెలుగు లో రిలీజ్ అయ్యాయి. టైటిల్ మార్చాల్సిన ఆవశ్యకత లేకపోవడంతో అదే టైటిల్ తో ఏక కాలంలో రిలీజ్ చేసారు.

**తెలుగులో తమిళ టైటిల్స్ వాసన:** ఈటీ,కంగువ, రెట్రో లాంటి చిత్రాల టైటిల్స్ లో ఎలాంటి మార్పు కనిపించలేదు. ఈ నేపథ్యంలో తెలుగు టైటిల్ లేకుండా తమిళ సినిమా రిలీజ్ ఏంటనే విమర్శలు వ్యక్తమయ్యాయి. అంతకు ముందు మరికొంత మంది హీరోలు నటించిన సినిమాలు కూడా ఇలాగే రిలీజ్ అయ్యాయి. దీంతో టాలీవుడ్ నుంచి కాస్త నెగివిటీ కూడా మొదలైంది. కానీ తెలుగు అభిమానులంటే సూర్య ఎంతో గౌరవిస్తారు. ఆయన్ని ఇక్కడ ఆడియన్స్ ఎంతో ఆదరిస్తారు. తమిళ అభిమానుల కంటే తనకు ఓ మెట్టు పైనే తెలుగు అభిమానులుంటారు. సూర్య లాగే కార్తీ కూడా ఇక్కడ అభిమానులకు అంతే ప్రాధాన్యత ఇస్తారు.

**పోటీ కూడా అడ్డంకిగా:** తమిళ నుంచి ఎంత మంది హీరోలున్నా? అన్నదమ్ములిద్దరు మాత్రం తెలుగు ఆడియన్స్ కు ఎంతో ప్రత్యేకం. ఆ సంగతి పక్కన బెడితే తదుపరి సినిమా రిలీజ్ విషయంలో సూర్య సంచలన నిర్ణయానికి అవకాశం ఉందా? అంటే ఉందనే చప్పొచ్చు. సూర్య నటించిన కరుప్పు సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ ఆ సీజన్ లో తమిళ సహా తెలుగు నుంచి చాలా సినిమాలు రిలీజ్ కు ఉండటంతో? సూర్య ఉన్న తాజా పరిస్థితుల్లో వాళ్లకు పోటీగా రావడం కంటే పోటీ లేని సమయంలోనే వస్తే బాగుంటుంది అన్న ఆలోచనతో వెనక్కి తగ్గినట్లు తెలిసింది.

**గత సినిమాల వైఫల్యం నేపథ్యంలో:** ఈ నేపథ్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26 కరుప్పు ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేసుకుంటున్నారుట. అయితే ఈ సినిమాకు తెలుగు లో టైటిల్ ఉండాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. సూర్య గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తెలుగు అభిమానుల కోసం తెలుగు టైటిల్ తో రావాలని ఆశీస్తున్నారు. అందుకు సూర్య ఎంత మాత్రం అడ్డు చెప్పే న టుడు కాదు. గత సినిమాల వైఫల్యం నేపథ్యంలో ఈసారి తెలుగు టైటిల్ తోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మధ్యలో దర్శక , నిర్మాతలు మాతృభాషపై అతి మమకారంతో ఎలాంటి రాజకీయాలకు పాల్పడకుండా ఉంటే సాధ్యమే.

## బ్లాక్ అవుట్ ఫిట్ లో మరింత అందంగా!

మృణాల్ ఠాకూర్.. ప్రముఖ డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటించిన పూర్తి స్థాయి తొలి తెలుగు చిత్రం 'సీతారామం'. ఈ సినిమా కంటే ముందు మహానటి సావిత్రి బయోపిక్ ఆధారంగా వచ్చిన 'మహానటి' సినిమాలో జెమినీ గణేషన్ పాత్ర పోషించిన ఈయన.. ఆ తర్వాత సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సినిమా ద్వారానే తెలుగు ప్రేక్షకులను పలకరించింది మృణాల్ ఠాకూర్. ఇందులో సాంప్రదాయంగా చీరకట్టులో కనిపించి, సీత పాత్రతో అందరి హృదయాలను దోచుకుంది. ఇందులో ఆమె చీరకట్టు బొట్టు అభిమానులను ఆకట్టుకోవడమే కాకుండా తెలుగు సినీ ప్రేక్షకులు కూడా ఈమెను సొంత అమ్మాయిగా ఓన్ చేసేసుకున్నారు. అంతేకాదు



పలు చిత్రాలలో అవకాశాలు ఇవ్వాలని అభిమానులు కూడా డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.అలా సీతారామం విజయం సాధించడంతో నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన 'హాయ్ నాన్న' సినిమాలో జోష్ణ పాత్రతో మరొకసారి పలకరించింది. ఈ సినిమాతో కూడా మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ తో కలిసి 'ది ఫ్యామిలీ స్టార్' సినిమా చేసింది. కానీ ఈ సినిమా పెద్దగా విజయాన్ని అందించలేదు. ఇప్పుడు అడివి శేష్ హీరోగా నటిస్తున్న డెకాయిట్ సినిమా నుండి శృతిహాసన్ తప్పుకోవడంతో ఆ స్థానాన్ని భర్తీ చేసిన మృణాల్ త్వరలోనే ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇదిలా ఉండగా తాజాగా ఈ ముద్దుగుమ్మ ఇంస్టాగ్రామ్ ద్వారా షేర్ చేసిన కొన్ని ఫోటోలు అభిమానులను, ఫాలోవర్స్ ను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి .

అందులో బ్లాక్ ఔట్ఫిట్ లో కనిపించిన ఈమె తన అందంతో అబ్బురపరిచింది. విషయంలోకి వెళ్తే.. ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ లో జరి గిన బ్వుగారి సెర్పెంటి ఇన్ఫినిటీ ఎగ్జిబిషన్ కి టాలీవుడ్ బాలీవుడ్ అని తేడా లేకుండా చాలామంది నటీమణులు తమ ఫ్యాషన్స్ సెన్స్ తో సందడి చేశారు. అందులో భాగంగానే హీరోయిన్ మృణాల్ ఠాకూర్ కూడా హాజరయ్యింది.ఇందులో మృణాల్ ఠాకూర్ ఎగ్జిబిషన్లో లీనమై ఆర్ట్ ఇన్స్టాలేషన్ మధ్య అద్భుతమైన నల్లటి ఔట్ఫిట్ లో ఫోటోలకు ఫోజులిచ్చింది.

## రాశీఖన్నాలో అసంతృప్తి..ఆవేదన!

సినిమా ఇండస్ట్రీలో ఛాన్సులు రావాలంటే? వివాదాలకు వెళ్లకుండా కామ్ గా ఉంటేనే సాధ్యమవుతుంది. తప్పు అయినా సరే అక్కడ ప్రశ్నించడానికి ఉండదు. గొంతెత్తి మాట్లాడితే? బ్యాకెండ్ లో తొక్కే ప్రయత్నాలు అంతే సీరియస్ గా జరుగుతుంటాయి. ఇది అందరికీ తెలిసిందే? అందుకే ఇండస్ట్రీలో ఉన్న ఎవరూ వివాదాల జోలికి వెళ్లరు. ఎప్పుడైనా ఏదో అంశంపై వివాదాలు తలెత్తినా మాట్లాడానికి విముఖత చూపిస్తుంటారు. కానీ లోలోపల మాత్రం లావా మరుగుతూనే ఉంటుంది. అది అగ్ని పర్వతం రూపంలో ఎలా బయట పడుతుందన్నది చెప్పలేం. కానీ సమయం వచ్చిందంటే బ్లాస్ట్ మామూలుగా ఉండదు. తాజాజా రాశీఖన్నా అలాగే బ్లాస్ట్ అయింది. రాశీఖన్నా అంటే ఇంత వరకూ కామ్ గోయింగ్ హీరోయిన్ అనే పేరు ఉంది. ఎలాంటి వివాదాల్లో వేలు పెట్టదు. తన పని తాను చేసుకుని పోవడం తప్ప! పరిశ్రమ అంతర్గత విషయాలు వేటిలోనూ ప్రవేశించదనే అభిప్రాయం ఉంది. కానీ సమయం వస్తే తాను కూడా శివంగిలా మారుతుందని ప్రూవ్ అయింది. తాజాగా అమ్మడు ఆన్



సెట్స్ లో సమానత్వం గురించి బ్లాస్ట్ అయింది. నటీనటుల మార్కెట్ విలువ ఎలా ఉన్నా? సినిమా సెట్స్‌లో మాత్రం అందరికీ సమాన గౌరవం దక్కాలని అభిప్రాయపడింది. దేశంలో చాలా కాలంగా హీరో వర్షిప్ కల్చర్ ఉందని, హీరోల బాక్సాఫీస్ వసూళ్ల ఆధారంగా వారిని నమ్మడం నిజమే. కానీ మార్కెట్ అనేది జెండర్ పై కాకుండా ట్యాలెంట్ పై ఆధారపడాలంది. ఎవరికి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇవ్వాలన్నది మార్కెట్ మాత్రమే నిర్ణయిస్తుందన్నారు. తక్కువా? ఎక్కువా? అనే భావన ఆన్ సెట్స్ లో చూపించకూడదంది. మహిళా నటులకు మంచి సదుపాయాలు, వారికి లభించే గౌరవం ఎంత మాత్రం తగ్గకూడదంది. దీంతో ఇప్పుడీ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. రాశీఖన్నా ఇంత వరకూ ఎక్కడా ఇలాంటి వ్యాఖ్యలు చేయలేదు. తెలుగులో చాలా సినిమాలు చేసింది. ఇక్కడ నటీనటులు, దర్శక, నిర్మాతలతో మంచి స్నేహం ఉంది. ఎలాంటి వివాదాలు కూడా ఆమె పై లేవు. అయితే రాశీఖన్నా ఈ మధ్య తెలుగు సినిమాల కంటే తమిళ, హిందీ సినిమాలకే ఎక్కువగా పని చేస్తోంది. అక్కడ ఎదురైన అనుభవాలు ఆధారంగా ఇలా స్పందించిందా? అన్న సందేహం నెటి జనులు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రాశీఖన్నా తెలుగులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తోన్న ఉస్తాద్ భగత్ సింగ్‌లో నటిస్తోంది. బాలీవుడ్ లో రెండు సినిమాలు..కోలీవుడ్ లో ఓ చిత్రం చేస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536